# భాగవతంలో చిన్నకథలు



ప్రయాగ రామకృష్ణ

భాగవతంలో

# చిన్నకథలు

ప్రయాగ రామకృష్ణ

# భాగవతంలో చిన్నకథలు

ప్రయాగ రామకృష్ణ

మొదటి ముద్రణ : జనవరి 2015

ప్రతులు : 1000

కాపీరైట్: సర్వహక్కులు రచయితవి.

వెల : ₹ 125

$ 10

ముఖచిత్రం : వాసు

లోపలి బొమ్మలు : బాపు

పేజ్ లేఅవుట్ : షకీల్ అహ్మద్

పుస్తకాలు లభించు స్థలము:

**ప్రయాగ రామకృష్ణ**

30–265/25/9/3,

వెంకటేశ్వర నగర్, ఎక్స్‌టెన్షన్ 2,

ఆర్.కె.పురం పోస్టు, సికింద్రాబాద్–56.

ఫోన్: 9849990107

మరియు

**అన్ని ప్రముఖ పుస్తక విక్రయకేంద్రాలు**

ముద్రణ : కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్,

విద్యానగర్, హైదరాబాద్ – 44

ఫోన్: 040–27618261

# ఇదీ వరుస....


| | | |
|---|---|---|
| 1. | సుతపుడు - పృశ్ని | 1 |
| 2. | అదితి - దితి | 4 |
| 3. | కంసుడు | 6 |
| 4. | శ్రీకృష్ణ జననం | 10 |
| 5. | యోగమాయ | 14 |
| 6. | పూతన | 17 |
| 7. | శకటాసురుడు | 21 |
| 8. | తృణావర్తుడు | 24 |
| 9. | బలరామకృష్ణులు | 27 |
| 10. | మాతృ దండన | 32 |
| 11. | బృందావనం | 37 |
| 12. | బకాసురుడు | 41 |
| 13. | అఘుడు | 44 |
| 14. | కృష్ణమాయ | 46 |
| 15. | ధేనుకాసురుడు | 49 |
| 16. | కాళియుడు | 51 |
| 17. | వేదశిరుడు - అశ్వశిరుడు | 56 |
| 18. | ప్రలంబుడు | 58 |
| 19. | మహేంద్ర గర్వభంగం | 61 |
| 20. | గోవర్ధనగిరి | 64 |
| 21. | సుదర్శనుడు | 66 |
| 22. | వృషభాసురుడు - వ్యోమాసురుడు | 69 |
| 23. | అక్రూరుడు | 72 |

| | | |
|---|---|---|
| 24. | కృష్ణలీల | 75 |
| 25. | కంసభృత్యుడు | 78 |
| 26. | సుదాముడు – కుబ్జ | 81 |
| 27. | మందగతి | 84 |
| 28. | చాణూర ముష్టికులు | 87 |
| 29. | కంస సంహారం | 90 |
| 30. | కాలయవనుడు | 93 |
| 31. | రుక్మిణీకృష్ణులు | 97 |
| 32. | సత్రాజిత్తు | 101 |
| 33. | రాధాకృష్ణులు | 105 |
| 34. | ఘంటాకర్ణుడు | 109 |
| 35. | పౌండ్రకుని గర్వభంగం | 112 |
| 36. | కృష్ణుడు–కుచేలుడు | 115 |
| 37. | నరకాసురుడు | 120 |
| 38. | బాణాసురుడు | 124 |
| 39. | మాతృవాంఛ | 127 |
| 40. | అర్జునుడి అగ్నిప్రవేశం | 130 |
| 41. | మనసుకో మాధవుడు | 133 |
| 42. | రాయబారం | 137 |
| 43. | ఘటోత్కచుడు | 140 |
| 44. | గాంధారి శాపం | 143 |
| 45. | యాదవ ముసలం | 146 |
| 46. | శ్రీకృష్ణ నిర్యాణం | 150 |

☎ : 27633936
27633937
27635545

RAMAKRISHNA MATH
(A branch centre of
Ramakrishna Math, Belur, Howrah)
Ramakrishna Math Marg
Domalguda, Hyderabad - 500 029

# ముందుమాట

వ్యాసప్రోక్తమైన భాగవతం ఆస్తికత్వాన్ని, భక్తియోగాన్ని, అవతారతత్త్వాన్ని ప్రతిపాదిస్తుంది. జటిలమైన వేదాంత శాస్త్రాన్ని లోకానికి అందజేసినా వ్యాసమహర్షి హృదిలో తెలియని ఆవేదన ఏదో కదలాడగా, దాని నివారణకై చేసిన ప్రయత్నమే భాగవత రచనకు నాంది పలికింది. ఇందు భగవద్భక్తిని గురించి ప్రత్యేకంగా వివరిస్తూ, భక్తి లేనిదే ముక్తి సాధ్యం కాదని తెలిపారు. అంతేకాక అవతారతత్త్వాన్ని ఇందు సమగ్రంగా విశదీకరించారు. అందువలన వ్యాస మునీంద్రులకే కాక, యుగయుగాంతరాల నుండి భాగవతం చదివే ప్రజానీకం అందరికీ చిత్తశాంతిని ప్రసాదిస్తూనే ఉంది!

ఈ భాగవత కథామృతం జ్ఞానానికి ప్రతీక అయిన వ్యాసభగవానుని ఘంటం నుండి జాలువారి, విరాగి అయిన శుకబ్రహ్మ వాక్కు ద్వారా వెలువడి, భక్తుడైన పరీక్షిత్తు హృదయమందు నిలిచింది. అందువలననే భాగవతం, భక్తి, జ్ఞాన, వైరాగ్య రూపంగా విరాజిల్లుతోంది.

భాగవతమైన భాగవతం ఆధ్యాత్మిక లోతులను కలిగిన ఆనంద రసమయసాగరం. భవరోగ నివారణకు దివ్య ఔషధం. ఇటువంటి భాగవతాన్ని చదువరులకు ఆసక్తి కలిగించే విధంగా చిన్న కథల రూపంలో అందించేందుకు ప్రయత్నించిన శ్రీ ప్రయాగ రామకృష్ణ గారి కృషి అభినందనీయమైనది. సరళమైన శైలిలో, సర్వజనరంజకంగా, ఆసక్తికరంగా ఉండేందుకు ఆయన చేసిన ప్రయత్నం ప్రశంసనీయం.

స్వామి జ్ఞానదానంద
అధ్యక్షులు

# శ్రీ ప్రయాగ ప్రకృష్ట యాగం

**– శ్రీదత్తప్రసాద్ పరమాత్ముని**

తరతరాలుగా నిరంతరంగా ఈ జాతి శ్రవణేంద్రియాల్లో భాగవతంలోని కథలు ప్రతినిధ్వనిస్తూనే ఉన్నాయి. ఈ జాతి హృదయ గహ్వరాల్లో ఈ కథలు నిక్షిప్తాలై ఉండనే ఉన్నాయి. ఓ దేవకి, ఓ వసుదేవుడు, ఓ నందుడు, ఓ యశోద, ఓ ఉద్ధవుడు, ఓ అక్రూరుడు, ఇల్లా భాగవతంలోని ఎన్నో పాత్రలు ఈ జాతికి చిరపరిచితమైన నేస్తాలు. బలరామకృష్ణులు ఆత్మీయబంధువులు. ఈ జాతి జనులు నివసించే ప్రతి ప్రాంతమూ ఓ గోకులమే, ఓ బృందావనమే! గోపికలంతా ఈ జాతి ఇంటి ఆడపడుచులే!

ఏ అమ్మమ్మ అయినా, ఏ బామ్మ అయినా, మనమణ్ణో, మనుమరాలినో, తన గుండెలపై పరుండబెట్టుకొని భాగవతంలోని చిన్నికథల్ని చెబుతూ, శ్రీకృష్ణ సంకీర్తనం చేయిస్తూ, చిచ్చికొడుతూ నిద్రపుచ్చటం ఈ జాతివర్తనలో సర్వ సాధారణమైన దృశ్యం. బహుళ ప్రచారంలో ఉన్న భాగవతంలోని చిన్ని చిన్ని కథల్ని, 'మరల అదేల రామాయణంబని...' విశ్వనాథ వారు అన్నట్లు, తిరిగి వ్రాసి మళ్ళీ పాఠకుల ఆమోదాన్ని పొందగలిగారు శ్రీ ప్రయగ రామకృష్ణ. ఇది శ్రీ ప్రయాగవారు చేసిన ప్రకృష్ట యాగమే! ప్రయాగమే! మళ్ళీ ఈ భాగవతంలోని చిన్నకథలు, నవ్యవార పత్రికలో ధారావాహికంగా పరంపరగా ప్రచురితమై, ప్రజామోదాన్ని పొందగలగటానికి, భాగవతంలోని కథల నిత్యమైన సత్యమైన ఆకర్షణ ఒక ఎత్తయితే, రామకృష్ణగారి కథాకథనశైలిలోని మాధుర్యం మరో బలవత్తరమైన ఆకర్షణ అయి నిలిచింది. శ్రీ ప్రయాగ వారి ఘంటం కవితాజలంలో కలువపువ్వయి నర్తించింది. కవితావనంలో లేడిపిల్లయి చెంగు చెంగున గెంతింది.

**'శ్రీమన్నారాయణుడు చిన్నికృష్ణుడై దేవకి గర్భాన జన్మించాడు.**

**వసుదేవుడు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యాడు**
**కానీ పిచ్చితల్లి దేవకి మాత్రం కన్నీరు మున్నీరుగా విలపించింది. సిరులొలుకుతున్న తన చిన్నారిబిడ్డను గుండెలకు హత్తుకొని పొర్లిపొర్లి ఏడ్చింది' – శ్రీకృష్ణజననం**

కథను శ్రీ ప్రయాగ ఇక్కడ ఆపేసారు.

పుట్టబోయే బుడతడు సాక్షాత్తు శ్రీహరియే అని నారదాదులు చెప్పనే చెప్పారు. గుండెలకు హత్తుకున్న ఆ చిన్నారి సిరులొలుకుతూ, శ్రీలక్ష్మి సమేతుడై ఉన్నాడు. అయినా ఎందులకీ కన్నీరు? కంస భయమా? విడవలేని వ్యామోహమా? అన్న సంశయం పాఠకులకు కలుగుతుంది.

ఇంతటితో శ్రీకృష్ణజననం కథ (ఎపిసోడ్) ముగిసింది. యోగమాయ అన్న కథ ఆరంభమైంది.

'అమ్మ ఏడుపు బిడ్డ విన్నాడు. దేవకి భయం లీలాకృష్ణుడు పసికట్టాడు. శ్రీమన్నారాయణుడు నిజరూపంలో ప్రత్యక్షమైనాడు' ఇలా యోగమాయ కథను శ్రీ ప్రయాగ ఆరంభిస్తారు.

ఒక కథ ముగింపులోని కథనం మరో కథ ఆరంభంతో చేయి చేయి కలిపింది. ఏకసూత్రత పరిఢవిల్లింది. కథనంలో నాటకీయత, రామణీయకత పొంగిపొర్లి కవితావిన్యాసమై చెలరేగింది. ఎపిసోడ్లను విభజించటంలోనూ, ఒక కథముగింపు మరో కథ ఆరంభాన్ని ఆలింగనం చేసుకోవటంలోనూ, రామకృష్ణగారి శైలీ విన్యాసం పాఠకుల్ని ఆకట్టుకుంటుంది.

వసుదేవుడు శిశువునెత్తుకొని గోకులానికి వెళ్ళే సన్నివేశాన్ని పరిశీలిద్దాం.

'శిశువైన కృష్ణయ్యను ఎత్తుకొని వసుదేవుడు యమునానదిని సమీపించాడు. శ్రీహరి శిశురూపంలో తనను సమీపించాడని తెలుసుకొని యమున సంతోషంతో పరవశించింది. వెంటనే రెండుగా చీలి వసుదేవునికి దారి ఇచ్చింది' అన్నారు శ్రీ ప్రయాగ.

యమున వసుదేవునికి దారినిచ్చే ఘట్టంలో, శ్రీప్రయాగ రామకృష్ణ కవి హృదయం యమున అంతరంగంలోకి తొంగి చూచింది. పరమాత్మ దర్శనంతో పరవశించిన యమున హృదయాన్ని శ్రీ ప్రయాగవారు తడిమి చూచారు. ఆప్యాయంగా ఆర్ద్రమైన కన్నులతో దర్శించారు.

చిన్నికృష్ణుని వెన్నకృష్ణుని చిలిపిచేష్టలతో, వలపుచేష్టలతో నందగోకులం పరవశించిపోవటానికి యమున దారి చూపింది. రాసలీలకు యమున రాజమార్గాన్ని పరిచింది.

వసుదేవుడు నందగోకులం చేరి తిరిగి వెనుదిరిగే సన్నివేశంలో శ్రీ ప్రయాగ 'వసుదేవుడు నందునిగృహంలోని పురిటిగదిలోకి ప్రవేశించాడు. యశోద పక్కలో మగశిశువును పడుకోబెట్టాడు. అక్కడున్న ఆడశిశువును చేతుల్లోకి తీసుకుని ఒక్కక్షణం తనబిడ్డ వంక తదేకంగా చూసి, చెమ్మగిల్లిన కళ్ళతో గిర్రున వెనక్కి తిరిగి బయటకు వచ్చాడు. నడుస్తున్నాడే కానీ మనసంతా నల్లనయ్య మీదే ఉంది' అని వ్రాసారు.

నడుస్తున్న వసుదేవుని మనసు ఎలా నల్లనయ్య పైనే ఉందో, ఈ వాక్యాల్ని వ్రాస్తున్న శ్రీ ప్రయాగ రామకృష్ణ మనస్సు కూడా నల్లనయ్యపైనే ఉంది. గుండెల్లో ఎంతటి ఆర్ద్రత ఉంటేనో కాని, ఇలాంటి వాక్యాలు రచనల్లో జాలువారవు. ఈ వాక్యాల్లోని శబ్దాలు, అక్షరాలు ఆర్ద్రతలో తడిసి ముద్దయి, ముద్దులొలుకుతూ వ్యక్తమైనాయి. ఈ సన్నివేశంలో శ్రీ ప్రయాగ వసుదేవుని అంతరంగంతో పరిపూర్ణ తాదాత్మ్యాన్ని పొందారు. పితృహృదయంలోని ఆవేదన అక్షరాల్లో సాక్షాత్కరించింది.

శిశువైన కృష్ణునకు పూతన స్తన్యమిచ్చే ఘట్టాన్ని వీక్షిద్దాం, సమీక్షిద్దాం.

'లీలాశిశువు ఒక గుటక వేసాడు

మాయాసుందరి సౌందర్యం క్షీణించింది.

ఇంకొక గుటక వేసాడు.

ప్రాణాల్ని నలిపేసినట్లు బాధపడింది.

మరోగుటక...

పెద్దగా అరిచింది. చిన్నికృష్ణుని అవతలకు తోసెయ్యాలని ప్రయత్నించింది.

కానీ...

పిల్లవాడు ఆమెను వదిలిపెట్టలేదు.

ఇంకో గుటక వేసాడు.

రక్కసి రక్తమాంసాలన్నింటినీ పీల్చేసాడు.

దాంతో పూతన గావుకేకలు పెడుతూ గిలగిలా తన్నుకుంటూ నేలకు ఒరిగింది'

ఈ కథనంలో శ్రీ ప్రయాగ రామకృష్ణ శిశువును లీలాశిశువు అన్నారు. పూతనను మాయాసుందరి అన్నారు. ఈ ప్రయోగాలే మనసును హత్తుకునేలా ఉన్నాయి.

ఈ సన్నివేశంలోని భీభత్సరసవర్ణనలో కూడా మాధుర్యగుణం కదం తొక్కింది. గుటక గుటకనూ అభివర్ణించటంతో, ఆ సన్నివేశం కన్నుల ముందు జరుగుతున్న అనుభూతి పాఠకులకు కల్గుతుంది. ఈ సన్నివేశంలో నాటకీయత, కవితాధోరణి కలగలిసి భీభత్సరసంలో మాధుర్యాన్ని పండించాయి. కొద్ది క్షణాలు పాఠకుని మనసు నందగోకులంలో విహరిస్తుంది. ఈ సన్నివేశంతో తాదాత్మ్యాన్ని సంతరించుకుంటుంది.

శ్రీ ప్రయాగ రామకృష్ణ కవితామయమైన వచన రచనా వైభవాన్ని వర్ణిస్తూ పోతూ ఉంటే, ఆయన రచనలోని ప్రతి వచనాన్నీ ఉదహరించాల్సిందే. ఆయన వాక్యాల్ని కవిత్వంలో ముంచెత్తి మనకు అందించారు. కాళిదాసు కవిత్వంలో వేదాంతం అంతర్లీనమై ఉంటుంది. ఆదిశంకరుని వేదాంత రచనల్లో కవిత్వం పొంగిపొర్లుతుంది అన్నది విజ్ఞుల నిశ్చితాభిప్రాయం. శ్రీ ప్రయాగ వారి ఈ భాగవతంలోని చిన్నకథలు రచనలో, అటు వేదాంతం, తాత్త్వికధోరణి, ఇటు

కవిత్వ అభివ్యక్తీకరణ చెట్టాపట్టాలేసుకుని చిందులు తొక్కాయి.

శ్రీ ప్రయాగవారి గద్యరచనలో కవిత్వధోరణి అన్న ప్రసంగాన్ని ఇంతటితో ఆపి, ఆయన వచనాల్లో నిగూఢమైన తాత్త్వికసంపదను పరిశీలిద్దాం, పరిశోధిద్దాం. ఆయన రచనలో కొన్ని వాక్యాలు పైపైకి అతి సామాన్యంగా గోచరిస్తూ ఉన్నప్పటికీ, తరచి చూస్తే ఆ వాక్యాల్లో ఒక మహత్తరమైన శాస్త్రసంబంధమైన తత్త్వవైభవం మనల్ని ముగ్ధుల్ని చేస్తుంది.

శ్రీకృష్ణనిర్యాణ ఘట్టంలో, శ్రీ కృష్ణుడు దేహాన్ని వీడి, ఊర్ధ్వలోకాలకు వెళతాడు. ఇంద్రాది దేవతలు ఆయనను భక్తితో కొలిచారు. శ్రీ మహావిష్ణువు వారినందరినీ సమాదరించి తన స్వస్థానానికి అంతర్హితుడైనాడు. అప్పుడు శ్రీ ప్రయాగ రామకృష్ణ కథాంతంలో "ఇంద్రియాలకు కనిపించని ఆ పరమాత్ముణ్ణి, బుద్ధితో చూస్తూ బ్రహ్మాది దేవతలంతా తమ తమ స్వస్థానాలకు వెళ్ళిపోయారు" అని వ్రాసారు.

'పరమాత్మ ఇంద్రియగోచరుడు కాడు. అంతర్బహిరింద్రియాలకు అందని వాడు' అని అంటూనే శ్రీ ప్రయాగ బ్రహ్మాది దేవతలు ఆయనను అంతరింద్రియమైన 'బుద్ధితో చూస్తూ' అని వ్రాస్తారు. ఈ రెండు వక్కణాలు పరస్పర విరోధమైనవి. అంతర్బహిరింద్రియాలకు అందని పరమాత్మను అంతరింద్రియమైన బుద్ధితో బ్రహ్మాది దేవతలు ఎలా సందర్శించగలిగారు? అన్నది ప్రశ్న. ఇలా ప్రశ్నించుకొని వదలివేస్తే, ఈ వాక్యం అసంబద్ధం అనిపిస్తుంది. కానీ తరచి చూస్తే, శాస్త్రచర్చ చేస్తే, ఈ వాక్యంలో అసంబద్ధత లేకపోగా, సుసంబద్ధత ఉందని స్పష్టమవుతుంది.

'యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ... పరబ్రహ్మను దర్శించలేక వాక్కులు అంటే బహిరింద్రియాలైన పంచజ్ఞానేంద్రియాలు, మనసు అంటే మనో బుద్ధిచిత్తాహంకారాలనే అంతరింద్రియ చతుష్టయం వెనుదిరుగుతాయి' అన్నది తైత్తిరీయోపనిషత్తు. ఈ విషయాన్నే "ఇంద్రియాలకు కనుపించని ఆ పరమాత్ముణ్ణి'

అన్న అభివ్యక్తిలో వ్యక్తీకరించారు శ్రీ ప్రయాగ.

'మనసై వేదమాప్తవ్యం నేహ నానాఽస్తికించన... ఇక్కడ ఈ లోకంలో వైవిధ్యం అనేది లేనే లేదు, ఉన్నదంతా పరమాత్మతత్త్వమే. ఆ తత్త్వాన్ని మనసుతోనే గ్రహించాలి' అన్నది కఠోపనిషత్తు.

అంతరింద్రియాలైన మనోబుద్ధి చిత్తాహంకారాలకు పరబ్రహ్మ అందదని తైత్తిరీయం చెబుతూ ఉంటే, అంతరింద్రియమైన మనస్సుతో పరమాత్మను గ్రహించాలి అని కఠోపనిషత్తు చెప్తోంది. మరి ఈ ఉపనిషన్మంత్రాలు పరస్పర విరుద్ధమైనవి కావా? అన్నది ప్రశ్న. 'కావు' అనే ఆదిశంకరులు తమ భాష్యంలో నొక్కి వక్కాణించారు.

'అంతర్బహిరింద్రియాలు పరబ్రహ్మను దర్శింపలేవు' అన్న తైత్తిరీయోపనిషత్తు కథనం వాస్తవమే అయినా, 'ఆచార్యాగమ సంస్కృతేన మనసైవ ఇదం బ్రహ్మ ఏకరసం ఆప్తవ్యం, ఆచార్యుని తత్త్వబోధతో, వేదాంత శాస్త్రాధ్యయనంతో సంస్కరింపబడిన మనస్సుతో పరమాత్మను గ్రహింపవచ్చు' అని అంటూ, రెండు ఉపనిషత్తులకు సమన్వయం కూర్చారు ఆదిశంకరులవారు.

'ఇంద్రియాలకు కనిపించని పరమాత్మణ్ణి, బుద్ధితో చూస్తూ, బ్రహ్మాది దేవతలు వెళ్ళిపోయారు' అన్న శ్రీ ప్రయాగ వారి వాక్యాన్ని అర్థం చేసుకోవటానికి, పరస్పర విరుద్ధంగా కన్పించే వక్కణాల్ని సమన్వయం చేసుకోవటానికి, వేదాంత శాస్త్రాన్ని తరచి చూడటమొక్కటే మార్గం. శ్రీ రామకృష్ణ వాక్యాల్లోని గంభీర వేదాంత రహస్యాలు మేధకు పరీక్ష పెడతాయి. విజ్ఞులైన పాఠకులు ఈ వాక్యాల్ని విశ్లేషిస్తూ, మహదానందానుభూతికి లోనవటం తథ్యం.

ఇంక 'మనసుకో మాధవుడు' అన్న కథలోకి వస్తే, బహులాశ్వశ్రుతదేవుల ఈ కథకు 'మనసుకో మాధవుడు' అన్న శీర్షిక ఉంచటమే రమణీయంగా ఉంది. కథలో ఒక శ్రీకృష్ణలీల పరమాద్భుతంగా అభివ్యక్తీకరింపబడింది.

ఈ కథలో మహనీయుల సందర్శనం ఎంత శ్రేష్ఠమో విశదీకరింపబడింది. మూల వ్యాసభాగవత శ్లోకాన్ని చూద్దాం.

**దేవాః క్షేత్రాణి తీర్థాని దర్శన స్పర్శనార్చనైః,**

**శనైః పునంతి కాలేన తదప్యర్హత్తయే క్షయా**

ఈ శ్లోకం తాత్పర్యాన్ని విశదీకరిస్తూ శ్రీ ప్రయాగవారు 'క్షేత్రాలు దర్శించటం వల్ల, సజ్జనసాంగత్యం వల్ల, ధార్మిక ప్రసంగాలు వినటం వల్ల జనులు కాలక్రమేణా పవిత్రులవుతారు. కానీ మహనీయుల దర్శనం వల్లనే జనులు ఉత్తమ గతుల్ని పొందుతారు' అని అన్నారు.

**దుష్ప్రజ్ఞా అవిదిత్వైవ మవ జానంత్యసూయవః**
**గురుం మాం విప్రమాత్మా సమర్చాదావిజ్య దృష్టయః**

ఈ శ్లోక భావాన్ని వివరిస్తూ శ్రీ రామకృష్ణ 'విగ్రహారాధనకంటే విజ్ఞులను, వేదవిదులనూ ఆరాధించటం ఉత్తమం. అలా చేయటం వల్ల మీరు ప్రత్యక్షంగా నన్ను అర్చించిన వారు అవుతారు. వ్యయప్రయాసల కోర్చి వైభవోపేతంగా పూజలు చేసేవారికన్నా, సాధుజనులను భక్తిప్రపత్తులతో పూజించే వారే నాకు ఇష్టం' అని కృష్ణుని పలుకుల్ని విశదీకరించారు.

జ్ఞానాదేవతు కైవల్యం, జ్ఞానుల్ని తత్త్వజ్ఞుల్ని అర్చించటం వల్ల, తత్త్వమస్యాది మహావాక్య శ్రవణ మనన నిదిధ్యాసల వల్ల, ముక్తి సంప్రాప్తిస్తుందన్న సత్యాన్ని, మూలానికి విధేయంగా శ్రీ ప్రయాగవారు మనముందు ఆవిష్కరించారు.

'రాధాకృష్ణులు' అన్న కథలో శ్రీ ప్రయాగవారు 'పదహారు వేల మంది కన్యలు కూడా మాధవుణ్ణి మాధవుడు అన్నారు' అని వ్రాసారు. మాధవుణ్ణి మాధవుడు అని అనటంలో విశేషం ఏముంది? అని మనకు అనుపించవచ్చు. వారు మాధవుణ్ణి మాయాః లక్ష్మ్యాం ధవః, మాయాస్వరూపిణి అయిన లక్ష్మీపతిని, మా ధవుడు మా భర్త, అని అన్నారన్నది శ్రీ ప్రయాగ చమత్కారం. ఇలా

చమత్కారసంభరితమైన ఎన్నో ప్రయోగాలు ప్రయాగవారి రచనలో మనకు దర్శనమిస్తాయి. మెరుపుల్ని కురిపిస్తాయి. ఈ గ్రంథంలోని ప్రతి కథా ఒక శబ్దచిత్రంగా, ఓ అక్షరశిల్పంగా మన మనసుల్ని పరవశింపచేస్తాయి.

శ్రీ ప్రయాగ రామకృష్ణ 'భాగవతంలో చిన్నకథలు' అన్న గ్రంథంలోని కథలు పైపైన తడిమి చూస్తే చిన్నకథలే. లోలోన వెదికి చూస్తే పెద్దగాథలే. అంతటి గౌరవాన్వితమైనవి ఈ భాగవతంలో చిన్నకథలు. అవి శ్రీ ప్రయాగవారు అందించిన బృహత్ గాథలు.

శ్రీ ప్రయాగవారు ఈ చిన్నకథల్లోని ఎన్నో పాత్రల పూర్వగాథల్ని, పూర్వజన్మగాథల్ని, అపూర్వంగా వెలికితీసి మనకు అందించారు. రక్కసి పూతన గతజన్మలో బలిచక్రవర్తి కుమార్తె రత్నమాల. కుబ్జ పూర్వజన్మలో రావణుని చెల్లెలైన శూర్పణఖ. ఇలా ఒకటేమిటి రెండేమిటి, ఎన్నో పాత్రల పూర్వగాథలు లహరికలు లహరికలై మన ముందు సాక్షాత్కరిస్తాయి.

భాగవతంలోని కథలతో సంబంధమైన ఎన్నో పురాణాల్ని పరిశీలించి, ఆ పురాణాల్లోని ఈ పూర్వగాథల్ని క్రోడీకరించి, ఈ గ్రంథంలో మనకు అందించారు శ్రీ ప్రయాగ రామకృష్ణ. ఒకరకంగా శ్రీ ప్రయాగ భాగవతంలోని పాత్రల పూర్వపరాల్ని పరిపూర్ణంగా పరిశోధించారు.

శ్రీ ప్రయాగ వ్యాసభాగవతంలోని తాత్త్విక సంపదను గ్రహించారు. పోతన భాగవతంలోని మాధుర్యాన్ని సంగ్రహించారు. వ్రజభాగవతంలోని ప్రేమతత్త్వాన్ని స్వీకరించారు. గర్గ భాగవతంలోని గాంభీర్యాన్ని అందిపుచ్చుకున్నారు. వివిధ పురాణాల్లోని సమాచారాన్ని వెలికి తీసారు. తత్ఫలితమే ఈ 'భాగవతంలో చిన్న కథలు'

**ఖ్యాతికి కాదు, సుంత సముపార్జన కోసము కానెకాదు, ఈ**
**యాతనలీ కవిత్వములు యత్నమదెల్ల హృదంతరమ్ములో**

**జాతర చేయు ఘోషలకు శాంతినొసంగ నికేతనమ్ముపై**
**కేతనమెత్తినాడ, కవికింకర శంకరమూర్తి శివా!**

'సంస్కారవంతులైన వ్యక్తులు కథల్నీ కావ్యాల్నీ కీర్తిని అభిలషించి కానీ, ధనాన్ని ఆశించి కానీ, వ్రాయరు. వాళ్ళ అంతరంగాల్లో ఒక అవ్యక్తమైన అలజడి, ఒక అంతర్లీనమైన ఆర్తి నిరంతరం జాతర చేస్తూ, పరమాత్మను ధ్యానిస్తూ ఉంటుంది. ఆ అలజడిని ఆ ఆర్తిని శాంతింపచేసుకోవటానికే ఇలాంటి వ్యక్తులు రచనల్ని చేస్తూ, అంతరంగమనే నికేతనంపై విజయపతాకల్ని ఎగురవేస్తారు. వాళ్ళు కవికింకరులు. సాక్షాత్తు శివమూర్తులు' అని నేను శివోஉహమ్ అన్న కావ్యంలో వ్రాసుకున్నాను. ఆ కోవకు చెందిన వారే శ్రీ ప్రయాగ రామకృష్ణ.

ఈ గ్రంథాన్ని రచించి శ్రీ ప్రయాగ ఓ భాగవత మహాయజ్ఞాన్ని నిర్వహించారు. భక్తి జ్ఞాన వైరాగ్యాల త్రివేణీ సంగమాన్ని మన ముందు ఉంచారు. అందులో తనివి తీరా జలకమాడి మన జన్మల్ని సార్థకం చేసుకుందాం. పాఠకులమై ఈ భాగవత జ్ఞానయజ్ఞఫలాల్ని అందుకుందాం.

శుభమస్తు

# కృతజ్ఞతలు

ఈ పుస్తకం ఇలా మీ చేతుల్లోకి రావడానికి సాయపడిన సన్మిత్రులు జె.వి. రావు గారికి, వై.యస్.ఆర్. వెంకటరావు గారికి, పుస్తకంలోని అవకతవకలను, అక్షర దోషాలను సరిచేసిన శ్రీమతి ఘంటశాల నిర్మలకు సర్వదా కృతజ్ఞతలు.

బాపుబొమ్మలతో ఈ పుస్తకంలోని కథల విలువ పెరిగింది. అందుకు బాపు గారికి కృతజ్ఞతలు. బాపుగారి అనుమతితో బొమ్మల్ని అందజేసిన శ్రీ గంధం దుర్గాప్రసాద్‌కు ధన్యవాదాలు.

పుస్తకానికి ముందుమాట వ్రాసి ఆశీర్వదించిన రామకృష్ణ మఠం (హైదరాబాద్) అధ్యక్షులు శ్రీ స్వామి జ్ఞానదానందకు, శ్రీ పరమాత్ముని దత్తప్రసాద్‌కు ధన్యవాదాలు.

రచయిత

# సుతపుడు – పృశ్ని

ద్వాపరయుగం చివరలో ఈ భూమిని రాక్షసరాజులు పరిపాలిస్తుండేవారు. వారందరూ అధికారమదంతో ప్రజల మంచిచెడ్డలు పట్టించుకోకుండా విందులూ విలాసాలలో మునిగితేలుతుండేవారు. నిరంకుశులుగా ప్రవర్తించేవారు. ధర్మదూరులై చరించేవారు. యథా రాజా తథా ప్రజ. ప్రభువు ఉత్తముడయితే ప్రజలు ఉత్తములవుతారు. ప్రభువు అధర్మపరుడయితే ప్రజలు కూడా అధర్మపరులవుతారు. రాక్షసుల దుష్టపాలనలో ప్రజలు మంచిచెడ్డల విచక్షణ కోల్పోయి కామక్రోధాలకు వశులయ్యారు. ధర్మానికి విరుద్ధంగా నడిచారు. నీతిమాలిన పనులు చేశారు. ఈ పరిస్థితిని అరికట్టడానికి, భూదేవికి రాక్షసుల వల్ల కలిగిన భారాన్ని తొలగించడానికి శ్రీ మహావిష్ణువు పూనుకున్నాడు.

ద్వాపరం ముగిసి కలియుగం ప్రారంభమయ్యేముందు శ్రీకృష్ణుడు అవతరించాడు.

శ్రీహరి సర్వజ్ఞుడై వుండి కూడా భూలోకాన వ్రేపల్లెలో శ్రీకృష్ణుడుగా అవతరించినప్పుడు మనలానే తనూ జన్మించినట్టూ, పెరిగి పెద్దవాడైనట్టూ, మమతానుబంధాలకు కట్టుబడివున్నట్టూ, కష్టసుఖాలను అనుభవిస్తున్నట్టూ, శత్రువుల పట్ల విరోధం వహించినట్టూ, మిత్రులను చేరదీసినట్టూ నటించాడు. నటన చెయ్యడంలోనూ లీలలు ప్రదర్శించడంలోనూ శ్రీకృష్ణుడు అగ్రేసరుడు కదా!



శ్రీకృష్ణుని కుమారునిగా పొందే అదృష్టం దేవకీ వసుదేవులకు దక్కింది. పెంచి పోషించుకునే మహాభాగ్యం యశోదానందులకు కలిగింది. జగన్నాటక సూత్రధారుని కని దేవకీవసుదేవులూ, లాలించి, పోషించి, పెంచి పెద్దచేసి యశోదానందులూ జీవితాలను ధన్యం చేసుకున్నారు. ఉత్తమోత్తమ గతి సాధించుకున్నారు.

పూర్వం సుతపుడనే ప్రజాపతి వుండేవాడు. అతని భార్య పృశ్ని. ఆమె మహా పతివ్రత. ఆ దంపతులు శ్రీహరిగూర్చి పన్నెండువేల దివ్య సంవత్సరాలు కఠోరంగా తపస్సుచేశారు. వారి తపస్సుకు సంతసించి శ్రీహరి ప్రత్యక్షమై ఏదైనా వరం కోరుకోమని అడిగాడు. సుతపుడూ ఆయన భార్యా ఏది అడిగినా ఇవ్వడానికి ఆ క్షణాన నారాయణుడు సిద్ధంగా వున్నాడు. ముక్తిని కోరినా ఇచ్చేవాడే. కాని ఆ దంపతులు పరమ మంగళాకారుడయిన దేవదేవుని మహోన్నత సౌందర్యం చూసి ముగ్ధులై 'మాకేమీ వద్దు తండ్రీ! నువ్వు మాకు ముద్దుల కొడుకువై పుడితే అదే పదివేలు' అన్నారు. ఆ అనడం కూడా ముచ్చటగా

మూడుసార్లు అన్నారు. శ్రీమన్నారాయణుడు సరేనని వారికి మూడుజన్మల్లో కొడుకుగా పుట్టడానికి అంగీకరించాడు. ఆ జన్మలోనే పృశ్ని కడుపున చేరి పృశ్నిగర్భుడుగా పేరుపొందాడు.

ఆ తరువాత జన్మలో పృశ్ని, సుతపుడు – అదితి కశ్యపులైనారు. అప్పుడు క్షీరాబ్ధిశయనుడు వారికి వామనుడై జన్మించాడు. మూడవ జన్మలో సుతపుడు, పృశ్ని– దేవకీ వసుదేవులైనారు. వారి గర్భాన శ్రీహరి శ్రీకృష్ణుడై జన్మించాడు.

మరీచి కుమారుడయిన కశ్యప ప్రజాపతి ఒకసారి ఒక మహా యజ్ఞం తలపెట్టాడు. ఆ యాగానికి చాలా గోవులు కావల్సివచ్చాయి. అందుకని కశ్యపుడు వరుణదేవుని గోవుల్ని అపహరించాడు. మరునాడు తల్లులు కనిపించక లేగదూడలు తల్లడిల్లాయి. తమ తల్లులకోసం అవి దీనంగా రోదించాయి. వరుణుడికీ సంగతి తెలిసి కశ్యపుడి ఆశ్రమానికి వెళ్ళాడు. ఆ సమయాన కశ్యపుడు ఆశ్రమంలో లేడు. అతని భార్యలు అదితి, సురస వరుణుడికి సరైన సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యంగా ప్రవర్తించారు. దురుసుగా మాట్లాడారు. వరుణుడికి కోపం వచ్చి గోకులంలో పుట్టండని వాళ్ళను శపించాడు. తిన్నగా వెళ్ళి జరిగిన సంగతంతా బ్రహ్మతో చెప్పి “గోవత్సాలు ఇప్పుడు తమ తల్లులకోసం ఎలా కుమిలి కుమిలి ఏడుస్తున్నాయో కశ్యపుడి భార్య అదితి కూడా ఎప్పుడో ఒకప్పుడు తన కన్నబిడ్డల కోసం అలా దు:ఖపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది” అన్నాడు.

‘తప్పు అని తెలిసి కూడా గోవులను దొంగిలించిన కారణాన నువ్వూ నీ భార్యలు అదితీ, సురసా గోకులంలో జన్మిస్తారు’ అని బ్రహ్మ కశ్యపుడితో అన్నాడు. ఆ విధంగానే కశ్యప ప్రజాపతి వసుదేవుడిగానూ అదితి దేవకిగానూ సురస రోహిణిగానూ జన్మించారు.

# అదితి – దితి

అదితి, దితి, వినత, కద్రువ అనే నలుగురూ కశ్యపుని భార్యలు. అదితి ధరణీదక్షుల కుమార్తె. వినయవిధేయతలతో, ప్రేమానురాగాలతో భర్తను సేవిస్తూ వుండేది. కశ్యపుడు సంతోషించి అదితిని ఏదైనా వరం కోరుకోమన్నాడు. 'ముద్దుల మూట కట్టేవాడూ, బుద్ధిమంతుడూ, విద్యావంతుడూ, తేజశ్శాలీ అయిన కొడుకు కావాలి నాకు' అని అడిగింది అదితి. కశ్యపుడు సరేనన్నాడు. ఆ విధంగా అదితి కడుపున ఇంద్రుడు జన్మించాడు. అది చూసి దితి ఓర్వలేకపోయింది. అసూయతో రగిలిపోయి కశ్యపుడి దగ్గరకు వెళ్ళి 'నాకూ ఇంద్రుడులాంటి కొడుకే కావాలి' అని పట్టుబట్టింది. కశ్యపుడు దితి అభ్యర్థనను కూడా మన్నించాడు. దితి గర్భవతి అయింది. నెలలు నిండాయి. అదితికి గుండెల్లో గుబులు మొదలయింది. ఒకరోజు, కొడుకుని చాటుగా పిలిచి 'దితికి కూడా నీతో సమానమైనవాడు కలిగితే వాడు నీకు శత్రువవుతాడు, కాబట్టి అలాంటివాడు అసలు పుట్టకుండానే చూడాలి' అని చెప్పింది. ఇంద్రుడు తల్లి చెప్పినదంతా విని తనకు శత్రువు పుట్టకుండా చేసుకోవాలనుకుని మెల్లగా మారుతల్లి దగ్గరకు వెళ్ళి 'అమ్మా నీకు దాసుడనై పరిచర్యలు చేద్దామని వచ్చాను' అని వినయంగా చెప్పాడు.

కొడుకు వినయభక్తికి దితి సంతోషించి వాణ్ణి దగ్గరకు తీసుకుని ముద్దాడి 'అలాగే చేద్దువులే' అంది. అప్పటినుంచి మారుతల్లికి సేవలు చేస్తూ ఆమె

దగ్గరే ఎక్కువసేపు గడిపేవాడు. దితికి కూడా ఇంద్రుడిమీద విశ్వాసం ఎక్కువైంది. అదే అదనుగా ఒకరోజు ఆమె గర్భంలో ప్రవేశించి తన వజ్రాయుధంతో మారుతల్లి గర్భంలోని పిండాన్ని నలభై తొమ్మిది ముక్కలు చేశాడు. అవన్నీ పెద్దగా ఏడ్చాయి. ఆ ఏడుపు విని దితికి మెలుకువ వచ్చింది. తన కడుపులోని బిడ్డను చంపవద్దని ప్రార్థించింది. ఇంద్రుడు దితి గర్భంనుంచి బయటకు వచ్చి 'శత్రువును ఏ విధంగానైనా చంపవచ్చు గాబట్టి, నీకు తెలియకుండా నీ గర్భంలోకి ప్రవేశించాను' అని చెప్పి, తను చేసిన పనికి క్షమించమని వేడుకున్నాడు. దితి ఆ శకలాలను ఇంద్రుడికే ఇచ్చి 'వీళ్ళను రక్షించే బాధ్యత నీదే' అంది.

వాళ్ళే మరుత్తులు.

వాళ్ళే దేవతలయ్యారు.

అదితి ప్రోద్బలంతోనే ఇంద్రుడు తన కడుపులోని బిడ్డను తునాతునకలు చేసాడని తెలుసుకుని కోపంతో మండిపడుతూ 'నీ కొడుకు చేసిన దుర్మార్గానికి నువ్వే కారణం. నీ కొడుకు త్రిలోకాధిపత్యం కోల్పోతాడు. నువ్వు కారాగారంలో మగ్గుతూ బిడ్డలకోసం అలమటిస్తూ బతుకుతావు. నీ పిల్లలు పుట్టీపుట్టగానే మరణిస్తారు. ఏడుగర్భాలు నీకు శోక కారణమవుతాయి' అని తీవ్రంగా శపించింది దితి. ఆ శాపం వల్లనే ఇంద్రుడు ఒకసారి నహుషుడి చేతిలో ఓడి దేవలోకానికి దూరమై అజ్ఞాతంలో కొన్నాళ్ళు గడిపాడు. అప్పుడే నహుషుడు దేవేంద్ర పదవిని అలంకరించాడు. ద్వాపరయుగంలో అదితికి పుట్టిన ఆరుగురు కుమారుల్ని ఆమె అన్న కంసుడు చంపేశాడు. ఏడవ గర్భం చ్యుతం అయింది. అలా ఆమెకు ఏడు పర్యాయాలు గర్భశోకం కలిగింది.

# కంసుడు

మధురానగరాన్ని ఉగ్రసేనుడు అనే రాజు పరిపాలిస్తుండేవాడు.

ఒకసారి ఉగ్రసేనుని భార్య కొందరు స్నేహితురాళ్ళను వెంటబెట్టుకుని యమునానదికి స్నానానికి వెళ్ళింది. అక్కడ ఆ సుందర నదీతీరంలో ఉగ్రసేనుని భార్యకు భర్తమీద మనసైంది. ఆమె చిత్తం ఉగ్రసేనుడిమీద రాగాయత్తమైందని తెలుసుకుని ద్రామిళుడనే రాక్షసుడొకడు తన మాయతో ఉగ్రసేనుని రూపం దాల్చి వచ్చి ఆమెతో విహరించాడు. ఆమె అతను తన భర్త కాదని తెలుసుకుని కోపం వచ్చి 'నీ వల్ల నాకు పుట్టినవాణ్ణి హరివంశంలో జన్మించినవాడు సంహరిస్తాడు' అని తీవ్రంగా పలికింది. ఆ ద్రామిళుని వలన ఉగ్రసేనుడి భార్యకు కలిగినవాడే కంసుడు. అందువలననే అతనికి రాక్షస గుణాలు అబ్బాయి.

కంసుడి పుట్టుకకు సంబంధించి మరో కథ వుంది. కంసుడు పూర్వజన్మలో 'కాలనేమి' అనే రాక్షసుడు. వాడు సామాన్యుడు కాదు. శతభుజుడు, శతశిరస్కుడు, మహావీరుడు. పాలసముద్రాన్ని మథించేటప్పుడు కాలనేమి శ్రీహరినే ఎదిరించి యుద్ధం చేశాడు. ఆయన చేతిలో మరణించాడు. కాని రాక్షసుల పురోహితుడైన భార్గవుడు మళ్ళీ అతన్ని బతికించాడు. అలా పునరుజ్జీవితుడైన కాలనేమి శ్రీహరిని జయించాలనే ఉద్దేశ్యంతో బ్రహ్మదేవుని గూర్చి నూరేళ్ళపాటు తీవ్రంగా తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చుకుని బ్రహ్మ ప్రత్యక్షమై 'నీకేం వరం కావాలో కోరుకో' అన్నాడు. 'నేను అమరుల చేత మరణించకుండా వుండేలా వరం

ప్రసాదించండి' అని కాలనేమి అర్థించాడు. ఆ సమయంలో అతనికి ఆ వరం ఇవ్వడం మంచిది కాదని భావించి 'వచ్చే జన్మలో నీ కోరిక నెరవేరుతుంది' అని చెప్పి బ్రహ్మ అంతర్హితుడయ్యాడు.

ఆ తరువాత కాలనేమి కంసుడై జన్మించాడు. అమిత బలపరాక్రమాలతో కనిపించిన వారందర్నీ పరాజితుల్ని చేశాడు. ఒకసారి మగధ దేశాధిపతి అయిన జరాసంధునితో కంసుడు తలపడ్డాడు. యమునానది ఒడ్డున అతి భయంకరంగా యుద్ధం సాగింది. ఆ సమయంలో జరాసంధుని పట్టపుటేనుగు గొలుసులు తెంచుకుని, గుడారాలను కూలదోసుకుంటూ రణరంగంలోకి ప్రవేశించింది. అది అరిచే అరుపులకు ఎక్కడి వారక్కడ ప్రాణాలు అరచేత పట్టుకుని పారిపోయారు. కాని కంసుడు మాత్రం కదలలేదు. మత్తగజం అతని మీదకు దూకింది. భయంకరంగా ఘీంకరిస్తూ కంసుడితో తలపడింది. అయినా కంసుడు కలవరపడలేదు. చాకచక్యంగా ఆ ఏనుగుతొండం పట్టుకుని పైకెత్తి గిరగిర తిప్పి జరాసంధుని సైన్యం మీదకు విసిరేశాడు. దాని తాకిడికి వేలాది మంది యోధులు మరణించారు. అది చూశాక కంసుడితో పోరుకంటే బాంధవ్యమే మంచిదనుకుని తన కుమార్తెలైన అస్తి, ప్రాప్తి అనేవారిని అతనికిచ్చి వైభవంగా వివాహం చేశాడు.

ఆ తరువాత కంసుడు ఋష్యమూకానికి వెళ్ళాడు. అక్కడ 'కేశి' అనే నరభోజునితో యుద్ధం చేసి గెలిచాడు. ఆ సమయంలో కంసుడు ఋష్యమూకాన్ని అవలీలగా పెకలించి కిందపడేశాడు. అక్కడే కంసుడికి పరశురాముని దర్శనమైంది. కంసుడు ఆయనకు నమస్కరించి భక్తితో ప్రదక్షిణం చేశాడు. అప్పుడు పరశురాముడు తన విష్ణు ధనుస్సును కంసునికి ఇచ్చి 'నాయనా! దీనిని నువ్వు ఎక్కు పెట్టగలిగే పక్షంలోనే నీ ప్రాణం నిలుస్తుంది, జాగ్రత్త' అన్నాడు. కంసుడు ఆ మాటలు విని కూడా కలవరపడలేదు! ధనుస్సును అందుకుని వింటికి నారిని సంధించాడు. అది చూసి పరశురాముడు ఆశ్చర్యపోయాడు. ఆ ధనుస్సును కంసుడికి బహూకరిస్తూ 'దీనితో నువ్వు

శత్రువులందరినీ సంహరించగలుగుతావు' అని చెప్పాడు. కంసుడు పరమానందభరితుడయ్యాడు. అంతలోనే పరశురాముడు కంసుడ్ని ఉద్దేశించి 'ఇది మహాచాపం. దీనిని ఎవడు విరుస్తాడో అతడే దీని యజమానిని కూడా అంతమొందిస్తాడు. అదిమాత్రం తెలుసుకో' అన్నాడు! కంసుడు ఆలోచనలో పడ్డాడు. అయినా ఇక అప్పుడు చేయగలిగింది లేదు. పరశురాముని వద్ద సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు. అక్కడ నుంచి నరకాసురుని మీదకు దండయాత్రకు వెళ్ళాడు. నరకాసురుడు కంసుని శక్తి గ్రహించి, అతనితో స్నేహం చేసుకుని 'దేవతలను జయించేందుకు నాకు నీ సహాయం కావాలి' అని కోరాడు.

కంసుడు సరేనన్నాడు.

ఆ తరువాత కంసుడు అంతకు పూర్వం తను జయించిన రాక్షసవీరులందరినీ వెంటపెట్టుకుని అమరావతిని ముట్టడించేందుకు వెళ్ళాడు. అక్కడ మహేంద్రుడితో తలపడ్డాడు.ఆ యుద్ధంలో కొందరు దేవతలు హతులయ్యారు. మరికొందరు పారిపోయారు. మహేంద్రుడు తన ఐరావతాన్ని కంసుని మీదకు పంపాడు. అది ఘీంకరిస్తూ వెళ్ళి కంసుడ్ని కింద పడేసింది. కంసుడు వెంటనే లేచి ఒకచేత్తో ఆ ఏనుగు దంతం పట్టుకుని, మరోచేత్తో ఇంద్రుడ్ని పిడిగుద్దులు గుద్దాడు.

అది చూసి దేవతల గుండెలు నీరైపోయాయి. క్షణాల్లో కంసుడు మహేంద్రుని సింహాసనాన్ని స్వాధీనపరుచుకున్నాడు.

కంసుడు ఆ విధంగా దిగ్విజయయాత్ర చేసి వీరాధివీరులందర్నీ తన దాసులుగా చేసుకున్నాడు.

ఒకసారి కంసుడు తన చెల్లెలు దేవకినీ, ఆమె భర్త వసుదేవుడ్నీ తన రథంలో కూర్చోపెట్టుకుని వాళ్ళ ఇంటికి తీసుకుపోతూవుండగా, వున్నట్టుండి అదృశ్యవాణి 'కంసా! నీ సోదరి అష్టమగర్భం నిన్ను సంహరిస్తుంది' అని హెచ్చరించింది. కంసుడికి ఈ హెచ్చరిక సహించరానిదిగా తోచింది. కలవరపడ్డాడు. ఆ కలవరపాటు మూలంగా అతనిలో వివేకం అంతరించింది. అంతవరకూ తన

సోదరిపట్లా, ఆమె భర్తపట్లా వున్న ప్రేమంతా హరించుకుపోయింది. అంతులేని కోపం వచ్చింది. వెంటనే ఒరనుంచి కత్తి దూసి దేవకీదేవిని చంపడానికి ఉద్యమించాడు. అది చూసి వసుదేవుడు హడలిపోయాడు. కంసుని కోపాన్ని ఏ విధంగా ఉపశమింపచేయాలో వసుదేవుడికి తోచలేదు. అతనితో విరోధించి పోరాడడం కూడా మంచిది కాదని అతనికి తెలుసు. అందుకని మంచి మాటలతో అతనిని శాంతపరచడానికి ప్రయత్నిస్తూ 'బావా! ఈమె నీ చెల్లెలు. అందులోనూ నూతన వధువు. ఈమెను కానుకలతో సంతోషపరచటానికి బదులు కరకుకత్తికి బలిచేయడం ఉచితం కాదు' అని దీనంగా వేడుకున్నాడు.

కంసుడు ఆ మాటలేవీ వినిపించుకోలేదు. వసుదేవుడు మళ్ళీ కంసుడ్ని బతిమాలుతూ 'కంసా! నీ చెల్లెలు నీకే అపకారమూ చెయ్యలేదు, పైగా నువ్వంటే ఆమెకు అమితమైన అభిమానం. నీ క్షేమాన్ని కాంక్షించే నీ చెల్లెల్ని అశరీరవాణి పలుకులు నమ్మి హత్యచేయడం ధర్మం కాదు. పాలకుడవైన నువ్వే ఇలా ప్రవర్తిస్తే ప్రజలు ధర్మరహితులై సంచరించరా! నా మాట విను. నీ చెల్లెలిమీద కాస్త దయ చూపించు' అని పరిపరి విధాల వేడుకున్నాడు.

అయినా కంసుడు శాంతించలేదు.

వసుదేవుడు తన భార్య నెలాగైనా కాపాడుకోవాలనుకుని 'బావా! ఈమెకు పుట్టబోయే కుమారుని వల్ల గదా నీకు మరణముందని ఆకాశవాణి చెప్పింది? ఆ మాటలమీద నీకు నమ్మకముండే పక్షంలో, నీకు భయం లేకుండా వుండేందుకు ఈమెకు పుట్టే పిల్లలందర్నీ నీకు అప్పగిస్తాను. వారిని నువ్వేం చేసినా సరే, మేము అడగం. మమ్మల్ని దయతలచి వదలిపెట్టు' అని వేడుకున్నాడు.

కంసుడికి ఆ ఆలోచన నచ్చింది.

దేవకిని చంపకుండా విడిచిపెట్టాడు.

బతుకుజీవుడా అనుకుని దేవకీవసుదేవులు తమ నిజనివాసానికి వెళ్ళిపోయారు.

# శ్రీకృష్ణ జననం

దేవకీ వసుదేవుల పెద్దకొడుకు కీర్తిమంతుడు. వసుదేవుడు ఆ పసివాడ్ని పుట్టినవెంటనే తీసుకువెళ్ళి కంసుడికి అప్పగించాడు. వసుదేవుని సత్యనిష్టకు సంతోషించి 'బావా! ఇతనివల్ల నాకు కలిగే అపాయమేమీ లేదు. వీడిని నువ్వు తీసుకువెళ్ళు. మా సోదరికి కలిగే ఎనిమిదవ పిల్లవాడ్ని మాత్రం నాకు అప్పగిస్తే చాలు. అతడ్ని చంపి నేను నా చావును తప్పించుకుంటాను" అన్నాడు కంసుడు.

ఆ తరువాత ఒకసారి నారదుడు కంసుడి మందిరానికి వెళ్ళి వ్రేపల్లెలో వున్న నందుడూ అతని భార్యలూ, పుత్రులూ, బంధువులూ, వసుదేవాదులూ దైవాంశసంభూతులనీ, విరాట్పురుషుడు వాసుదేవుడు రాక్షసులను సంహరించేందుకు దేవకిగర్భాన పుట్టబోతున్నాడనీ చెప్పాడు.

దాంతో కంసుడు కలవరపడ్డాడు. నేరుగా వెళ్ళి దేవకీ వసుదేవులను పట్టి బంధించాడు. అంతవరకు వాళ్ళకు కలిగిన బిడ్డలు ఆరుగురినీ నిర్దాక్షిణ్యంగా కత్తికి ఎరవేశాడు. యాదవులతో పగ పెంచుకుని యదుభోజాంధకులకు అధిపతి అయిన తన తండ్రి ఉగ్రసేనుడ్ని చెరసాలలో పెట్టి సింహాసనాన్ని ఆక్రమించుకున్నాడు. బాణుడు, భౌముడు, కేశి, ధేనుకుడు, బకుడు, ప్రలంబుడు, చాణూరుడు, ముష్టికుడు, పూతన, అరిష్టుడు వంటి క్రూరరాక్షసులు కంసుడికి అనుచరులయ్యారు. వాళ్ళందరూ కలిసి యాదవులను అనేక రకాల

హింసించారు. ఆ బాధలు భరించలేక చాలామంది మధురాపురాన్ని వదలి నిషధ, కురు, కోసల, విదేహ, విదర్భ, కేకయ, పాంచాల దేశాలలో తలదాచుకున్నారు. కొందరు కంసుడితో సఖ్యంగా వుంటూ అతనిని ఆశ్రయించి బతికారు.

దేవకి ఏడవసారి గర్భవతైంది. హరి అంశతో అనంతుడు దేవకీదేవి గర్భాన ప్రవేశించాడు. శ్రీహరి యోగమాయను పిలిచి 'భద్రా! దేవకీ వసుదేవులను కంసుడు అమితంగా బాధపెడుతున్నాడు. ఇప్పటికే వాళ్ళ బిడ్డలు ఆరుగురిని పొట్టన పెట్టుకున్నాడు. ఇప్పుడు అనంతుడు దేవకి గర్భాన వున్నాడు. అతనక్కడ పుట్టటం అపాయకరం. నందగోకులంలో వసుదేవుని మరో భార్య రోహిణి వుంది. దేవకి గర్భంలో అనంతుడనే పేరుతో వున్న నా తేజాన్ని రోహిణి గర్భాన ప్రవేశపెట్టు. నేను దేవకికి అష్టమగర్భాన నా నిజ అంశతో జన్మిస్తాను. అప్పుడు నువ్వు నందగోపుని భార్య అయిన యశోదకు కూతురుగా ప్రభవిస్తావు. నా మాట మేరకు వసుదేవుడు నన్ను యశోదవద్దకు చేర్చి, యశోద గర్భాన జనించిన నిన్ను దేవకికి పాపను చేస్తాడు' అని చెప్పాడు.

యోగమాయ శ్రీహరికి వినయంగా నమస్కరించి భూలోకానికి చేరింది. దేవకి గర్భంలోని అనంతుడి అంశను రోహిణి గర్భంలో ప్రవేశపెట్టింది. ఆ వెంటనే దేవకికి గర్భం చ్యుతమయింది. అనంతుడి అంశతో రోహిణికి బలరాముడు జన్మించాడు.

తరువాత కొంతకాలానికి భూభారాన్ని తొలగించేందుకు శ్రీమన్నారాయణుడు దేవకీదేవి గర్భాన ప్రవేశించాడు. దేవకీదేవికి అది అష్టమగర్భమన్న విషయం కంసునికి స్ఫురణకు వచ్చింది. అశరీరవాణి పలుకులు యథార్థం కాబోతున్నాయని గ్రహించి నిలువెల్లా కంపించాడు. చెల్లెల్ని చంపటమా, మానటమా అన్న సంశయం కూడా కలిగింది. 'ఆడదాన్ని వధించడమే పాపం. అందులోనూ చెల్లెల్ని, పైపెచ్చు నిండు చూలాలిని చంపటంవల్ల సర్వసంపదలూ



హరిస్తాయి. కీర్తి నశిస్తుంది. స్త్రీ హత్యాపాతకానికి పాల్పడ్డవాడు బతికి వుండి కూడా చచ్చినవాడుగానే పరిగణింపబడతాడు' అని తలచి చెల్లెల్ని చంపకూడదని నిర్ణయించుకున్నాడు. దేవకికి ఈసారి పుట్టబోయే పిల్లవాడ్ని మాత్రం పురిటిలోనే చంపాలని తీర్మానించుకున్నాడు. అప్పటినుంచీ అనుక్షణం అప్రమత్తంగా వుండటం ప్రారంభించాడు.

దేవకికి నవమాసాలూ నిండాయి. ప్రసవసమయం ఆసన్నమైంది. అది గ్రహించిన బ్రహ్మరుద్రాదులూ, నారదాది మహర్షులూ దేవకీవసుదేవులు ఉన్న చెరసాలవద్దకు వెళ్ళి దేవకీగర్భస్థుడైవున్న శ్రీహరిని అనేక విధాల ప్రస్తుతించారు. దేవకీదేవిని ఉద్దేశించి 'అమ్మా! సాక్షాద్భగవంతుడు శ్రీహరి అనతికాలంలోనే నీకు కుమారుడై జన్మించబోతున్నాడు. కంసాదిరాక్షసులను సంహరించటానికీ, యాదవులను రక్షించడానికీ, సర్వలోకాలకూ మేలు చేకూర్చడానికీ శ్రీమన్నారాయణుడు నీ గర్భాన ఉదయించబోతున్నాడు. నువ్విక నిశ్చింతగా వుండు తల్లీ' అని దీవించి వెళ్ళారు.

ఆ తరువాత కొద్దిరోజులకే శ్రావణ బహుళంలో రోహిణీ నక్షత్రాన అష్టమిరోజున శ్రీమన్నారాయణుడు చిన్నికృష్ణుడై దేవకి గర్భాన జన్మించాడు. ఆ సమయంలో పుడమి పులకించింది. దేవ దుందుభులు మోగాయి. అప్సర కన్యలు నాట్యం చేశారు. దేవతలు పూలవాన కురిపించారు. వసుదేవుడు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యాడు.

కాని, పిచ్చితల్లి దేవకి మాత్రం కన్నీరు మున్నీరుగా విలపించింది. సిరు లొలుకుతున్న తన చిన్నారి బిడ్డను గుండెలకు హత్తుకుని పొర్లి పొర్లి ఏడ్చింది.

# యోగమాయ



**అ**మ్మ ఏడుపు బిడ్డ విన్నాడు. దేవకి భయం లీలాకృష్ణుడు పసికట్టాడు.

శిశువుగా వున్న శ్రీమన్నారాయణుడు దేవకీవసుదేవుల ముందు నిజరూపంలో ప్రత్యక్షమయ్యాడు. నీలమేఘం వంటి శరీరకాంతితో, విశాల నేత్రాలతో, కౌస్తుభ మణితో, శంఖచక్ర గదలతో, నాలుగు చేతులతో, సువిశాల వక్షస్థలంతో, మణిమయ రత్నహారాలతో, కిరీట కుండలాలతో వెలిగిపోతూ దర్శనమిచ్చాడు. ఆ పురాణపురుషుడ్ని చూసి దేవకీవసుదేవులు అమితానందం పొందారు.

ఆదివిష్ణువు వాళ్ళకు అభయమిస్తూ 'ఇప్పుడు మీరు కంసుడ్ని గురించి గాని, అతని అనుచరులను గురించి గాని భయపడవలసిన పని లేదు. విశ్వమంతా ఇప్పుడు యోగమాయ ప్రభావంలో వుంది. మరి కొంచెం సేపట్లో యోగమాయ వ్రేపల్లెలో నందుని భార్య యశోదకు కుమార్తెగా పుట్టబోతోంది. నేను నా నిజరూపాన్ని ఉపసంహరించుకున్న వెంటనే నన్ను నందుని ఇంటికి చేర్చి అక్కడ పుట్టిన యోగమాయను ఇక్కడకు తీసుకురండి. అది అసాధ్యమని భయపడకండి. అంతా సవ్యంగానే జరుగుతుంది' అని చెప్పి దేవకీ వసుదేవులు చూస్తుండగానే మళ్ళీ పసిపిల్లవాడుగా మారిపోయాడు. అప్పుడే పుట్టిన పసిపాపడుగా ప్రవర్తించాడు. అంతవరకు వసుదేవుని బంధించి వున్న ఇనుప గొలుసులు పుటుక్కున తెగిపోయాయి. వసుదేవుడు ఆశ్చర్యపోయాడు. వెంటనే శ్రీహరి ఆజ్ఞ ప్రకారం పసివాడ్ని చేతుల్లోకి తీసుకుని మెల్లగా ద్వారబంధంవైపు నడిచాడు. తలుపులు వాటంతట అవే తెరుచుకున్నాయి. కావలి వాళ్ళు గాఢనిద్రలో వున్నారు. అదంతా విష్ణుమాయ అని వసుదేవుడు గ్రహించాడు. ఇంతలో వర్షం ప్రారంభ మైంది. పసివాడు తడుస్తాడని వసుదేవుడు భయపడ్డాడు. కాని ఆదిశేషుడు పడగలు విప్పి ఆ పసివాడ్ని కప్పి తన వెంట వచ్చాడు. అంతే! మంత్రముగ్ధుడి మాదిరి సాగిపోయాడు వసుదేవుడు. వెళ్ళివెళ్ళి యమునానదిని సమీపించాడు. శ్రీహరి శిశురూపంలో తనను సమీపించాడని యమున తెలుసుకుని సంతోషంతో పరవశించింది. వెంటనే రెండుగా చీలి వసుదేవుడికి దారి ఇచ్చింది.

వసుదేవుడు నల్లనయ్యతో నందగోకులం చేరుకున్నాడు. సరాసరి నందుడి ఇంటికి వెళ్ళాడు. అందరూ నిద్రలో వున్నారు. నేరుగా పురిటి గదిలోకి వెళ్ళాడు. యశోద పక్కలో తను తీసుకువెళ్ళిన శిశువును పడుకోబెట్టి, ఆమెకు పుట్టిన పాపను తన చేతుల్లోకి తీసుకుని ఒక్కక్షణం తన బిడ్డవంక తదేకంగా చూసి చెమ్మగిల్లిన కళ్ళతో గిర్రున వెనక్కి తిరిగి బయటకు వచ్చాడు. నడుస్తున్నాడే కాని మనసంతా నల్లనయ్యమీదే వుంది.

మళ్ళీ ఆయన కారాగారం చేరుకోగానే తలుపులన్నీ మూసుకున్నాయి. తను తెచ్చిన పాపను దేవకి పక్కన వుంచగానే వసుదేవుడి చేతులకు మళ్ళీ సంకెళ్ళు పడ్డాయి. అంతలో పాప కెవ్వుమంది. ఆ ఏడుపుకు కావలివాళ్ళు మేలుకున్నారు. గబగబ కంసుడి దగ్గరకు వెళ్ళి దేవకీదేవి ప్రసవించిందని చెప్పారు. కంసుడు తత్తరపడిపోయి దేవకీవసుదేవులున్న చెరసాలకు బయలుదేరాడు. దేవకీదేవి చేతుల్లోవున్న పసిపాపను కత్తితో నరకడానికి ఉద్యుక్తుడయ్యాడు. దేవకీదేవి బిడ్డను హృదయానికి హత్తుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

కంసుడు చలించలేదు.

చెల్లెలి చేతిలో వున్న పసిబిడ్డను బలవంతంగా లాక్కున్నాడు. పాప కాలు పట్టుకుని గిరగిరా తిప్పి పైకి ఎగరేశాడు. ఆశ్చర్యం! ఆమె కిందపడలేదు. అంతకంతా పైకి వెళ్ళింది. అలా వెడుతూ క్రమక్రమంగా రూపం మార్చుకుంది. ఎనిమిది చేతులతో, దివ్యాస్త్రాలతో, శూలాలతో శక్తిస్వరూపిణిలా గోచరించింది. అది చూసి కంసుడు హడలిపోయాడు.

ఆమె అతణ్ణి ఉద్దేశించి 'నువ్వు దుర్మార్గుడివి. పసిబిడ్డలన్న కనికరమైనా లేకుండా దేవకికి పుట్టిన ఆరుగురిని సంహరించావు. 'ఆడపిల్ల' నని అయినా అనుకోకుండా నన్నూ హింసిద్దామనుకున్నావు. నిన్ను హతమార్చే వీరుడు పుట్టాడు. తొందరపడకు. అతను నిన్ను యమసదనానికి పంపిస్తాడు. ఇది నిజం' అని చెప్పి అదృశ్యమైంది. అది విని కంసుడు తనకు చావు తప్పదనుకున్నాడు.

# పూతన

శ్రీ మహావిష్ణువు తనను సంహరించేందుకు ఎక్కడో పుట్టి పెరుగుతున్నాడన్న భయం కంసుడిలో ఎక్కువైంది. అనుచరులందరినీ సమావేశపరచి తరణోపాయం చెప్పమని అడిగాడు. 'మహారాజా! మిమ్మల్ని సంహరించేందుకు ఆ హరి మానవరూపం ధరించి వుంటాడని మీరు భావిస్తున్నారు. మీ బాహుబలాన్ని తెలుసుకుని దేవతలే భయపడుతుంటే, మానవమాత్రులు చేయగలదేమిటో మాకు అర్థం కావడంలేదు. పైగా ఆ దానవవిరోధి రెండు మూడు రోజుల క్రితమే పుట్టివుంటాడని మీరు అనుకుంటున్నారు. అదే నిజమైతే వేలెడంతటివాడ్ని హతమార్చడం కష్టమైన పని కాదు. అయితే అనుదినం జన్మించే వేలాది శిశువుల్లో ఆ హరి ఎవరో గుర్తించడం మాత్రం కష్టం కావచ్చు. అందుకని విచక్షణ లేకుండా ఇటీవల పుట్టిన పిల్లలందరినీ సంహరించడం ఉత్తమమనిపిస్తోంది. ప్రభూ! ఆ విష్ణువు ఉత్త మాయలమారి అని కూడా విన్నాం. నిన్ననే పుట్టినా ఈ పాటికి పెద్దవాడై వుండవచ్చు. ఆ మాయావి సాధారణంగా వేదాలూ గోవులూ వేదవిదులూ తాపసులూ పూజింపబడే చోట, తపోయజ్ఞాదులు జరిగేచోట, దానధర్మాలూ దయాసత్యశౌచాలూ పాటింపబడేచోట, సహనం, శాంతి నెలకొన్నచోట వుంటాడంటున్నారు. కనుక మనం ఆ ప్రాంతాల్లో అల్లకల్లోలం సృష్టించాలి. ధర్మాన్ని హింసించాలి. సాధువులను శిక్షించాలి. శిశువులను వధించాలి. గోవులను చిత్రవధ చెయ్యాలి. యజ్ఞవాటికల్ని ధ్వంసం చేయాలి.

అందుకు మీరు మాకు అనుమతి ఇవ్వాలి' అన్నారు కంసుడి అనుచరులు.

ఆ మాటలకు కంసుడికి అమితానందం కలిగింది. వెంటనే హింసాకాండ యథేచ్ఛగా సాగించమని అనుమతి ఇచ్చాడు.

కంసుడి అనుచరవర్గానికి చెందిన పూతన అత్యద్భుతసుందరిగా మారిపోయి దేశదేశాలూ తిరుగుతూ కనిపించిన పిల్లలందరినీ చంపుతూ చివరికి నందగోకులం చేరింది. నల్లనయ్య ఇంటికి వెళ్ళింది. అక్కడ వున్న ఆడవాళ్ళందరూ ఆమె సౌందర్యానికి ముగ్ధులై ఆమె తమకోసం దిగివచ్చిన దివ్యలోకసుందరి అనుకున్నారు. హడావుడిపడుతూ ఘనంగా మర్యాదలు చేశారు. తరువాత ఆ మాటా ఈ మాటా చెబుతూ పూతన మెల్లగా లీలా కృష్ణుడు పడుకునివున్న ఊయల దగ్గరకు వెళ్ళింది. సిరులొలుకుతున్న నల్లనయ్యను చూసి ముద్దులు కురిపించింది. చేతుల్లోకి తీసుకుంది. గుండెలకు హత్తుకుంది. అక్కడున్న ఆడవాళ్ళందరూ ఆ సుందరి కన్నయ్యను చూసి పరవశిస్తోందనుకున్నారు. అయితే లీలాశిశువుకు ఆ సుందరి రాక్షసి అనీ, తనను సంహరించేందుకే వచ్చిందనీ ఆమెకు నిలువెల్లా విషమనీ తెలియకపోతే కదా! కావాలనే కాళ్ళూ చేతులూ ఆడిస్తూ బుగ్గలు సొట్టలు పడేలా నవ్వుతూ పెద్దగా కేరింతలు కొట్టాడు. కాంతులు కురిసే కళ్ళని విప్పార్చి ఆమెవంక చూశాడు. ఆ రాక్షసి లీలాకృష్ణుడ్ని ఒడిలోకి తీసుకుని స్తన్యం ఇవ్వబోయింది. ఒళ్ళోని శిశువు కూడా ఆరాటపడ్డాడు. పాలిండ్ల మీది పైటచెంగును లాగేశాడు. యశోద కూడా అభ్యంతర పెట్టలేదు. వెంటనే మాయాసుందరి నల్లనయ్యకు పాలు ఇచ్చింది. శిశువు తాగడం మొదలుపెట్టాడు. అంతే! గుండెలు పీకేస్తున్నట్టు, లాగేస్తున్నట్టు, ప్రాణం పోతున్నట్టు అనిపించింది పూతనకు.

లీలాశిశువు ఒక్క గుటక వేశాడు.

మాయాసుందరి సౌందర్యం క్షీణించింది.



ఇంకొక గుటక వేశాడు.

ప్రాణాలను నలిపేస్తున్నట్టు బాధపడింది!

మరో గుటక ....

పెద్దగా అరిచింది. చిన్ని కృష్ణుణ్ణి అవతలకు తోసెయ్యాలని ప్రయత్నించింది.

కాని ...

పిల్లవాడు ఆమెను వదిలిపెట్టలేదు.

ఇంకో గుటక వేశాడు.

రక్కసి రక్తమాంసాలన్నీ పీల్చేశాడు.

దాంతో పూతన గావుకేకలు పెడుతూ గిలగిల తన్నుకుంటూ నేలకు ఒరిగింది. మాయారూపం వదిలి ప్రాణాలు విడిచిపెట్టింది. ఆ సమయంతో అది వేసిన కేకలకు నందగోకులమంతా గజగజ లాడింది. ప్రజలు మూర్ఛపోయారు.

కాని నల్లనయ్య మాత్రం ఆ రాక్షసి గుండెలమీద కూర్చుని నవ్వుతూ ఆడుతున్నాడు. చేష్టలు దక్కి చూస్తున్న యశోద దడదడలాడుతున్న గుండెలతో

కన్నయ్యని అవతలికి తీసుకుపోయి దిష్టి తీసింది. అనేక విధాల రక్షపెట్టింది. బిడ్డని తొట్టిలో పడుకోబెట్టి నిద్రపుచ్చింది. గోప స్త్రీలకు నల్లనయ్య సామాన్యుడు కాదనిపించింది. ఆ తరువాత నందుని ఆజ్ఞానుసారం గోకులంలోని వాళ్ళంతా పూతన దేహాన్ని గొడ్డళ్ళతో నరికి ఆ శరీరఖండాలకు దహనక్రియలు జరిపారు.

దురుద్దేశ్యంతోనే అయినా శ్రీకృష్ణుని ఎత్తుకొని ముద్దాడి ఆడించి స్తన్యం ఇచ్చినందువల్ల పూతన పాపాలన్నీ తొలగిపోయాయి. ఆమెకు ముక్తి లభించింది. పూతన రాక్షసి అయినా, ఆమె లీలాకృష్ణునికి తాగించింది విషమే అయినా తనకు స్తన్యం ఇచ్చిన కారణంచేత పసిపిల్లవాడి రూపంలో వున్న శ్రీహరి ఆమెను తల్లిగానే భావించాడు. పూతన కోరింది కూడా అదే.

బలిని నిగ్రహించే నిమిత్తం శ్రీమహావిష్ణువు వామనుడై బలిచక్రవర్తి యజ్ఞవాటికకు వెళ్ళినప్పుడు బలి కుమార్తె రత్నమాల వామనుడ్ని చూసి 'ఈ ముగ్ధ మనోహర మూర్తికి క్షీరమిచ్చే అదృష్టం నాకు లేకపోయిందే' అని మనసులో అనుకుంది.

శ్రీహరి ఆమె మనోవ్యథ గ్రహించాడు. ఆమె కోరికను తీర్చాలనుకున్నాడు.

ఫలితంగా రత్నమాల ద్వాపర యుగంలో పూతనగా పుట్టింది. కృష్ణుడుగా జన్మించిన హరి ఆమె యిచ్చిన పాలను తాగాడు. ఆమె కోరిక తీర్చాడు. ఆమెకు పరమపదాన్ని అనుగ్రహించాడు.

# శకటాసురుడు

**బా**లకృష్ణుడి అల్లరి ఎక్కువైంది. ఒదిగలబడటం కూడా నేర్చు కున్నాడు. నంద యశోదలు అమితానందంతో వ్రేపల్లె అంతటా వేడుకలు చేశారు. బీదలకు, దీనులకు దానధర్మాలు చేశారు. చిన్నకృష్ణుడ్ని అందరూ ముద్దాడి ఆశీర్వదించారు.

గోకులమంతా సంతోషాబ్ధిలో మునిగి తేలుతోంది. ఆ సమయంలో కంసుడి అనుచరవర్గానికి చెందిన శకటాసురుడు అనే రాక్షసుడు సంచారం చేస్తూ వ్రేపల్లె వచ్చి నందుని ఇంట్లోవున్న నల్లనయ్య గురించి చిత్ర విచిత్రాలు విన్నాడు. కృష్ణుడ్ని చూడాలనే ఉత్సుకత కలిగిందతనికి. పూతనను సంహరించిన డింభకుడు అతనే అయివుంటాడనీ, కంసుడు భయపడుతున్నది కూడా ఈ బాలకృష్ణుడ్ని గురించే అయివుండవచ్చుననీ ఆ రాక్షసుడు ఊహించాడు. వెంటనే నందుని ఇంటికి వెళ్ళాడు. ఆ ఇంటిముంగిట రెండెడ్లబండి కాడి వాల్చి వుంది. బండినిండా మధురపదార్థాలు, పళ్ళు, పాలు, వెన్న, మీగడ, పెరుగు రకరకాల పాత్రల నిండా వున్నాయి. రాక్షసుడికి నోరూరింది. బండిని ఆవేశించాడు. బండి కాడి లేచింది. బండి పెద్ద శబ్దం చేస్తూ ముందుకు కదిలింది. కృష్ణయ్య పూల ఊయలలోంచి ఇదంతా గమనిస్తూనే వున్నాడు. ఉన్నట్టుండి పెద్దగా ఏడవటం మొదలు పెట్టాడు. పిల్లవాడి ఏడుపు విని గోపికలు కృష్ణయ్య పడుకునివున్న తొట్టె దగ్గరికి పరుగున వచ్చారు. అతన్ని సముదాయించాలని ఎన్నో రకాలుగా ప్రయత్నించారు. కానీ లాభం లేకపోయింది. బాలకృష్ణుడ్ని ఎత్తుకుని బుజ్జగిస్తూ, కబుర్లుచెబుతూ ఒక గోపకాంత అతనిని బయటకు తీసుకువెళ్ళింది. అక్కడ

బండికి ఎద్దులు లేకుండా కాడి లేవడం, అది కదలడం గమనించి ఆ వ్రజవనిత విస్తుపోయి చూస్తూ నిలబడింది.



బండిని ఆవహించిన శకటాసురుడు కృష్ణయ్యను చూసాడు. వెంటనే కృష్ణయ్య మీదికి ఉరికించాడు బండిని. అది ఒక్క వుదుటున వచ్చి కన్నయ్యను తాకింది. చిరునవ్వు చిందిస్తూ నందకిశోరుడు వామ పాదంతో బండిని ఒక తాపు తన్నాడు. ఆ తాకిడికి శకటం తలకిందులైంది. ఇరుసూ, చక్రాలూ ఫెళ ఫెళ విరిగిపోయాయి. పాత్రలు భళ్ళున పగిలి పాలు పెరుగు, నెయ్యి నేలపాలయ్యాయి. బండి ముక్కలైంది.

అంతవరకూ ఆ బండిని ఆవహించివున్న రాక్షసుడు అంతెత్తుకు ఎగిరి దభీమని కిందపడ్డాడు. ఆ పాటువల్ల అతని శరీరం తునాతునకలైంది. పెద్దగా అరుస్తూ ప్రాణం వదిలాడు. ఆ అరుపుకు లోపలినుంచి యశోదానందులు, రోహిణి పరుగుపరుగున వచ్చారు.

బయట అంతా యుద్ధరంగంలా వుంది. విరిగిన బండిచక్రాల మధ్య, నేలపాలైన మధురపదార్థాల మధ్య కృష్ణయ్య ఆడుకుంటున్నాడు. అది చూసి గోపికలు, గోపాలురు నిర్ఘాంతపోయారు. నల్లనయ్యను చూసి నందయశోదలు విస్మితులయ్యారు.

ముసిముసి నవ్వులు నవ్వే చిన్నికృష్ణుణ్ణి గుండెలకు హత్తుకుని యశోద ఆనందాశ్రువులు రాల్చింది.

శ్రీకృష్ణుని చేత ఆ విధంగా సంహరింపబడిన శకటాసురుడు గత జన్మలో హిరణ్యాక్షుని కుమారుడయిన ఉత్కచుడు.

అతను ఒకసారి లోమశమహర్షి ఆశ్రమంలోకి ప్రవేశించి, అక్కడి ఉద్యానవనాన్ని ధ్వంసం చేశాడు. అది చూసి లోమశుడు 'ఈ చెట్లను నువ్వు ఎలా పెళ్ళగించావో అలా నీ శరీరంకూడా ముక్కలు ముక్కలవుతుంది' అని శపించాడు.

ఆ మాటలు విన్న ఉత్కచునికి అప్పుడు పశ్చాత్తాపం కలిగింది. మహర్షి పాదాలమీదపడి శాపవిముక్తి కలిగించమని వేడుకున్నాడు. మహర్షి అతనిని కరుణించాడు. 'ద్వాపర యుగాంతంలో నువ్వు వాయురూపం ధరించి శ్రీహరి పాదఘాతం ద్వారా ముక్తి పొందుతావు' అని లోమశుడు శాపవిముక్తి ప్రసాదించాడు.

ఆ విధంగా ఉత్కచుడు రాక్షసుడై జన్మించటం, కంసుడి అనుచరవర్గంలో చేరటం, మురారి అనుగ్రహం ద్వారా శాపవిముక్తి పొందటం జరిగింది.

# తృణావర్తుడు

**బా**లకృష్ణుడి అద్భుతాలూ, ఆగడాలూ ఆనోటా ఆనోటా పాకి దేశ మంతటా వ్యాపించాయి. వ్రేపల్లెలోని నల్లనివాడ్ని, అల్లరివాడ్ని గురించి కంసుడు ఇదివరకే రకరకాల కథలు విన్నాడు. దానికితోడు తన అనుచరులైన పూతననీ, శకటాసురుడ్నీ ఆ పిల్లవాడే చంపాడని తెలుసుకోగానే అతనికి ముచ్చెమటలు పోశాయి.

తృణావర్తుడనే మరో రాక్షసుడు తన ఏలిక అయిన కంసుని దగ్గర ప్రాపకం సంపాదించుకునేందుకు 'తమరు అనుమతి ఇవ్వండి ప్రభూ! ఆ పిల్లవాడి సంగతి నేను చూస్తా' అని బీరాలు పలికి పెద్ద పెద్ద అంగలువేసుకుంటూ మీసాలు మెలేసుకుంటూ బయలుదేరి వెళ్ళాడు.

వ్రేపల్లెలో ప్రవేశిస్తూనే తృణావర్తుడు పెద్ద సుడిగాలి లేవదీశాడు. ఆ కారణాన పట్టపగలే అయినా హఠాత్తుగా చీకటిపడ్డట్టయింది. ఆకాశంలో మబ్బులు కమ్ముకొచ్చాయి. రివ్వున గాలి వీచింది. దుమ్మురేగింది. గోకుల మంతా చిమ్మచీకటిలో మునిగిపోయింది. క్షణకాలం ఎక్కడివారక్కడే నిలిచి పోయారు.

యశోద బాలకృష్ణుడిని ఎత్తుకొని చకచక ఇంటికి వెళుతోంది. చంకలోని పిల్లవాడు వున్నట్టుండి బరువెక్కుతున్నట్టు అనిపించింది. యశోద పిల్లవాడ్ని

అటునుంచి ఇటు మార్చుకుంది. బిడ్డ ఇంకా బరువెక్కాడు. ఆమెకు ఏమిచెయ్యాలో పాలుపోక "ఏమిటిది కృష్ణయ్యా! ఇంతలోనే ఈ పరీక్ష! ఎందుకింత బరువెక్కావు?" అని బిడ్డను కిందకు దించి అలసట తీర్చుకుంది. అది అదనుగా తీసుకుని సుడిగాలి రూపంలో వచ్చిన తృణావర్తుడు బాలకృష్ణుడ్ని ఆకాశానికి ఎగరేసుకుపోయాడు.

అంతలోనే చీకట్లు విచ్చిపోయాయి. యశోదకు తనబిడ్డ కనిపించలేదు. 'కృష్ణా! కన్నా! తండ్రీ ఎక్కడ వున్నావురా?' అంటూ ఊరూ వాడా అంతా వెదికింది. బిడ్డ కనిపించకపోయేసరికి యశోద పెద్దగా ఏడ్చింది.

బాలకృష్ణుడ్ని అపహరించిన తృణావర్తుడికి ఆకాశమార్గాన పైకి పోయినకొద్దీ పిల్లవాడు క్రమక్రమంగా బరువవుతున్నాడు. ఆ బరువు మొయ్యలేక తృణావర్తుడు కిందికి తూలి పడుతున్నాడు. కృష్ణయ్య రాక్షసుడి మెడను గట్టిగా పట్టుకొని వుండడంవల్ల కృష్ణుడ్ని కిందపడేసి తన దారిన తను పోవడానికి కూడా తృణావర్తుడికి వీలుకాలేదు. కృష్ణయ్య పట్టు విడిపించుకోవడం ఆ రాక్షసుడివల్ల కాలేదు. అయినా పెనుగులాడాడు. అప్పటికే తృణావర్తుడు నోటివెంట నెత్తురు కక్కుతున్నాడు. కనుగుడ్లు మీదికి వచ్చాయి. శక్తి అంతా హరించుకుపోయింది. గమన వేగం మందగించింది. అడుగు కూడా ముందుకు పడటంలేదు. కృష్ణుడు పట్టిన పట్టుకు తృణావర్తుడు నేలకూలాడు. వ్రేపల్లె వీధుల్లో అతడి కళేబరం ముక్కలు ముక్కలై పడింది.

పర్వతంలా వున్న తృణావర్తుడి కళేబరంమీద కన్నయ్య ఏమీ తెలియనట్టు పారాడుతూ ఆడుకుంటున్నాడు. అది చూసి యశోద, రోహిణి పరుగు పరుగున దగ్గరకు వెళ్ళారు. బిడ్డను తీసుకుని గుండెలకు హత్తుకున్నారు.

తృణావర్తుడు పూర్వజన్మలో పాండుదేశాధిపతి. ఒకసారి మహారాజు అంతఃపుర స్త్రీలతో రేవాతీరంలో వున్నప్పుడు దుర్వాసమహర్షి అక్కడకు వెళ్ళాడు.

కేళీలోలుడై వున్న ఆ భూపాలుడు మహర్షిని లక్ష్యపెట్టలేదు. ఆతిథ్యం ఇవ్వలేదు. అది దూర్వాసుడికి అమితమయిన ఆగ్రహాన్ని కలిగించింది. 'నువ్వు రాక్షసుడివై పుడతావు' అని శపించాడు.

అలా పాండుభూపతి తృణావర్తుడై జన్మించడం, కంసుని బంటుగా మారడం, చివరకు శ్రీకృష్ణునిద్వారా శాపవిముక్తి పొందడం జరిగింది.

# బలరామకృష్ణులు



రోహిణి కుమారుడూ, యశోదాతనయుడూ పెరిగి పెద్దవారవుతున్నారు.

ఒకరోజు యశోద చిన్నికృష్ణయ్యకు పాలిచ్చి, ముద్దాడి, దిష్టి తీసి ఆడుకునేందుకు ఆటవస్తువులు ఇచ్చింది.

కృష్ణయ్య అవి తాకలేదు.

ఆవులించి కన్నులు మూశాడు.

యశోదకు అప్పుడు ఆ చిన్ననోటిలో భువనభాండాలు కనిపించాయి. సృష్టిమొత్తం కళ్ళముందు కదిలింది. యశోద ఆశ్చర్యపోయింది. తరువాత తేరుకుని కృష్ణయ్యను చేతుల్లోకి తీసుకుని ఉయ్యాలతొట్టిలో పడుకోబెట్టింది. జోలపాడి నిద్రపుచ్చింది.

ఒక రోజు యాదవ పురోహితుడైన గర్గుడు నందవ్రజానికి వచ్చాడు. నంద యశోదలు, రోహిణి భక్తిపూర్వకంగా ఆయనకు అతిథి పూజలు చేశారు.

పరిచర్యలన్నీ ఆయ్యాక 'మహాత్మా! మీరు పండితులు. మాకు పెద్దలు. మీరే ఈ చిన్నబిడ్డలిద్దరికీ సంస్కారాలు జరిపించాలని మా కోరిక' అన్నాడు నందుడు బలరామకృష్ణులిద్దర్నీ చూపించి.

నందుని ప్రార్థన అంగీకరించి గర్గుడు రోహిణీకుమారుడికి బలరాముడనీ యశోదాపుత్రుడికి కృష్ణుడనీ పేర్లు పెట్టాడు.

'రోహిణీకుమారుడు తన గుణాలద్వారా ప్రజలకు ఆనందాన్ని కలిగిస్తాడు. అందుకని ఇతనికి నేను 'రాముడు' అని నామకరణ చేసాను. కాలక్రమాన ఈ చిరంజీవి అత్యధిక బలసంపన్నుడవుతాడు. వీరుడు, ధీరుడు అవుతాడు. ఆ కారణాన ఇతన్ని 'బలుడు' అని కూడా పిలుస్తారు. యాదవులందర్నీ సమభావంతో చూస్తూ ఒకేవిధంగా ఆదరిస్తూ వుంటాడు. కాబట్టి ఇతనికి 'సంకర్షణుడు' అన్న పేరు కూడా వ్యాప్తిలోకి వస్తుంది.

'ఇక యశోదాతనయుని విషయానికొస్తే ఈ చిన్నారి గడచిన మూడు యుగాల్లోనూ మూడు రంగులు – శ్వేత, రక్త, పీత వర్ణాలు ధరించి అవతరించాడు. ఇప్పుడు నల్లవాడై పుట్టాడు. అందుకని ఇతనికి 'కృష్ణుడు' అని నామకరణం చేస్తున్నాను. ఇతను మొదట వసుదేవుని ఇంట పుట్టాడు. ఆ రహస్యం తెలిసిన ప్రాజ్ఞులు ఇతనిని 'వాసుదేవుడు' అని కూడా పిలుస్తారు. ఈ కృష్ణయ్య ముందు ముందు అనేక అద్భుత కార్యాలు చేస్తాడు. అనేక వింతలు ప్రదర్శిస్తాడు. దాని కారణంగా ఇతనిని ఇంకా అనేక పేర్లతో పిలుస్తారు. ఇతను దుర్జనులను శిక్షిస్తాడు. సజ్జనులను రక్షిస్తాడు. ఇతనివల్ల ధర్మ ప్రతిష్ఠాపన జరుగుతుంది. ఇతనివల్ల మీరూ, గోపకులూ, గోకులం ఎన్ని కష్టాలెదురైనా అవలీలగా అధిగమించగలుగుతారు. ఇతనిని పెంచి పెద్ద చేయడమే మహా

అదృష్టం. ఆ అదృష్టం మీకు దక్కింది. అది మీ పూర్వజన్మ సుకృతం.

‘పూర్వం అరాచకం ప్రబలిన ఒక సమయంలో ఈ మహానుభావుడ్ని ఆశ్రయించి అనుగ్రహం పొందిన ఎందరో మహర్షులూ, సాధువులూ దుర్మార్గుల దురాగతాలను అవలీలగా ఎదుర్కొన్నారు. ఇతనిపట్ల భక్తి భావంగల వారినీ, ప్రేమించే వారినీ, ఇతనిని కొలిచేవారినీ యెటువంటి శత్రువులైనా, ఎంతటి బలవంతులైనా ఏమీ చేయలేరు.

‘నందా! మరొక విషయం. ఈ చిన్నారి సామాన్యుడు కాడు. విశేష ప్రతిభ గలవాడు. గుణగణాల్లోనూ, అధికారఐశ్వర్యాలలోనూ, కీర్తిప్రతిష్ఠలలోనూ, భోగానుభవంలోనూ ఇతను సాక్షాత్తూ శ్రీహరికి సముడనిపించుకుంటాడు. ఇతని చర్యలన్నీ చూపరులకు వింతగా వుంటాయి. ఈ బిడ్డవల్ల మీ జీవితాలు తరిస్తాయి. మీ బతుకులకు ధన్యత కలుగుతుంది. ఇతనిని మీరు కంటికిరెప్ప మాదిరి కాపాడుకోవాలి’ అని చెప్పి గర్గుడు వెళ్ళిపోయాడు.

నందుడు పరమానందభరితుడయ్యాడు.

బలరామకృష్ణులు ఆటపాటలతో వ్రేపల్లెకు కొత్త వెలుగు తెచ్చారు.

కృష్ణుడి అల్లరి మరీ ఎక్కువైంది.

ఆవుదూడల తోకలు పట్టుకుని అటూ ఇటూ లాగి వాటిని వేధించడం, ఇరుగుపొరుగు ఇళ్ళలో దూరి గోపికలు దాచుకున్న పాలూ పెరుగూ తను తిన్నంత తిని మిగిలింది తన స్నేహితులకు పంచిపెట్టటం, కట్టివున్న దూడలను వాటి తల్లుల దగ్గరకు వదలడం, ఆడపిల్లల్ని ఏడిపించడంవంటి అల్లరి పనులు చేయటం మొదలు పెట్టాడు.

కృష్ణయ్యఅల్లరి కోపం తెప్పించినా అతనిని తలచుకోకుండా, అతనిని చూడకుండా వ్రేపల్లె వాసులు ఒక్కక్షణం కూడా వుండలేకపోయేవారు.



గోపికలకు అతని ఆటపాటలు మహదానందంగా వుండేవి. కృష్ణయ్య చేష్టలు వాళ్ళకు గిలిగింతలు పెట్టేవి. ఆలుమగలు నిద్రిస్తుంటే వాళ్ళకు తెలియకుండా ఆమె జడను అతని కొప్పుకు కట్టేసేవాడు. రాత్రిళ్ళు ఇళ్ళల్లో జొరబడి ఉట్టిమీద వున్న పాలు, పెరుగు తాగేవాడు. అతనిచుట్టూ ఎప్పుడూ ఓ పదిమంది సహవాసగాళ్ళుండేవాళ్ళు. అందరూ అల్లరివాళ్ళే. వాళ్ళందరికీ నాయకుడు కృష్ణయ్య. కన్నెపిల్లలు కవ్వాలేసుకుని మజ్జిగ చిలికి వెన్న తీస్తుంటే వెనకగా వెళ్ళి బానలో వున్న వెన్నంతా ఆరగించేవాడు. ఎంతకీ బాన నిండటం లేదేమిటని గోపకన్యలు బుగ్గలు నొక్కుకునేసరికి బాన చాటున కృష్ణయ్య నక్కేవాడు.

ఒకసారి చిన్నికృష్ణయ్య ఇలాగే దొరికిపోయాడు. గోపెమ్మ తెడ్డుతీసి కొట్టబోయింది. తటాలున కృష్ణయ్య ఎడమచేత్తో ఇంత వెన్న తీసి ఆమె ముఖాన పూసి పారిపోయాడు.

పిల్లలంతా చప్పట్లు కొట్టారు.

ఊరి అమ్మలక్కలంతా యశోద ఇంటికి వచ్చి కృష్ణయ్య అల్లరి మితిమీరుతోందని దీనంగా మొరపెట్టుకున్నారు. బాలకృష్ణుని దుడుకుతనం గురించి గోపస్త్రీలు కథలు కథలుగా చెబుతుంటే యశోదకు నమ్మబుద్ధి కాలేదు.

ఇంతలో కొందరు గోపికలు చిన్నికృష్ణుడ్ని బంధించి తీసుకువచ్చారు.

ఆ సమయాన కృష్ణయ్య యశోద ఒడిలో పడుకుని హాయిగా నిద్రపోతున్నాడు.

గోపికలు తల్లి ఒడిలో బాలకృష్ణుడు నిద్రపోతుండడం చూసి, తాము బంధించి తీసుకువచ్చిన కృష్ణయ్య కనపడకపోవడం గ్రహించి ఆశ్చర్యపోయారు. యశోదకు కూడా ఇదంతా మాయలా వుంది.

ఒడిలోని దివ్యమంగళరూపుడ్ని, లీలామానుషస్వరూపుడ్ని ఒళ్ళంతా నిమిరి గుండెలకు హత్తుకుంది.

'దొంగపిల్లడు' అని బుగ్గగిల్లి గోపకన్యలు వెళ్ళిపోయారు.

# మాతృదండన

**ఒ**కసారి యశోదాదేవి చల్ల చిలికి వెన్న చేస్తోంది. బాలకృష్ణుడు వచ్చి వెన్నకుండ దగ్గర నిలబడి పాలుకావాలని అడిగాడు. యశోద చేతిలో వున్న పని ఆపి బిడ్డని ఒడిలోకి తీసుకుని పాలు ఇచ్చింది. నల్లనయ్య పాలు తాగుతూ ముసిముసినవ్వులు నవ్వుతున్నాడు. యశోద పరవశించిపోయింది.

పాలు తాగాక కృష్ణయ్య అమ్మ ఒడిలో పడుకుని హాయిగా ఆడుకుంటున్నాడు.

తల్లికీ బిడ్డకూ కాలమే తెలియడం లేదు.

ఇంతలో –

పొయ్యిమీద పాలు పొంగి దాలిగుంటలో పడి వాసన వచ్చాయి. కంగారుగా బిడ్డను కిందకు దించి వంటింట్లోకి పరుగెత్తింది యశోద.

కృష్ణయ్య ఉక్రోషంతో పెద్దగా ఏడ్చాడు.

యశోద వినిపించుకోలేదు.

కృష్ణయ్యకు కోపం వచ్చి పక్కనేవున్న కవ్వంతో చల్లకుండను పగలకొట్టి చేతినిండా వెన్న తీసుకుని బొక్కాడు. ఇంకాస్త తీసుకుని వీధిలోకి పరుగెత్తాడు.

పొయ్యిమీద పాలు కిందకు దింపి యశోద వచ్చింది.

కృష్ణయ్య అక్కడ లేదు.

పగిలిపోయిన కడవ ముక్కలు, ఇల్లంత ప్రవహిస్తున్న చల్ల కాలవలు కనిపించాయి.

'కృష్ణయ్యా' అని పెద్దగా పిలిచి నల్లనయ్య పాదముద్రలు కలగలసి కనిపిస్తున్న చల్ల చారికల వెంటే వెళ్ళింది. పక్క ఇంటివరకూ ఆ పాదముద్రలు కనిపించాయి. లోపలికి వెళ్ళింది. ఆ సమయంలో ఆ ఇంట్లో ఎవ్వరూ లేరు. కృష్ణయ్య మాత్రం అక్కడ ఒక రోటిమీద ఎక్కి నుంచుని ఉట్టిమీద వెన్న కుండకు చిల్లుపొడిచి వెన్న తీసుకు తింటున్నాడు. తను తింటూ మధ్య మధ్య పక్కనున్న ఒక కోతిపిల్లకు కూడా వెన్న తినిపిస్తున్నాడు. యశోద అదంతా విచిత్రంగా చూసింది. తరువాత బెత్తం తీసుకొని కొడుకుని కొట్టబోయింది. కృష్ణయ్య చిక్కకుండా పారిపోయాడు.

యశోదకు కోపం ఎక్కువైంది. 'వస్తావా రావా" అని పెద్దగా అరిచింది. 'అమ్మో కొడతావు' అని కళ్ళనిండా భయాన్ని ప్రదర్శిస్తూ కన్నయ్య పరుగెత్తాడు. యశోద కూడా పరుగెత్తింది. పనివాళ్ళు, పాలేళ్ళు, గోపికలు చోద్యం చూస్తున్నారు.



కృష్ణయ్య ఏడుస్తూ పరుగు తీస్తున్నాడు.

యశోద పరుగెత్తలేక రొప్పుతోంది.

చివరికి కృష్ణయ్యే దొరికిపోయాడు.

తల్లి కోపంతో వూగిపోతోంది.

బిడ్డ బిక్కమొహంతో నిలబడ్డాడు.

ఒకటి అంటించింది.

బావురుమని మొహమంతా కాటుక చేసుకున్నాడు.

కొడుకు కన్నీళ్ళు చూసి యశోద కూడా ఏడ్చేసింది.

బెత్తం కిందపడేసి చేతులు చాచింది. కృష్ణయ్య పరుగు పరుగున వచ్చి తల్లి గుండెలమీద వాలిపోయాడు. కోపం తగ్గాక "నీ అల్లరి మితిమీరిపోతోంది కన్నా! నిన్ను ఊరికే వదలిపెట్టను, రా!" అంటూ లాక్కుని వెళ్ళి అక్కడే వున్న రోటికి బిడ్డను కట్టడానికి ప్రయత్నించింది. కాని, ఆమె తెచ్చిన తాడు ఆ చిన్నారి నడుముకు సరిపోలేదు. మరొక తాడు తెచ్చి మొదటి తాడుకు ముడేసి పిల్లవాణ్ణి కట్టబోయింది యశోద. ఆ తాడు కూడా నల్లనయ్య నడుముకు సరిపోలేదు.

ఎన్ని తాళ్ళో....ఇంట్లో వున్న తాళ్ళన్నీ తెచ్చినా కృష్ణయ్యని బంధించేందుకు సరిపోలేదు. యశోదకు ఆశ్చర్యమేసింది. అలసట కలిగి ఉస్సురంది. అయినా, తన ప్రయత్నం విరమించలేదు. తనను రోటికి కట్టేసేందుకు తల్లి పడుతున్న పాట్లన్నీ చూసి చిన్నికృష్ణుడు నవ్వుకున్నాడు. 'ఇక్కడే వుండు. కదిలితే వూరుకోను' అని కృష్ణయ్యను గదిమి యశోద లోపలికి వెళ్ళింది. మరుక్షణం పాకుతూ కృష్ణయ్య బయలుదేరాడు. రోటిని ఈడ్చుకుంటూ బయటకు వెళ్ళాడు.



దూరంగా రెండు మద్దిచెట్లున్నాయి. రెండూ పక్కపక్కగా ఉన్నాయి. కృష్ణయ్య వాటి మధ్య నుంచి పాకుతూ వెళ్ళాడు. తానైతే బయటికి వచ్చాడు. కానీ, వెనకే వస్తున్న రోలు మాత్రం రెండు చెట్ల మధ్య ఇరుక్కుపోయింది. నల్లనయ్య వెనక్కి తిరిగి ఒకసారి చూసి తన బలమంతా ఉపయోగించి గట్టిగా రోటిని లాగాడు. దానితో ఆ మద్దిచెట్లు కూకటివ్రేళ్ళతో సహా వెలికివచ్చి కూలిపోయాయి. మరుక్షణం ఆ చెట్ల నుంచి కుబేర పుత్రులు నలకూబర మణిగ్రీవులు బయటకు వచ్చి కృష్ణయ్యకు నమస్కరించారు.

ఒకప్పుడు కుబేర కుమారులున్న ప్రదేశానికి నారదమహర్షి వెళ్ళాడు. వారు ఆ మహర్షిని చూడటమైతే చూశారు కాని మద్యం సేవించి వుండడంవల్ల ఆయనను లక్ష్యపెట్టలేదు. నారదముని వాళ్ళకు తగిన శిక్ష విధించాలనుకుని మద్దిచెట్లయి పడి వుండమని శపించాడు. శ్రీకృష్ణపరమాత్మ దయవలన శాప విముక్తి లభిస్తుందని కూడా చెప్పాడు.

లీలామానుష స్వరూపుడైన నల్లనయ్యను దర్శించే భాగ్యం ఆ విధంగా వాళ్ళకు కలిగింది. శాపవిముక్తి పొంది నల్లనయ్య దీవెనలు అందుకుని నలకూబర మణిగ్రీవులు మాయమైపోయారు.

చెట్లు కూలిన భీకర శబ్దానికి యశోద ఒక్క పరుగున వచ్చింది. కూలిన పెనువృక్షాల మధ్య ఏమీ ఎరగనట్టు ఆడుకుంటున్న కృష్ణుడ్ని చూసి ఆశ్చర్య పోయింది. మనసులోనే వేనవేల దేవుళ్ళకి మొక్కి, నల్లనయ్యను దగ్గరకు తీసుకుని ఒళ్ళంతా నిమిరింది.

అల్లరయ్య కిలకిలా నవ్వాడు.

# బృందావనం

'మొన్నటికి మొన్న పూతన, శకటారుసుడు, తృణావర్తుడు చచ్చి నేలపడటం, ఈ రోజు గాలీ, వానా, మబ్బూ లేకుండా పిడుగులు పడటం, ఏనాటి నుంచో వున్న మద్దిచెట్లు ఫెళ ఫెళ కూలిపోవడం....ఇదంతా ఏదో రాక్షస మాయలాగా వుంది. ఈ ప్రాంతం మనకు అనువుగా లేదు. ఇక్కడ మన బిడ్డలకు, ఆలమందలకూ రక్షణ లేదు. అందువల్ల మనం బృందావనం వెళ్దాం' అన్నాడు నందుడు.

వ్రేపల్లెవాసులందరూ సరేనన్నారు.

వెంటనే యమునానది ఒడ్డున వున్న బృందావనానికి ఆలమందలను తీసుకుని, సంసారాలను తరలించుకుని వెళ్ళారు.

వాళ్ళకి బృందావనం చాలా బాగా నచ్చింది. అక్కడ 'గోవర్ధన గిరి' వుంది. చూడచక్కగా వుంది. పచ్చని కొండ. పశువుల మేతకు కొరత లేదు. తాగినంత నీరు, తియ్యగా అమృతంలా వుంది. పరవళ్ళు తొక్కుతున్న యమునను చూస్తూనే గొల్లభామలంతా ఆనందంగా చిందులు వేస్తూ ఆటలాడుతూ పాటలు పాడారు. చెట్లనీడన సేదతీరుతూ పశువులన్నీ ఒకేసారి 'అంబా' అని సంబరంగా అరిచాయి.

కృష్ణయ్య, బలరాముడు సహవాసగాళ్ళతో కలిసి తెగ ఆటలాడారు.

బృందావనం చేరుకున్న గోపాలకులు పదహారు క్రోసులమేర భూమిని ఆక్రమించుకున్నారు. అక్కడ ఇళ్ళూ, వాకిళ్ళూ ఏర్పరచుకున్నారు. బృందావనం మొత్తం నిడివి డెబ్భైనాలుగు క్రోసులుంటుంది. వెడల్పు అర్ధ యోజనం వుంటుంది. దానికి తూర్పునా, ఉత్తరానా బర్హిషదం, దక్షిణాన మధురాపురం, పశ్చిమాన శోణపురం వున్నాయి. బృందావనం తీర్థరాజంగా పేరు పొందింది. అక్కడికి దగ్గరలోనే నందీశ్వర పర్వతం కూడా వుంది.

గోకులమంతా బృందావనం చేరుకోటానికి ఒక ముఖ్య కారణం కూడా వుంది. యమునకు దక్షిణంగా ఒక వెలగతోట వుంది. అది ఒకప్పుడు బలికి అన్న అయిన 'కాలకలి' అనే వాని సంతానం. ఆ వనంలోని చెట్లన్నీ విషగంధం వదులుతూ వుంటాయి. ఆ చెట్లకు తోడుగా కాలకలి అనుచరులుకూడా అక్కడ మరికొన్ని వృక్షాలుగా పుట్టారు.

కాలకలికి ఏడుగురు భార్యలు. వారందరూ గోవులయినారు. వారికి అనేక వందల సంతానం కలిగింది. ఆ వెలగతోట పుట్టిన పన్నెండేళ్ళకు పూచి ఫలించింది. ఆ ఫలాలను తింటూ గోసంతతి జీవిస్తోంది. అయితే ఆ వృక్షాలు విడిచే విషగంధంవల్ల వ్రేపల్లె అంతటా రకరకాల వ్యాధులు ప్రబలాయి. వాటిని నివారించే నిమిత్తం వ్రేపల్లె ప్రజలు ఏడు రోజులపాటు దీక్షతో మహేశ్వరుడ్ని పూజించారు. వారి పూజలకు మెచ్చి మహేశ్వరుడు తన భటుడైన శంఖకర్ణుని గోకులానికి పంపాడు. అతను వెళ్ళి 'కాలకలి సంతానాన్ని నిర్మూలించే శక్తి బలరామకృష్ణులకు మాత్రమే వుంది. గోకులమంతా బృందావనానికి మారే పక్షంలో రామకృష్ణులకు ఆ చెట్లను నిర్మూలించే అవకాశం కలుగుతుంది. దానివల్ల విషవాయువులు వ్యాపించటం ఆగి పోతుంది. గోకులం సుఖంగా వుంటుంది' అని చెప్పి అదృశ్యమయ్యాడు.

ఆ విధంగా మహాదేవుని సందేశాన్ని శిరసావహించి గోకులమంతా వ్రేపల్లె నుంచి బృందావనం చేరుకుంది. నల్లనయ్య కాలు మోపగానే బృందావనం కొత్త అందాలు సంతరించుకుంది.

కృష్ణుడు, బలరాముడు ఒకసారి గోపబాలురతో కలిసి యమునా తీరానికి వెళ్ళారు. ఆ సమయంలో కంస భృత్యుడయిన ఒక రాక్షసుడు కృష్ణుడ్ని వెతుక్కుంటూ అక్కడికి వచ్చాడు. రాక్షసమాయతో ఒక లేగదూడగా మారిపోయి ఆ పరిసరాల్లో వున్న ఆవుల మందలో కలిసిపోయాడు. గోపబాలురెవరూ అది తెలుసుకోలేకపోయారు. 'ఈ కొత్త లేగదూడ ఎక్కడిది?' అన్న ఆలోచన బలరాముడికి కూడా రాలేదు.



కాసేపయ్యాక కృష్ణయ్య బలరాముడిని పక్కకు పిలిచి, మందలో కొత్తగా వచ్చి చేరిన లేగదూడను చూపించి 'అది మన దూడ కాదు. మన మామయ్య కంసుడు పంపించాడు దాన్ని. దానికి తగిన మర్యాదలు చేద్దాం మనం' అన్నాడు నవ్వుతూ. మెల్లగా వెళ్ళి దాని వెనుక కాళ్ళు రెండూ పట్టుకుని ఎత్తి గిరగిర తిప్పి పక్కనేవున్న చెట్టుకేసి కొట్టాడు. ఆ దెబ్బలు భరించలేక లేగ రూపంలో వున్న రాక్షసుడు గావుకేక పెట్టి నిజరూపంలో ప్రాణాలు వదిలాడు. అది చూసి

గోపబాలురంతా భయపడిపోయారు. ఆ విధంగా శ్రీకృష్ణునిచేత సంహరించబడ్డవాడు వత్సాసురుడు. అంతకు పూర్వం అతను మురాసుతుడు ప్రమీలుడు. అతనొకసారి వశిష్ఠముని ఆశ్రమానికి వెళ్ళి, అక్కడ వున్న 'నందిని' అనే ఆవును చూశాడు. అది తనవద్ద వుంటే బాగుండుననుకున్నాడు. ఆ వెంటనే అతను విప్రరూపం ధరించి వశిష్ఠ మహర్షి దగ్గరకు వెళ్ళి ఆ ధేనువును తనకు దానం ఇవ్వవలసిందిగా కోరాడు. కాని, వశిష్ఠుడు ఏ విధమయిన సమాధానం ఇవ్వలేదు. మౌనం వహించి వూరుకున్నాడు. నందినికి పరిస్థితి అర్థమయింది. ప్రమీలుని మోసం గ్రహించింది. "నువ్వు దేనిని కోరి వశిష్ఠుడ్ని మోసం చేయదలచుకొన్నావో అదే రూపాన్ని నువ్వు ధరిస్తావు" అని శపించింది.

ప్రమీలునికి తను తలపెట్టిన అత్యాచారం ఎటువంటిదో అప్పుడు అర్థమైంది. మహర్షికీ, నందినికీ నమస్కరించి తనను అనుగ్రహించవలిసిందిగా ప్రార్థించాడు.

ఆ ప్రార్థనకు నందిని జాలిపడింది. 'ద్వాపరంలో శ్రీహరి గోపాలుడై బృందావనంలో విహరిస్తాడు. అప్పుడు ఆయన నీకు విముక్తి కలిగిస్తాడు' అని చెప్పింది.

ఆ విధంగా ప్రమీలుడు గోవత్సరూపం ధరించడం, బృందావనంలో ఆలమందల్లో కలసిపోవడం, నల్లనయ్య చేతుల్లో మరణించి శాపవిముక్తి పొందడం జరిగింది.

# బకాసురుడు

ఒకసారి బృందావనంలోని గోపబాలురందరూ బలరామకృష్ణుల్ని వెంట పెట్టుకుని అడవికి వెళ్ళారు. అక్కడ వాళ్ళకు ఒక పెద్ద కొంగ కనిపించింది. ఆ బకుడ్ని చూడగానే గోపబాలకులు భయపడి పోయారు. దాని ముక్కు మూరెడు పొడుగుంది. దాని శరీరం బలిష్టంగా వెండికొండ మాదిరి వుంది. అది గభాలున వచ్చి కృష్ణయ్యను ముందర వాలి అతడ్ని మింగేసింది. అది చూసి గోపబాలురందరూ పెద్దగా ఏడ్చారు. వారి ఆక్రందన విన్న మహేంద్రుడు ఏదో పెద్ద ప్రమాదమే జరిగిందనుకుని శస్త్రాస్త్రాలు తీసుకుని అక్కడికి వచ్చాడు. వస్తూనే కొంగ మీదకు తన వజ్రాయుధాన్ని విసిరాడు. అయినా ఆ వజ్రాయుధం బకుడ్ని ఏమీ చేయలేకపోయింది. అది గ్రహించి మహేంద్రుడు బ్రహ్మదండాన్ని ప్రయోగించాడు. బ్రహ్మదండం దెబ్బకు బకుడు మూర్ఛపోయినా మళ్ళీ వెంటనే తేరుకున్నాడు.

ఇంతలో రుద్రుడు వచ్చాడు. ఆయన తన త్రిశూలాన్ని బకుని మీద ప్రయోగించాడు. ఆ త్రిశూలం బకునిశరీరంలో కొంతభాగాన్ని మాత్రమే ఖండించగలిగింది. అది చూసి వాయుదేవుడు తన శక్తిని ప్రయోగించాడు. అయినా బకుడు రవ్వంత కూడా చలించలేదు.

ఆ తరువాత కుబేరుడు బకునిమీద తన కత్తిని విసిరాడు. అది వెళ్ళి బకుని శరీరాన్ని మరికొంత మేర ఖండించింది. చంద్రుడు హిమాస్త్రాన్ని సంధించాడు. అయినా ప్రయోజనం లేకపోయింది.

అగ్నిదేవుడు ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించాడు. అది బకుని రోమాలను మాత్రం భస్మం చేసింది. అది చూసి వరుణదేవుడు తన పాశాన్నీ, కాళి తన గదనూ బకుని మీదకు విసిరారు. బకుడు అప్పటికీ చలించలేదు.

దేవతలు బకుని శక్తికి ఆశ్చర్యపోయారు. వాళ్ళు చూస్తుండగానే బకుడు అమాంతం ఆకాశానికి ఎగిరాడు. ఎగురుతూ పెనుగాలులు సృష్టించాడు. ఆ గాలివిసురుకి దేవతలు భయపడి తలో దిక్కుకీ పారిపోయారు. ఆ సమయంలో దేవతలకు ఏమి చెయ్యాలో పాలుపోక నల్లనయ్యను ప్రార్థించారు. బకుని నోటినుంచి బయటకు వచ్చి తమను కాపాడవలసిందిగా వేడుకున్నారు.

దేవతల మొర ఆలకించి కృష్ణయ్య బకుని పొట్టలో తన శరీరాన్ని పెంచుకున్నాడు. అలా పెరిగి పెరిగి బృహద్రూపం ధరించిన కృష్ణయ్యను బకుడు బరించలేక గిలగిల కొట్టుకొని అతడ్ని బయటకు కక్కేశాడు. ఆ తరువాత బకుడు కూడా శరీరాన్ని పెంచుకుని తన పొడుగాటి ముక్కుతో కృష్ణయ్యను చంపబోయాడు.

అది గ్రహించి కృష్ణయ్య తన రెండు చేతులతోనూ బకుని ముక్కు తుండాలు పట్టుకొని చీపురుపుల్ల మాదిరి చీల్చేశాడు. మరుక్షణం ఆ కొంగ మాయమైపోయింది. దానిస్థానంలో ఒక రాక్షసుడు రెండుగా చీలిన శరీరంతో కనిపించి గిలగిల తన్నుకుని ప్రాణం వదిలాడు.

ఇంతకీ ఆ బకుడెవరంటే....పూర్వజన్మలో హయగ్రీవుని కుమారుడైన ఉత్కలుడు. ఆ ఉత్కలుడు దేవతలను అమితంగా వేధించేవాడు. ఒకసారి ఉత్కలుడు జాజల మహర్షి ఆశ్రమప్రాంతంలోవున్న మడుగులో ప్రవేశించి



చేపల్ని పట్టుకున్నాడు. అది జాజలుడు చూసి 'నీ ప్రతాపం చూపించడానికి ఈ మీనాలే దొరికాయా' అన్నాడు.

ఉత్కలుడు బదులివ్వలేదు.

జాజల మహర్షికి కోపం వచ్చి 'నువ్వు బకుడివై పుడతావు' అని శపించాడు. జాజలుడు సామాన్యుడు కాదు. ఆరువేల సంవత్సరాలు తపస్సు చేసిన మహానుభావుడు. జాజల మహర్షి శాపానికి గురైన ఆ ఉత్కలుడే బకుడై పుట్టడం, బృందావనం దగ్గర అడవిలో చరిస్తూ వుండటం, కాలక్రమాన శ్రీకృష్ణుని స్పర్శచేత ముక్తి పొందడం జరిగింది.

# అఘుడు

**ఒ**కసారి బలరామకృష్ణులు స్నేహితులతోకలసి ఒక ఉద్యానవనంలో ఆటలాడుకుంటున్నారు. అలా పిల్లలందరూ ఆటపాటల్లో మునిగివున్నప్పుడు 'అఘుడు' అనే రాక్షసుడొకడు అక్కడికి వచ్చాడు. అతను కంసుని భృత్యుడు. బకునికీ, పూతనకూ తమ్ముడు. తన సోదరులు ఒక గొల్లపిల్లవాని చేతిలో హతులయ్యారని తెలుసుకుని, ఎలాగైనా ఆ పిల్లవాడి అంతు చూడాలనుకుని అక్కడికి వచ్చాడు. బలరామకృష్ణులను చూడగానే 'వీళ్ళే నా అన్నల ప్రాణాలు తీసి వుంటార' న్న నిర్ణయానికి వచ్చాడు అఘుడు.

వెంటనే ఆమడ పొడవూ, కొండంత లావూ ఉన్న కొండచిలువ రూపం ధరించి, పెద్ద గుహ మాదిరిగా నోరు తెరిచి కృష్ణుడిని మింగేసేందుకు ఒకచోట పొంచి వున్నాడు. ఆ కొండచిలువను చూసి కూడా గోపబాలురు భయపడలేదు. 'మన కృష్ణయ్య వుండగా మనకేం భయం' అనుకుని దాని దగ్గరకు వెళ్ళారు. బిలం మాదిరిగా వున్న దాని నోట్లోకి ఒక్కొక్కరే నడిచివెళ్ళారు. కాని, కొండచిలువ వాళ్ళనేమీ చెయ్యలేదు. కృష్ణయ్య కోసం వేచి ఉంది కాబట్టి కదలకుండా మెదలకుండా అలాగే వుంది. బాలకృష్ణుడు దూరంనుంచి ఇదంతా గమనిస్తూనే వున్నాడు. అది భయంకరమైన కొండచిలువ అని తెలిసి కూడా గొల్లపిల్లలు తనమీద విశ్వాసంతో దాని నోట్లోకి ప్రవేశించారనీ, అది తన కోసమే వేచి వున్నదనీ కృష్ణయ్యకి తెలుసు. తన స్నేహితులకు చేటు కలగకుండానూ, కొండచిలువ కోరిక నెరవేరకుండానూ ఉండే ఉపాయం ఏమిటా అని ఒక్కక్షణం

ఆలోచించాడు. చిరునవ్వుతో ఆలోచించి, తను కూడా దాని నోట్లోకి వెళ్ళాడు. అలా వెళ్ళిన నల్లనయ్య ఆ కొండచిలువ గొంతులోనే ఆగి తన శరీరాన్ని మహాద్భుతంగా పెంచుకున్నాడు. దాంతో ఆ అజగరం గొంతు పూడిపోయింది. ఊపిరి ఆడే అవకాశం ఏమాత్రం లేకుండా పోయింది.

గిలగిల కొట్టుకుంది. తల నేలకేసి బాదుకుంది.

కాసేపటికి దాని తల వ్రయ్యలయింది.

పగిలిన శిరస్సులోంచి గోపబాలురతో సహా కృష్ణయ్య బయటకు వచ్చాడు. శ్రీకృష్ణుని దివ్యశరీరస్పర్శ మూలంగా పాపాలన్నీ హరించుకు పోవడం వల్ల ఆ కొండచిలువలోంచి ఒక మహా తేజస్సు బయటకువచ్చి కృష్ణయ్యలో లీనమైపోయింది.

కృష్ణయ్యలో అలా లీనమైన అఘుడు పూర్వం శంఖుడనే రాక్షసుని కుమారుడు.

అఘుని బలసంపద అమోఘంగా వుండేది. దానికితోడు అతని రూప లావణ్యాలు, యవ్వనం అతనిని గర్విష్ఠిగా తయారుచేసాయి. అతనొకసారి మలయాద్రి మీద తపస్సు చేసుకుంటున్న అష్టావక్రుని చూశాడు. వంకర టింకరగా వున్న ఆయనను చూసి అపహాస్యం చేశాడు. అష్టావక్రుడు ఆగ్రహించాడు. 'నువ్వు సర్పరూపం ధరిస్తావు' అని అఘుడిని శపించాడు. అఘుడు తన తప్పు తెలుసుకుని అష్టావక్రుడి పాదాలమీద పడ్డాడు. పశ్చాత్తప్తుడైన అఘుని చూసి జాలిపడి 'శ్రీకృష్ణుడు ఎప్పుడు నీలో ప్రవేశిస్తాడో అప్పుడు నీకు శాపవిముక్తి కలుగుతుంది' అని చెప్పాడు అష్టావక్రుడు.

అప్పటి నుంచి శ్రీకృష్ణుడు ఎప్పుడు కనిపిస్తాడా, ఎప్పుడు ఎలా ఆయనను మింగి శాపవిముక్తిని పొందుతానా అని అఘుడు తపించసాగాడు. కాలక్రమేణా అతను బృందావనం చేరుకుని శ్రీకృష్ణుని అనుగ్రహం ద్వారా శాపవిముక్తి పొందాడు.

# కృష్ణమాయ

భయంకరమైన కొండచిలువగా మారి తనను సంహరించేందుకు వచ్చిన కంసభృత్యుడు అఘాసురుడ్ని తుదముట్టించాక కృష్ణుడు తన సావాసగాళ్ళందరినీ తీసుకుని యమునాతీరానికి వ్యాహ్యాళికి వెళ్ళాడు. గోపబాలురందరూ ఆవులను పచ్చికలకు తోలి కృష్ణయ్యతో ముచ్చట్లు పెట్టుకున్నారు. కాసేపటికి అందరికీ ఆకలైంది. అన్నం మూటలు విప్పారు. ఊరగాయల వాసనలు గుప్పుమన్నాయి. ఒకరి మూట మీదకు మరొకరు ఎగబడ్డారు. చద్దిఅన్నం, ఆవకాయ కలగలిసిన రాసులు క్షణాల్లో తరిగిపోయాయి. ఆ తరువాత గోంగూర, మీగడపెరుగు మేళవించిన చద్దిముద్దల కోసం పోటీపడి ఒకరి చేతిలో ముద్దను ఇంకొకరు ఎగరేసుకుపోయారు. కృష్ణుడు కావల్సినంత సందడి చేశాడు. తను భోక్త అయి కూడా మిగిలిన పిల్లల్లాగ ఆయన కూడా చద్దన్నం ముద్దలు ఆనందంగా ఆరగించాడు. పైనుండి చూస్తున్న దేవతలకిదంతా ఆశ్చర్యంగా వుంది.

గోపబాలురు ఆటపాటల్లో వున్న సమయంలో ఆవులు పచ్చిక మేసేందుకు దూరంగా వెళ్ళాయి. అది తెలీక గోపబాలురు వాటికోసం ఆందోళన చెందారు. భయపడాల్సిన పనిలేదని కృష్ణయ్య వారికి నచ్చచెప్పి ఆవులమందవున్న వేపుకి వెళ్ళాడు.

సరిగ్గా ఆ సమయంలో బ్రహ్మదేవునికో కోరిక కలిగింది. కృష్ణయ్య లీలలు గురించి తను వింటున్నాడు, చూస్తున్నాడు. కృష్ణయ్య చేసేవన్నీ అద్భుతాలే!

అటువంటి అద్భుతాలు మరికొన్ని చూస్తే బాగుండుననిపించింది విరించికి.

వెంటనే దూరంగా వనాంతరాల్లో పచ్చిక మేస్తున్న ఆవుల్నీ ఆవుదూడల్నీ మాయం చేశాడు. అది తెలియని కృష్ణయ్య వాటికోసం చాలాసేపు వెతికాడు. కానీ ఎంతకీ అవి కనిపించలేదు. తిరిగి స్నేహితులుండే చోటికి వెళ్ళాడు. అక్కడ వాళ్ళు కూడా లేరు. కృష్ణయ్య అప్పుడు దీర్ఘంగా ఆలోచన చేశాడు. ఆయన కర్మధర్మ చక్రవర్తి, భూత, భవిష్యత్ వర్తమానాలు తెలిసినవాడు కాబట్టి జరిగిందేమిటో క్షణాల్లో పసికట్టాడు. అదంతా బ్రహ్మదేవుని మాయ అని తెలుసుకున్నాడు. మాయలు చేయడం ఆయనకు తెలీకపోతేగా! వెంటనే ఆయనా ఒక మాయ చేశాడు. ఆవులూ, ఆవు దూడలూ ఎన్ని ఉన్నాయో వాటన్నింటి ఆకారాలూ ఆయనే ధరించి గోకులం చేరాడు. ఎవరి గోవులను వారి కొట్టాలలో వదిలిపెట్టాడు. అలాగే గోపబాలురెందరున్నారో వాళ్ళందరినీ వాళ్ళ ఇళ్ళకు చేర్చాడు. తనూ ఇంటికి చేరాడు.

అదేమిటో చిత్రం ఆరోజు గోకులంలోని వాళ్ళందరికీ తమ బిడ్డలూ, ఆవులూ, దూడలూ అన్నీ ఎప్పుడూ లేనంతగా తెగ ముద్దొచ్చాయి. వాత్సల్యంతో అందరినీ, అన్నిటినీ దగ్గరకు తీసుకున్నారు. గోవుల్లోనూ గోవత్సాల్లోనూ గోపబాలురలోనూ కృష్ణయ్య దాగి వుండటం మూలంగానే తమకంత అపూర్వ ఆనందం కలుగుతోందన్న సంగతి వాళ్ళకు తెలీదు.

ఇలా ఏడాది కాలం గడిచింది. మనకు ఏడాది కాలమంటే అది బ్రహ్మ దృష్టిలో తృటి మాత్రం. ఆ తృటి కాలం గడిచిపోగానే సృష్టికర్తకు మళ్ళీ ఆ వనంలో కృష్ణుడూ అతని మిత్రులూ, గోవులూ, లేగదూడలూ అన్నీ కనిపించాయి. ఆశ్చర్యపోయాడు.

తను మాయాగృహంలో వీళ్ళందర్నీ దాచిపెడితే మళ్ళీ ఎలా బయటకు వచ్చారు? ప్రాణుల్ని సృష్టించే శక్తి తనకు తప్ప మరెవరికీ లేదే! వీళ్ళందర్నీ ఎవరు సృష్టించారు? కలా? భ్రమా?!

కృష్ణుడ్ని తను మాయ చేయాలనుకుంటే కృష్ణుడే తనను మాయ చేశాడు. ఎనిమిది కళ్ళూ విప్పార్చుకుని కృష్ణుడివైపు, గోవులవైపు గోపబాలురవైపు చూశాడు. అన్నీ ఒకే విధంగా కృష్ణుని రూపాలుగా వున్నాయి. అందరూ నీలమేఘచ్ఛాయలో వున్నారు. ఆనంద పరవశులై వున్నారు.

అదంతా చూస్తున్న విధాతకు కన్నుల పండువగా వుంది. అప్రయత్నంగా చేతులు జోడించాడు. సృష్టించే శక్తి తనకుతప్ప మరెవరికీ లేదన్న అహంకారంతో విర్రవీగినందుకు మన్నించమని కృష్ణయ్యను వేడుకున్నాడు.

దాంతో కృష్ణుడు తన మాయను తొలగించాడు. తన లీలా రూపాలన్నింటినీ ఉపసంహరించాడు.

బ్రహ్మ కృష్ణుడిపాదాల మీద సాగిలపడి 'జగత్పతీ! నేను అల్పుడ్ని. నీ మహిమ తెలుసుకోలేక అహంకారంతో ప్రవర్తించాను. నువ్వే సకల భూతాలకూ సాక్షివీ, సకల ప్రాణులకూ రక్షవీ అని తెలీక గర్వం కళ్ళకు కప్పటం వలన నిన్నేదో మాయ చేద్దామనుకున్నాను. నా తప్పు నాకు తెలిసింది. నన్ను మన్నించు. నువ్వు యోగీశ్వరుడవు. నీ యోగమాయతో నువ్వే రూపాన్నైనా, ఎన్ని రూపాలనైనా ధరించగలవు. ఏ లీలనైనా ప్రదర్శించగలవు. నిన్ను తెలుసు కోలేనంత వరకే ఎవరికైనా అహంకారం. తెలుసుకున్నాక మహదానందం' అని వినయంగా అన్నాడు.

కృష్ణుడు బ్రహ్మను మన్నించాడు.

# ధేనుకాసురుడు

బలరామకృష్ణులకు శ్రీదాముడూ, సుబలుడూ అనే ఇద్దరు స్నేహితులున్నారు. వాళ్ళు ఒక రోజున రామకృష్ణుల దగ్గరకు వెళ్ళి అక్కడికి కొద్దిదూరంలోనే తాళవనం వున్నదనీ, ఆ తోటలో పళ్ళు చాలా రుచిగా వుంటాయనీ చెప్పారు. వెంటనే బలరామకృష్ణులు స్నేహితుల్ని వెంటపెట్టుకుని తాళవనానికి వెళ్ళారు.

ఆ వనంలో ధేనుకుడు అనే ఒక రాక్షసుడు వున్నాడు. అతడు అమిత బలవంతుడు. గాడిద రూపంలో వుండేవాడు. తన బంధువులందరితోనూ ఆ రాక్షసుడు అక్కడ విహరిస్తూ వుండటంవల్ల సాధారణంగా ఆ వనంలోకి ఎవరూ వెళ్ళేవారు కాదు. పొరపాటున ఒకవేళ ఎవరయినా వెళ్తే మళ్ళీ వచ్చేవారు కాదు. ఆ వనంలోకి వెళ్ళినవాళ్ళను ధేనుకుడు, అతని సహచరులు సంహరించేవారు. శ్రీదాముడూ, సుబలుడూ ఆ సంగతి బలరామకృష్ణులకు ముందే హెచ్చరికగా చెప్పారు. అయినా రామకృష్ణులకు భయమేమిటి? స్నేహితులతో కలిసి ఆ వనంలోకి ప్రవేశించారు. లోపలికి వెళ్ళాక బలరాముడు తాటిచెట్లను తన బాహువులతోచుట్టి కదలించి పళ్ళన్నీ రాల్చాడు. ఆ చప్పుడు చెవుల పడగానే ధేనుకాసురుడు భీకరంగా అరుస్తూ గబగబ అక్కడికి వచ్చాడు. వస్తూనే బలరాముని రొమ్ముమీద ఒక తన్ను తన్నాడు. బలరాముడికి కోపం వచ్చింది. ధేనుకుని నాలుగు పాదాలూ కలిపి పట్టుకుని, ఎత్తి గిరగిరా తిప్పి, ఆ పక్కనే ఉన్న పెద్ద తాటిచెట్టుకేసి మోదాడు. దాంతో ఆ చెట్టు కూలిపోయింది.

అలా కూలుతూ ఆ వృక్షం పక్కనే మరో వృక్షంమీద పడింది. వెంటనే అది కూడా కూలింది. అది పడటంవల్ల దాని దగ్గరలో వున్న మరికొన్ని చెట్లు కూడా సమూలంగా నేలకూలాయి. అలా ఒకదాని వెంట మరొకటి ఫెళఫెళ శబ్దం చేస్తూ కింద పడటంతో ధేనుకుని బంధువులందరూ అక్కడికి పరుగు పరుగున వచ్చారు. వాళ్ళందర్నీ బలరామకృష్ణులు అవలీలగా సంహరించారు.

ఆవిధంగా తాళవనం అంతా చిందర వందరయి రాలిన తాటిపళ్ళన్నిటినీ ఏరి ఒక పెద్ద కుప్ప పోసి రామకృష్ణులు తమ స్నేహితులకు పంచి పెట్టారు. అప్పటినుంచి ఆ తాళవనం కూడా గోపబాలురకు ఆటస్థలమైంది.

ధేనుకుడు తొలి జన్మలో బలిదానవుని కుమారుడైన సాహసికుడు. అతను గంధమాదన పర్వతం మీద యధేచ్ఛగా తిరుగుతుండేవాడు. ఆ పర్వతం మీదనే ఒక గుహలో దుర్వాసమహర్షి తపస్సు చేసుకుంటుండేవాడు. సాహసికుని ఆటపాటలు మహర్షి ధ్యానానికి అంతరాయం కలిగిస్తుండేవి. అందుకని ఆయన ఆగ్రహించి 'నువ్వు గాడిదవై పుడతావు' అని సాహసికుడ్ని శపించాడు.

అలా శాపం పొందిన సాహసికుడు మధురానగర సమీపంలోని తాళవనంలో గార్దభ రూపంలో సంచరిస్తుండేవాడు. బలవంతుడు కావటం వలన ఆ తాళవనానికి అధిపతిగా వ్యవహరించేవాడు. కాలక్రమాన బలరామకృష్ణులతో పోరాడి వారి కరస్పర్శ ద్వారా శాపవిముక్తి పొందాడు.

ధేనుకాసురుడు మృతి చెందాక తాళవనంలోని పళ్ళారగిస్తూ 'మాకు తెలుసు మా కృష్ణయ్య మమ్మల్ని కాపాడతాడని....' అంటూ ఆనందంతో చప్పట్లు కొడ్తూ ఆ రాక్షసుడిని తామే చంపేసినట్టు గోపబాలురందరు సంబరపడిపోయారు.

# కాళియుడు

పూర్వం సౌభరి అనే ఒక మహర్షి ఉండేవాడు. ఆయన కొంత కాలం కాళిందీ నదిలో వుండి తపస్సు చేశాడు. ఆ సమయంలో ఒక రోజున పక్షీంద్రుడయిన గరుడుడు అక్కడకు వచ్చి ఆ నదిలో వున్న జలచరాన్ని ఒకదాన్ని ఒడిసి పట్టుకుని భక్షించాడు. అది ఆ నదిలోవున్న చేపలన్నిటికీ రాజు. తమకు రాజైన ఆ మీనం అలా మరణించడంవల్ల చేపలన్నీ దుఃఖపడ్డాయి. మత్స్యాల రోదన విని మహర్షి తన దివ్యదృష్టి ద్వారా అక్కడ జరిగిన ఘోర ఉదంతమంతా గ్రహించాడు. ఆ చేపలను చూసి జాలిపడ్డాడు. పక్షీంద్రుని ఉద్దేశించి 'ఇకమీదట నువ్వీ నదిలో అడుగుపెడితే నీ తల నూరు వ్రక్కలవుతుంది' అని శపించాడు.

సౌభరి అలా శపించిన విషయం పక్షీంద్రుడైన గరుడునికీ, సర్పరాజయిన కాళియునికీ మాత్రమే తెలుసు.

మొదట్లో గరుత్మంతుడు కనిపించిన పామునల్లా పట్టి వధిస్తుండేవాడు. ఆ బాధ భరించలేక పాములన్నీ కలిసి గరుడునితో ఒక ఒప్పందం చేసుకున్నాయి. ఆ ఒడంబడిక ప్రకారం సర్పజాతి నెలకో పామును గరుడునికి సమర్పించాలి. కాని నిలువెల్లా విషంతో మదించివున్న కాళియుడు మాత్రం ఆ ఒడంబడికను తోసిపుచ్చాడు. అది తెలిసి గరుడుడు ఒకసారి కాళియుడు వున్న

రమణకద్వీపానికి వెళ్ళి, ఆడినమాట తప్పటం అనుచితమనీ, అనవసరంగా పోరుకు దిగటం ఇరుపక్షాలకూ మంచిది కాదనీ కాళియుడికి చెప్పాడు. కాని సర్పరాజం గరుడుని మాటలు లెక్కచేయలేదు. లెక్కచేయక పోవటమే కాదు! అమితంగా అలిగి, హరివాహనమైన అతనిని తన క్రూరమైన కోరలతో కాటువేసి గాయపరిచాడు. గరుడునికి సర్పరాజు మీద అమితమైన కోపం వచ్చింది. వెంటనే తన ఎడమ రెక్కను విసనకర్రలా పెద్దది చేసి కాళియుడ్ని ఒక్క చరుపు చరిచాడు. ఆ దెబ్బకు కాళియుని కళ్ళు తిరిగాయి. విషం కక్కుకుని మూర్ఛపోయాడు. చేసిన పరాభవం చాలనుకుని గరుడుడు వెళ్ళిపోయాడు.

ఆ తరువాత కాళియుడు మెల్లగా తేరుకుని, లేచి, గరుడుని కంటపడటం కూడా అపాయమే అనుకుని, రమణకద్వీపం వదిలి, గరుడునకు ప్రవేశార్హత లేని కాళిందీనదిలో ప్రవేశించాడు. అప్పటినుంచి అక్కడే ఉండిపోయాడు. అలా వున్న సమయంలో ఒకసారి గోపబాలురకు దాహమై దప్పిక తీర్చుకునేందుకు నదికి వెళ్ళారు. ఆ నదిలో కాళియుడు వుండటంవల్ల నీరంతా కలుషితమయింది. ఆ నీటిని తాగటంవల్ల గోపబాలురందరూ మూర్ఛపోయారు. అది గ్రహించిన శ్రీకృష్ణుడు వెంటనే వారిని సమీపించి తన చల్లని చూపులను వారిమీద ప్రసరింపచేశాడు. వెంటనే వాళ్ళందరూ గాఢనిద్ర నుంచి లేచినట్లు లేచి వచ్చారు. వాళ్ళవెనకే గోవులు కూడా వచ్చాయి.

కాళియుడి ఉనికి వల్లనే ఆ నీరంతా విషపూరితమైందనీ, సర్పరాజును నదిలోంచి తొలగిస్తే కానీ నీరు తాగడానికి ఉపయోగపడదనీ శ్రీకృష్ణుడు భావించాడు. వెంటనే అక్కడికి సమీపంలోవున్న ఒక కదంబవృక్షమెక్కి అక్కడనుంచి ఒక్కసారిగా ఆ నదిలోకి దూకాడు. అలా దూకటం వలన ఆ మడుగులోని నీళ్ళన్నీ చెల్లాచెదురయ్యాయి. కాళియుడు ఉగ్రుడైనాడు. అది తన నివాసమని తెలియక ఎవరో మడుగులోకి ప్రవేశించి ఉంటారనుకున్నాడు. నీటిలోకి దూకిన వాళ్ళను చంపేందుకు విజృంభించాడు. చరచరా కృష్ణుడ్ని

సమీపించి అతని శరీరమంతా గాట్లుపడేటట్లు కరిచాడు. నల్లనయ్యను గట్టిగా చుట్టుకుని నలిపేసే ప్రయత్నం చేశాడు.

తమ కన్నయ్య నిస్సహాయంగా నలుగుతున్నట్లు కనిపించేసరికి గోపబాలురు హడలిపోయారు. పెద్దగా రోదించారు. గోవులు, గోవత్సలు కూడా పెద్దగా అరిచాయి.

వాళ్ళ ఆక్రందనలు విన్న కృష్ణయ్య తనకోసం వాళ్ళు విలపించటం సహించలేక, ఒక నిముషం అలా నిస్సహాయుడుగా వున్నట్టు వుండి మెల్లిగా ఒళ్ళు విరుచుకున్నాడు. దాంతో అంతవరకూ కృష్ణయ్యను గట్టిగా చుట్టుకుని వున్న కాళియుని పక్కటెముకలు పటపటలాడినాయి. అతని పడగలు కుంచించుకు పోయాయి. ముక్కురంధ్రాలనుంచి నెత్తురు వరదలై పారింది. నందనందనుడు అతడ్ని చెయ్యెత్తి చరిచాడు. ఆ దెబ్బ భరించలేక కాళియుడు పారిపోవడానికి ప్రయత్నించాడు. కాని కృష్ణయ్య అతనిని వదిలిపెట్టలేదు. కాళియుని తోక పట్టుకుని గిరగిరా తిప్పి వదిలాడు. అప్పటికే సగం చచ్చిన కాళియుడు చేయగలిగిందేమీలేక దీనంగా తల వంచుకుని నిలబడ్డాడు.

కృష్ణయ్య ఒక్కసారిగా పైకెగిరి, కాళియుని పడగమీదకు దూకి మనోహరంగా నృత్యం చెయ్యటం మొదలుపెట్టాడు. గోపబాలురు ఆ నాట్యం చూసి ఆనంద పరవశులయ్యారు.

కాళియుడు మనసులో 'ఇతను పరమ పురుషుడే కాని, మానవ మాత్రుడు మాత్రం కాదు' అని నిశ్చయించుకుని 'శ్రీకృష్ణా! నేను నీ దాసుడ్ని. మితిమీరిన గర్వంతో నీ పట్ల అపచారం చేశాను. నన్ను క్షమించు. నన్ను రక్షించు' అని శరణు కోరాడు.

కాళియుని భార్యలయిన నాగకాంతలు కూడా శ్రీకృష్ణుని వద్దకు వచ్చి తమ భర్త చేసిన అపరాధాలు మన్నించమని వేడుకున్నారు. తమకు పతిభిక్ష



పెట్టవలసిందిగా ప్రార్థించారు. తమ భర్త దుర్మార్గపు ప్రవర్తనను వదులు కుంటాడనీ, ఇకముందు ఎవరినీ హింసించడనీ వాళ్ళు నల్లనయ్యకు మాట ఇచ్చారు. అలా ప్రార్థించిన భుజంగసతులను కృష్ణయ్య కరుణించాడు. 'కాళిందిని విడిచి బయటకు పోయే పక్షంలో గరుడుడు బతకనివ్వడేమోనన్న భయం మీకు అక్కరలేదు. కాళియుడి శిరసుపైన నా పాద ముద్రలు పడ్డాయి. వాటిని గరుత్మంతుడు మన్నిస్తాడు. ఇకపై మీరు ఎక్కడ వున్నా గరుడుడు మిమ్మల్ని బాధించడు' అని వాళ్ళకు అభయం ఇచ్చాడు శ్రీకృష్ణుడు. కాళియుడు శిరస్సు వంచి నమస్కరించాడు. గోపాలదేవుడు మందహాసం చేశాడు. ఆ తరువాత కాళియుడు కాళిందిని వదిలి తిరిగి రమణ ద్వీపం చేరుకున్నాడు. అప్పటినుంచి కాళింది విషరహితమైంది. నీరు తాగేందుకు యోగ్యమైంది.

# వేదశిరుడు – అశ్వశిరుడు

సర్పరాజైన కాళియుడు పూర్వజన్మలో వేదశిరుడనే ఒక మునీశ్వరుడు. ఆయన తపస్సు చేసుకునేందుకు అనువైన స్థలం కోసం వెదికి చివరికి వింధ్య పర్వతానికి వెళ్ళాడు.

అదే ప్రాంతానికి అశ్వశిరుడనే మరో మహర్షి కూడా తపస్సు చేసుకునేందుకు వచ్చాడు. అశ్వశిరుడు ఒక రాజు. జైత్రయాతలు చేస్తుండేవాడు. యజ్ఞశాలకు ఒకసారి కపిలుడు, జైగీషవ్యుడు అనే మునులు వచ్చారు. వాళ్ళను సత్కరించి, విష్ణుమూర్తిని ఏ విధంగా ఆరాధిస్తే ప్రసన్నుడవుతాడో చెప్పమని అశ్వశిరుడు అడిగాడు. 'మేమే నరనారాయణులం. మమ్మల్ని కొలిస్తే చాలు, నీకు సర్వశుభాలూ చేకూరుతాయి' అని కపిలుడు, జైగీషవ్యుడు అన్నారు.

మహారాజుకు కోపం వచ్చింది.

'వీళ్ళకి ఇంత అహంకారమా? తమని తాము నరనారాయణులతో పోల్చుకుంటారా?' అని అనుకుని, కోపాన్ని నిగ్రహించుకుని 'విష్ణుమూర్తి నాకు తెలియకపోలేదు. ఆయన పక్షివాహనుడు. శంఖ, చక్రాలు గలవాడు. మీరెందుకు నాకు అసత్యం చెబుతున్నారో, ఆయనతో ఎందుకు పోల్చుకుంటున్నారో తెలియడం లేదు' అన్నాడు.

ఆ మాటలు వినగానే కపిలుడు విష్ణుమూర్తిగా మారిపోయాడు.

జైగీషవ్యుడు ఖగేంద్రుడయ్యాడు.

రాజుగారు అదీ నమ్మక 'ఇది మీ మాయా ప్రభావం. నిజంగా నువ్వు విష్ణువే అయితే నీ నాభిలో పద్మమేది? అందులో బ్రహ్మ ఏడి?' అని అడిగాడు.

వెంటనే కపిలుని నాభిలో కమలం వచ్చి చేరింది. జైగీషవ్యుడు బ్రహ్మ అయ్యాడు. 'ఇదీ మాయే' అన్నాడు అశ్వశిరుడు. అప్పుడు మునులు అంతర్ధానమయ్యారు. యాగశాల అంతా క్రూరమృగాలతో నిండిపోయింది. మహారాజు అది చూసి భయపడి మునులను ప్రార్థించాడు. వాళ్ళు ప్రత్యక్షమై మహారాజును దయతలచి మృగబాధను తొలగించి 'రాజా! భగవంతుడు ఎలా వశుడవుతాడని అడిగావు. భగవంతుడు సర్వవ్యాపి అని తెలుసుకో. సమస్త పదార్థాలలోనూ భగవంతుడు వుంటాడు. నీకా విషయం తెలిసేటట్టు చెయ్యడం కోసమే మేము ఇన్ని రూపాలు దాల్చాం' అని చెప్పారు.

వాళ్ళ బోధనలు విన్న అశ్వశిరుడు తన కుమారుడైన స్థూలశిరునకు రాజ్యం అప్పగించి తను తపోవనానికి తరలి వెళ్ళాడు. అక్కడ ఎన్నో ఏళ్ళు తపస్సుచేసిన తరువాత మరింత ప్రశాంతంగా వుండే స్థలం కోసం వెదుక్కుంటూ వింధ్యపర్వతం చేరుకున్నాడు. వేదశిరుడు ఆయనను చూసి 'నువ్వీ ప్రాంతంలో వుండటానికి వీలులేదు. మరోచోటుకి పోయి తీరాలి' అని గర్జించాడు.

వేదశిరుని గర్జన అశ్వశిరునికి ఆశ్చర్యం కలిగించింది. 'ఎందరో మునులు ఇంతకు పూర్వం ఇక్కడ తపస్సు చేసుకున్నారు. ఈ స్థలం మీద ఎవ్వరికీ అధికారం లేదు. నేనిక్కడ నుంచి కదిలేదిలేదు' అని ఖచ్చితంగా చెప్పాడు. వేదశిరుడు మండిపడ్డాడు. అశ్వశిరుడ్ని పరిపరివిధాలా తూలనాడాడు. అనవసరంగా తనను నిందించినందుకూ, తనమీద బుసలు కొట్టినందుకూ 'నువ్వు సర్పమై పుడ్తావు' అని వేదశిరుడ్ని అశ్వశిరుడు శపించాడు.

వేదశిరుడు అశ్వశిరుడ్ని వట్టి వాచాలునిగా భావించి, తన మాటను మన్నించకుండా తనను కారుకూతలు కూసినందుకు 'నువ్వు పక్షివై పుడతావు'

అని అశ్వశిరునికి ప్రతిశాపం ఇచ్చాడు.

వేదశిరుడు, అశ్వశిరుడు ఇద్దరూ మహర్షులే. వారిద్దరి ఆశయం శ్రీహరిని ఆరాధించడమే. కాని, వారు కోపాన్ని మాత్రం వదులుకోలేకపోయారు. అది గ్రహించిన విష్ణుమూర్తి వారిని సమీపించి మునులకు ఆగ్రహం పనికిరాదని బోధించి, సర్పమైన వేదశిరుడ్నీ, పక్షిగా మారిన అశ్వశిరుడ్నీ తనపక్కనే వుంచుకుంటానని వాగ్దానం చేసి వారి బాధను కొంత ఉపశమింపజేశాడు. ఆ తరువాత వేదశిరుడు కాళియుడైనాడు. అశ్వశిరుడు గరుడుడైనాడు. వారిద్దరికీ శ్రీకృష్ణుని అనుగ్రహం పరిపూర్ణంగా లభించింది.

శ్రీకృష్ణుడు కాళియుని గర్వాన్ని హరించిననాటిరాత్రి నందాదులు యమునా తీరంలోనే వుండిపోయారు. అర్ధరాత్రి సమయాన ఆ పరిసరాణ్యమంతటా దావానలం అలుముకుంది. అది అంతకంతకు దగ్గరవటం చూసి భయపడ్డ గోపకులూ, గోపికలూ కన్నయ్యను ప్రార్థించారు. సర్వ లోకేశ్వరుడైన శ్రీకృష్ణుడు తనవారిని కరుణించి వారిని సమీపిస్తున్న ఘోర దావానలాన్ని పుక్కిట పట్టాడు. గో గోప గణాల్ని రక్షించాడు.

# ప్రలంబుడు

**కం**సుని భృత్యుడయిన ప్రలంబుడు శ్రీకృష్ణుని అపహరించుకుపోవాలని ఒకసారి బృందావనానికి వచ్చాడు. ఆ ప్రాంతంలో ఒక గోపబాలుని రూపంలో సంచరించసాగాడు. కృష్ణయ్య అది పసిగట్టి, ఏమీ తెలియని వాడిలాగా ప్రలంబుడ్ని కూడా 'మాతో ఆడుకుందువుగాని రమ్మ'ని ఆటలకు పిలిచాడు.

శ్రీకృష్ణుడి మాయోపాయాలను గురించి విని వున్నాడు కాబట్టి ప్రలంబుడు శ్రీకృష్ణునితో ఆటలాడేందుకు కొంచెం సంకోచించాడు. కాని సంకోచించినట్టు కనిపిస్తే వాళ్ళకు అనుమానం వస్తుందని ఆటకు ఒప్పుకున్నాడు.

మాధవుడు చిత్రమైన ఆటను సృష్టించాడు. గోపబాలురను రెండు సమ ఉజ్జీలుగా విభజించాడు. ఒక జట్టును తను తీసుకున్నాడు. మరొక జట్టును బలరాముడికి అప్పచెప్పాడు. శ్రీదాముడు, వృషభుడు మొదలైన వారు బలరాముడి జట్టులోకి వెళ్ళారు. భద్రసేనుడు, ప్రలంబుడు మొదలైన వారు గోవిందుని పక్షానికి వచ్చారు.

ఇరుపక్షాల వారికి దూరంగా వున్న కొన్ని చెట్లను చూపించి 'వాటిలోంచి ఎంచుకున్న చెట్టుకు మాత్రమే తగిలేటట్టుగా రాయి విసరాలి. ఒకవేళ తగలకపోతే ఓడిపోయినవారు గెలిచినవారిని భుజాలమీద ఎక్కించుకుని ఊరంతా తిరగాలి, సరేనా' అన్నాడు కృష్ణుడు.

అందుకు అందరూ అంగీకరించారు.

ఆట మొదలయింది.



ఆ ఆటలో కృష్ణయ్య జట్టు కావాలనే ఓడిపోయింది. ఒప్పందం ప్రకారం గెలిచిన బలరాముడి జట్టువారిని శ్రీకృష్ణుని పక్షాన వున్నవారు భుజాల మీద మోసుకు పోవాలి. శ్రీదాముడ్ని శ్రీకృష్ణుడు తన భుజాలమీద ఎక్కించుకున్నాడు. ప్రలంబుడు బలరాముడ్ని ఎత్తుకున్నాడు. భద్రసేనుడు వృషభుడ్ని మోశాడు. అలా తన భుజాలమీద కూర్చున్న బలరాముడ్ని ప్రలంబుడు అపహరించుకు పోవాలనుకున్నాడు. పరుగుతీశాడు. అది బలభద్రుడు గ్రహించాడు. క్షణంలో పర్వతం మాదిరి బలరాముడు బరువెక్కాడు. ప్రలంబుడు ఆ బరువును మోయటానికి మామూలుబలం చాలదనుకుని రాక్షసబలం తెచ్చుకుని ఆకాశానికి ఎగిరాడు. ప్రలంబుని మోసం గ్రహించిన బలరాముడు అతడ్ని పిడికిళ్ళతో మోదసాగాడు. ఆ ముష్టిఘాతాలకు తట్టుకోలేక ప్రలంబుడు నెత్తురు కక్కుకుని చనిపోయాడు. అంతలో ఒకజ్యోతి అతనినుంచి బయటకు వచ్చి బలరాముడిలో కలసిపోయింది.

ప్రలంబుడు 'హూహూ' అనే గంధర్వుని కుమారుడు. పేరు విజయుడు.

విజయుడు శ్రీహరి భక్తుడు. అనుదినం శ్రీమన్నారాయణుని స్మరిస్తూ నగరసంచారం చేసేవాడు. అలా తిరుగుతూ ఒకసారి కుబేరుని ఉద్యానవనానికి వెళ్ళాడు. ఆ తోటలోని పూలను కుబేరుడు శివపూజకోసం ఉపయోగించేవాడు. అది తెలియక విజయుడు ఆ పుష్పాల్ని శ్రీహరి పూజకోసం కోసాడు. కుబేరుడికి కోపం వచ్చింది. 'పూలను తస్కరించిన వాడు రాక్షసుడై పుడతాడు' అని శపించాడు.

విజయుడు కుబేరుని సమీపించి ఆయన పాదాలమీదపడి తన తప్పిదాన్ని మన్నించమని వేడుకున్నాడు. శాంతించిన ధనపతి 'నాయనా! నా శాపం తిరుగులేనిది. ద్వాపరయుగాంతాన బలరాముని చేతిలో నీకు శాపవిముక్తి కలుగుతుంది' అని కుబేరుడు అభయమిచ్చాడు.

ఆ విజయుడే ప్రలంబుడై పుట్టి బలరామునిచేత పిడిగుద్దులు తిని మృత్యువాతపడి ఆ తరువాత పరమపదం పొందాడు.

# మహేంద్ర గర్వభంగం

ఒకసారి నందుడూ ఆయన మిత్రులూ ఇంద్రయాగం తలపెట్టారు. కృష్ణయ్యకు ఆ సంగతి తెలిసి తండ్రి దగ్గరకు వెళ్ళి 'నాయనా! ఈ యాగానికి పెద్ద ఎవరు? ఆయనను మెప్పించడం వలన మనకు కలిగే ప్రయోజనమేమిటి? అసలీ యాగం చెయ్యాలని ఎవరు చెప్పారు?' అని ఏమీ తెలియనట్టు అడిగాడు.

'కృష్ణా! ఈ యాగానికి మహేంద్రుడు అధిపతి. ఆయనను పూజిస్తే వర్షాలు పుష్కలంగా కురుస్తాయి. వర్షాల వల్ల భూమినిండా పచ్చిక పెరుగుతుంది. పచ్చిక తిని పశువులు వర్ధిల్లుతాయి. పశువులపాడి ద్వారా మనమూ, దేవతలూ కూడా సంతుష్టితో బతుకుతాం' అని నందుడు చెప్పాడు.

శ్రీకృష్ణుడికి ఆ సంగతి తెలియక కాదు. అయినా, మహేంద్రుడు మితిమీరిన గర్వంతో విర్రవీగుతున్నందువల్ల అతని గర్వాన్ని అణచటం అవసరమని గోపాలకృష్ణుడు భావించాడు. అందుకని ఏ విధంగానైనా సరే ఇంద్రోత్సవం జరగకుండా అడ్డుపడాలనుకున్నాడు.

'ఇంద్రుడు భగవంతుడేం కాదు. సృష్టి క్రమంలో జరిగే ఒక పనిని ఆయన నిర్వహిస్తాడు. అంటే సూర్యుడు ఉదయించటం, చంద్రుడు చల్లగా వుండటం, వానా వరదా రావడం – అన్నీ ప్రకృతి ధర్మాలు. ప్రపంచంలో కర్మకు లోబడని ప్రాణి అంటూ ఏదీ లేదు. ప్రతి ప్రాణీ కర్మ కారణంగానే జీవించటం, వృద్ధి

పొందటం, నశించటం జరుగుతోంది. మనం అనుభవించే కష్టసుఖాలూ, ఆనంద విషాదాలూ అన్నీ కర్మననుసరించే. ఒకరి దయతోనూ, అనుగ్రహంతోనూ ప్రకృతి బతకడం లేదు. మేఘాలు వర్షించడానికీ ఇంద్రుడికీ సంబంధం లేదు. ఆ గోవర్ధనగిరి, ఈ పాడినిచ్చే పశువులు, పంటనిచ్చే నేలతల్లి, గలగలపారే యమునానది – ఇవి మన ప్రత్యక్ష దైవాలు. వీటిని పూజించండి. మనకు ఉపకారి అని భ్రమపడి ఆ ఇంద్రుడ్ని నెత్తిన పెట్టుకోవడం అజ్ఞానం' అన్నాడు. కృష్ణయ్య అలా చెప్పేసరికి గోపకులందరూ మహేంద్ర పూజ విరమించి గోవర్ధనగిరినీ, గోవులనీ పూజించారు. నదీమతల్లిని కొలిచారు. నేలతల్లిని అర్చించారు. ఇంద్రుడికీ సంగతి తెలిసింది. తన పూజను నివారించిన కృష్ణునిపట్లా, అతని ఆదేశానుసారం వ్యవహరించిన యాదవుల పట్లా ఆయన ఆగ్రహించాడు. ఇంద్రుడు కళ్ళెర్ర చేయగానే మేఘాలు బృందావనంవైపు కదిలి వెళ్ళాయి. ఉన్నట్టుండి పెద్ద పెద్ద పిడుగులు పడ్డాయి. చూస్తుండగానే పెనుగాలి చెలరేగింది. ఉరుములు మెరుపులతో కుంభవృష్టిగా వర్షం కురిసింది. ఆ వర్షానికి బృందావనవాసులంతా కలవరపడ్డారు. ఆ సమయంలో తమను రక్షింపగలవాడు నల్లనయ్య ఒక్కడే అనుకుని యాదవులందరూ ఆయనను ప్రార్థించారు. శ్రీకృష్ణుడు వారికి అభయమిచ్చి గోవర్ధనగిరి దగ్గరకు వెళ్ళి గిరిని కదిలిరమ్మని ఆదేశించాడు. పర్వతం కదిలి పైకి లేచింది. నల్లనయ్య దానిని తన చిటికెన వేలిపై నిలిపాడు. యాదవులందరూ ఆలమందలతో, పిల్లా పాపలతో ఆ కొండ కిందకు వచ్చి తలదాచుకున్నారు. కాని, వాళ్ళకు అదంతా చిత్రంగా తోచింది. కలో నిజమో తెలియడం లేదు, దిగ్భ్రాంతులై చూస్తున్నారు. 'పర్వతం విరిగి మీనెత్తిమీద పడదు. భయపడకండి. అందరూ ఈ కొండకిందే వుండండి' అని కృష్ణుడు వాళ్ళకు ధైర్యం చెప్పాడు.

ఆ విధంగా ఏడు రోజులు గడిచాయి. ఆ ఏడు రోజులూ ప్రళయ వర్షం కురుస్తూనే వుంది. అయినా కృష్ణయ్య ఒక్క అడుగైనా కదలలేదు. కృష్ణయ్య చిటికెన వేలున వున్న గోవర్ధనగిరీ చెక్కుచెదరలేదు.

ఇంద్రుడు ఆశ్చర్యపోయాడు. అప్పటికే నింగినున్న వర్షమంతా నేల చేరింది. చేసేదిలేక మేఘాలను మరలించుకుపోయాడు.

వర్షం ఆగింది.

చీకటి పోయి వెలుగు వచ్చింది.

గోకులమంతా కొండగొడుగు కిందినుంచి ఇవతలకు వచ్చింది. కృష్ణయ్య గోవర్ధనగిరిని యధాస్థానంలో వుంచాడు.

వెలుగొచ్చిందనీ, ఎండొచ్చిందనీ యాదవులందరూ సంబరపడ్డారు. కృష్ణయ్య నవ్వి 'వర్షం కురవడం ప్రకృతి ధర్మమెలాగో, ఎండ రావడమూ అంతే' అన్నాడు.

ఇంతలో ఇంద్రుడు ఐరావతమెక్కి వచ్చాడు. వస్తూనే కృష్ణుడికి పాదాభి వందనం చేశాడు. 'కృష్ణా! ప్రపంచానికంతటికీ నువ్వే అధిపతివి. నీ శక్తిని గ్రహించక నా ఇంద్రపదవినీ, అధికారాన్నీ, ఐశ్వర్యాన్నీ చూసుకుని మదోన్మత్తుడనై ప్రవర్తించాను. నాకు తగిన శాస్తి చేశావు. నన్ను శిక్షించడం వల్ల నాలాంటి అహంకారులు తప్పుతెలుసుకుని సన్మార్గంలో నడిచేందుకు వీలు కలిగింది' అన్నాడు.

కృష్ణుడు సంతోషించి మహేంద్రుడ్ని మన్నించాడు. దేవతలు కృష్ణుడిమీద పూలవాన కురిపించారు.

# గోవర్ధనగిరి

**గో**వర్ధనగిరి ద్రోణాచలానికి పుత్రుడని చెపుతారు. ఆ రెండూ శాల్మనీ ద్వీపంలో ఉండేవి. పరమ పవిత్రమైనవి.

పూర్వం వారణాసిలో పులస్త్యుడనే మహర్షి వుండేవాడు. ఒకసారి ఆ మహర్షి తీర్థయాత్రలకని బయలుదేరి అనేక పుణ్యస్థలాలను సందర్శించాడు. ఆయన ఎక్కడకు వెళ్ళినా అక్కడి ప్రజలు ఆయనకు గోవర్ధనగిరి మాహాత్మ్యాన్ని గురించి చెబుతుండేవారు. దాంతో ఆయనకు ఆ కొండను చూడాలన్న కోరిక కలిగింది. వెంటనే అక్కడికి ప్రయాణమయ్యాడు. ఎత్తైన ఆ కొండను చూడగానే పులస్త్యునికి అమితానందం కలిగింది. ఆ గోవర్ధనగిరి శాల్మనీ ద్వీపంలో వుండడం కన్నా వారణాసిలో విశ్వేశ్వర సన్నిధానంలో వుండటం ఉచితంగా వుంటుందనుకుని తనతోపాటు వారణాసికి రావలసిందిగా గోవర్ధనగిరిని ప్రార్థించాడు. గోవర్ధన గిరీంద్రుడు అందుకు అంగీకరించాడు. కాని ఆయనకు అక్కడ నుంచి ఎలా



కదలి వెళ్ళాలో, ఎటుగా వెళ్ళాలో తోచలేదు. అది గ్రహించిన పులస్త్యుడు 'నువ్వు నా అరచేతిలో కూర్చుంటే నేను నిన్ను భద్రంగా వారణాసి చేరుస్తాను' అన్నాడు.

గోవర్ధనుడు సరేనన్నాడు.

ఆయన అరచేతిలో ఎక్కి కూర్చున్నాడు.

తనను తీసుకుని బయలుదేరబోతున్న తాపసితో గోవర్ధనుడు 'మహర్షి! నన్ను మార్గమధ్యంలో ఎక్కడబడితే అక్కడ దించుతానంటే కుదరదు. ఎక్కడ దించితే అక్కడే కదలకుండా వుండిపోతాను. ఆపై మీ ఇష్టం' అని హెచ్చరించాడు.

పులస్త్యుడు సరేనని నవ్వుకుంటూ బయలుదేరాడు. గోకులందాకా బాగానే సాగింది నడక. అక్కడికి చేరాక మౌనికి కొద్దిగా అలసటగా అనిపించింది. నడచి నడచి డస్సి వున్నాడు కదా! కాసేపు విశ్రాంతి తీసుకోవాలనుకున్నాడు.

గిరీంద్రుడు పెట్టిన షరతు మరచిపోయాడు. ఆయనను అక్కడ దించి యమునా నదిలో స్నానం చేసేందుకు వెళ్ళాడు. స్నానం చేసి బడలిక తీర్చుకున్నాక 'ఇక బయలుదేరుదాం పద' అన్నాడు గోవర్ధనుడితో.

గోవర్ధనుడు మందహాసం చేశాడు. 'మహర్షీ! మీకు ముందే చెప్పాను. మార్గమధ్యంలో నన్నెక్కడ దింపితే అక్కడ వుండిపోతానని. నా నియమాన్ని మీరు విస్మరించారు. నేను మాత్రం ఇక్కడ నుంచి కదిలేది లేదు' అన్నాడు.

గోవర్ధనగిరీంద్రుడ్ని విశ్వేశ్వర సన్నిధానంలో వుంచాలన్న తన కోరిక నెరవేరనందుకు పులస్త్యునికి బాధ కలిగింది. చేసేదిలేక కొండను అక్కడే వదిలి తను కాశీకి వెళ్ళాడు. ఆ గోవర్ధనగిరినే శ్రీకృష్ణుడు చిటికెన వేలిమీద ఎత్తి ఏడురోజుల పాటు నిలిపింది!

అలా గోవర్ధనగిరి గోకులం చేరింది.

# సుదర్శనుడు

ఒకసారి నందాదులు అంబికావనంలో వున్నప్పుడు ఒక పెద్ద పాము నందుని కరిచి అతడ్ని మింగబోయింది. అది చూచి గోపికలు పెద్ద పెట్టున హాహాకారాలు చేశారు. నందుడు కూడా భయంతో 'కృష్ణా! కృష్ణా' అని ఆక్రందన చేశాడు. ఆ ఆక్రందన విన్న నందనందనుడు పరుగు పరుగున వచ్చి తండ్రిని పట్టి పీడిస్తున్న పాముమీదికి పదునయిన ఆయుధాలు విసిరాడు. కాని అది నందుడ్ని వదిలి పెట్టలేదు. కృష్ణయ్య అది గ్రహించాడు. ఆ మహా నాగం మీద ఆయనకు అమితంగా కోపం వచ్చింది. చరచరా దాని దగ్గరికి వెళ్ళి తన వామపాదంతో ఒక్క తన్ను తన్నాడు. శ్రీకృష్ణుని పాదస్పర్శవల్ల ఆ పాము తన రూపాన్ని వదిలి గంధర్వరూపం ధరించింది. గంధర్వుడు శ్రీకృష్ణుడికి పాదాభివందనం చేశాడు. అది చూసిన గోపాలులందరూ ఆశ్చర్యపోయారు.

'స్వామీ! నేను సుదర్శనుడనే ఒక విద్యాధరుణ్ని. విద్యాధర వంశంలో పుట్టిన నాకు వినయ విధేయతలు లేకపోయాయి. నా ఐశ్వర్యం, నా అందచందాలు, నా భోగభాగ్యాలు నాకు అణకువ నేర్పకపోగా అమితమయిన గర్వాన్ని కలిగించాయి. ఆ గర్వంతో నాకు పెద్దా చిన్నా తారతమ్యం తెలియ లేదు.

ఒకసారి నేను ఆకాశంలో విహరిస్తూ ఒకచోట అంగిరసులయిన ఋషులను చూశాను. వికృతంగా వున్న వారిపట్ల సానుభూతి కనబరచడానికి బదులు నేను వారిని అసహ్యించుకున్నాను. నానా దుర్భాషలాడాను. వారిని చూసి

విరగబడి నవ్వాను. నేను అలా అనుచితంగా ప్రవర్తించినందుకు అంగిరసులు ఆగ్రహించారు. ఆ వెంటనే వారు 'ఏ రూపమూ సంపదా వల్ల నువ్వు మమ్మల్ని చిన్నచూపు చూసి చీదరించావో అవన్నీ హరించుకుపోయి నువ్వు ఒక పాముగా మారతావు' అని శపించారు.

'అప్పటికి తెలిసింది నాకు – మహర్షులపట్ల ఎంత అమర్యాదకరంగా ప్రవర్తించానో! నా అనుచిత ప్రవర్తనకు సిగ్గుపడి పశ్చాత్తాపంతో క్షమించమని వాళ్ళను వేడుకున్నాను. మహర్షుల శాపానికి తిరుగులేదని తెలిసింది. వారి పాదాలమీద పడి శాపవిమోచనమెప్పుడో తెలుపవలసిందిగా అనేక రకాలుగా ప్రార్థించాను.

అంగిరసులకు నామీద జాలి కలిగింది. 'యదుకులంలో జనార్దనుడు ఉదయిస్తాడు. ఆయన పాదస్పర్శ తగిలి నీ పన్నగరూపం పోయి తిరిగి నీకు గంధర్వ రూపం లభిస్తుంది' అని చెప్పారు.

'తండ్రీ! నువ్వు భక్తుల భయాన్ని పారద్రోలడానికి గోపాలుడవై జన్మించావట. నిన్ను స్మరించినంతనే, నీ నామాన్ని ఉచ్చరించినంతనే పాపాలు హరించి పోతాయట. అలాంటిది నీ చరణారవింద స్పర్శ లభించిన నాకు శాప విమోచనం కలగడంలో వింతేముంది!' అని వినయంగా అన్నాడు. శ్రీహరి చిద్విలాసంగా నవ్వాడు. స్వామికి ప్రదక్షిణ చేసి సెలవు తీసుకొని తీసుకుని విద్యాధరుడు వెళ్ళిపోయాడు. ఆ తరువాత అందరూ శ్రీకృష్ణ సంకీర్తనం చేశారు.

ఒకసారి శ్రీకృష్ణుడు గోపికలతో యథేచ్ఛగా విహరిస్తున్నప్పుడు కుబేర భటుడయిన శంఖచూడుడు చూశాడు. నల్లనయ్య చుట్టూరా వున్న గోపికలను అపహరించుకుపోవాలనుకుని వాళ్ళని సమీపించాడు.

శంఖచూడుడికి పెద్దపులివంటి ముఖం వుంది. తాటి చెట్టంత పొడగరి. చూడడానికి చాలా భయంకరంగా వుంటాడు. అతడ్ని చూడగానే గోపికలు భయంతో తలో దిక్కుకూ పారిపోయారు. పారిపోతున్న గోపికలను

శంఖచూడుడు వెంటాడాడు.

గోపికల ఆర్తనాదం శ్రీకృష్ణునికి వినపడింది. వెంటనే ఆయన శంఖచూడుడి మీదికి ఉరికాడు. శ్రీకృష్ణుడు తనమీదికి లంఘించి వస్తున్నాడని తెలిసి ప్రాణభీతితో శంఖచూడుడు పారిపోయాడు. అయినా శ్రీకృష్ణుడు అతన్ని వదిలిపెట్టలేదు.

శ్రీకృష్ణ, శంఖచూడుల మధ్య ఘోరమైన ద్వంద్వ యుద్ధం జరిగింది. ఆ పోరులో శంఖచూడుడు మరణించాడు.

అలా మృతి చెందిన శంఖచూడునిలోంచి ఒక దివ్యజ్యోతి బయటికి వచ్చి శ్రీకృష్ణునికి మిత్రుడయిన శ్రీదామునిలో లీనమైంది.

# వృష భాసురుడు –వ్యోమాసురుడు

ఒకసారి పెద్ద ఎద్దు ఒకటి ఆలమంద మీదపడి కుమ్మి భీభత్సం చేసింది. దానికి గోవర్ధనగిరికి మల్లే పెద్ద మూపురం వుంది. అది రంకె వేస్తే మూడు ఆమడల దూరం వినబడుతుంది. ఆ అరుపుకి చెవులు చిల్లులు పడాల్సిందే. అది కొమ్ముతో ఎదిరించి చిమ్మితే నేల, ఆకాశం రెండూ పెళ్ళగిల్లవలసిందే! అంత భయంకరంగా వుంది ఆ వృషభం. దాన్ని చూసి యాదవులందరూ ఇళ్ళూ, వాకిళ్ళూ వదిలిపెట్టి ప్రాణభీతితో పరుగెత్తారు.

'కృష్ణా! కృష్ణా!' రక్షించు, అని ఆక్రందించారు.

కన్నయ్య అది విన్నాడు.

పరిస్థితి అర్ధమైంది.

తన మందిలో ప్రవేశించి తనవారిని అలా కలవరపరుస్తున్నది వృషభం కానే కాదనీ, అరిష్టుడనే రాక్షసుడనీ కృష్ణుడు గ్రహించాడు. భయపడవద్దని తనవాళ్ళందరికీ అభయమిచ్చాడు. కోపంతో వృషభం మీదికి ఉరికాడు. తన మీదికి రోషంగా లంఘించి వస్తున్న కృష్ణయ్యను చూసి వృషభం పెద్దగా రంకె వేసింది. ముందు పాదాలతో నేలను గీటింది. తోకను విదిలించి వలయాకారంగా గాలిలో తిప్పింది. కళ్ళతో నిప్పులు కక్కింది. అంతెత్తున ఎగిరి కన్నయ్యతో తలపడింది. అచ్యుతునికి వృషభానికి మధ్య చాలా రోజులు యుద్ధం జరిగింది.

చివరికి శ్రీహరి ఆ ఎద్దు కొమ్ములు విరిచిపట్టి దాని మెడ విరిచాడు. ఒక కొమ్మును పీకి దాంతోనే ఆ ఎద్దు డొక్కలో పొడిచి నేలకూల్చాడు.

అలా కూలిపోయిన వృషభం ఆ వెంటనే భూసురుడి రూపం ధరించి కృష్ణయ్యకు వినయంగా నమస్కరించాడు. 'స్వామీ! నేను పూర్వం వరతంతుడనే విప్రుడ్ని. నాకు విద్యాగురువు బృహస్పతి. నేను ఆయన దగ్గర విద్యాభ్యాసం చేసే రోజుల్లో ఒకసారి అజ్ఞానంతో ఆయన మాటలను అలక్ష్యం చేశాను. ఆది మా ఆచార్యునకు ఆగ్రహం కలిగించింది. నన్ను 'ఎద్దువు కావలసింది' అని ఆయన శపించాడు. తపోవిదుల మాటలకు, జ్ఞానవృద్ధుల వాక్కులకు తిరుగుంటుంది కనుకనా! నేను వృషభరూపం ధరించి చరించసాగాను. అప్పుడే నాకు రాక్షసులతో స్నేహం ఏర్పడింది. ఆ కారణంగా నేను కూడా రాక్షసుడినయ్యాను. నీ దయవల్ల, నీ కరస్పర్శవల్ల ఈనాడు నాకు శాపవిమోచనం కలిగింది. నాకు ధన్యత్వం చేకూరింది. నా అజ్ఞానం తొలగిపోయింది. నా అహంకారం నశించిపోయింది. నాకు మోక్షాన్ని ప్రసాదించు' అని ఆ బ్రాహ్మణ కుమారుడు తన గత చరిత్రను వివరించి, కృష్ణయ్యను వేడుకుని స్వామి కరుణకు పాత్రుడై దివ్య విమానాన్ని అధిరోహించి దివ్యతేజంతో దేవలోకానికి తరలిపోయాడు.

ఒకసారి శ్రీకృష్ణుడూ కొందరు గొల్లపిల్లలూ పశువులను మేపుకునేందుకు ఒక కొండ పక్కకి వెళ్లారు. అంతలో మాయాసురుని కుమారుడూ, మహామాయావీ అయిన వ్యోముడు గొల్లపిల్లవాడి రూపం ధరించి కృష్ణయ్య స్నేహితుల్లో చాలామందిని కపటోపాయంతో ఒక గుహ వద్దకు తీసుకుపోయి వాళ్ళని అందులోకి పొమ్మన్నాడు. వాళ్ళు ముందు వెనుకలు ఆలోచించకుండా లోపలికి వెళ్ళారు. అలా వెళ్ళిన యాదవులు మళ్ళీబయటకు రాకుండా ఒక పెద్దబండరాయిని వ్యోముడు గుహ ద్వారానికి అడ్డంగా పెట్టాడు.

ఇదంతా లీలామానుషమూర్తి కృష్ణుడు గ్రహించాడు. వెంటనే వ్యోముడ్ని పట్టుకున్నాడు. తన మాయాజాలంతో వ్యోముడు ఒక పర్వతం మాదిరి శరీరాన్ని పెంచుకున్నాడు. కృష్ణయ్యకూ, వ్యోముడికీ మధ్య పెద్ద యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో కృష్ణయ్య వ్యోముడ్ని చిత్రవధ చేశాడు. ఆ తరువాత శ్రీకృష్ణుడు గుహ ముఖానవున్న రాయిని తొలగించి లోపల వున్న తన స్నేహితులందర్నీ బయటకు తీసుకువచ్చాడు.

శ్రీకృష్ణుని చేతిలో ఆ విధంగా హతమై ముక్తిని పొందిన వ్యోముడు పూర్వం భీమరథుడనే రాజు. ఆయన హరిభక్తుడు. వారణాసిలో నివసిస్తూ వుండేవాడు. భీమరథుడు చాలాకాలం జనరంజకంగా రాజ్యపాలన చేశాడు. ఆ తరువాత కొడుక్కి రాజ్యం అప్పగించి, మలయాచలానికి వెళ్ళి తపస్సు చేసుకోసాగాడు.

ఆ సమయంలో పులస్త్యుడు అనే మహర్షి తన శిష్యులతో అక్కడికి వెళ్ళాడు. అది తెలిసి కూడా భీమరథుడు ఆయన్ని సందర్శించలేదు. సత్కరించలేదు. పులస్త్యుడికి కోపం వచ్చింది. 'నువ్వు రాక్షసుడవు కావలసింది' అని శపించాడు. అలా శాపం పొందిన భీమరథుడు పులస్త్యమహర్షి పాదాలమీద పడి తన తప్పిదాన్ని క్షమించవల్సిందిగా ప్రార్థించాడు. ద్వాపరాంతాన శ్రీహరి ద్వారా శాప విముక్తి కలిగేటట్టు మహర్షి అనుగ్రహించాడు. అలా శప్తుడైన భీమరథుడు మాయాసురుని పుత్రుడుగా పుట్టి మాధవుని చేతిలో మరణించి శాపవిముక్తి పొంది ఆయనలో లీనమయ్యాడు.

# అక్రూరుడు

నారదమహర్షి ఒకసారి మధురాపురానికి వెళ్ళి కంసుడ్ని కలుసుకున్నాడు. కలుసుకుని కుశలమడిగి వచ్చాడా! లేదు; శ్రీకృష్ణుడు సాక్షాత్తూ నీ మేనల్లుడనీ, దేవకీదేవికి పుట్టాడనీ, మాయాదేవిని కన్నది యశోదనీ, బలరాముడు మొదట దేవకి గర్భస్థుడై ఆ తరువాత రోహిణీ సుతుడైనాడనీ కంసుడితో చెప్పాడు. దాంతో కంసుడు కలవరపడ్డాడు. మనసులో భీతి చెలరేగింది. 'రాజా! ప్రస్తుతం బృందావనంలో వున్న బలరామకృష్ణులు మానవమాత్రులు కారు, దానవాంతకులు. వారే ఇంతకు ముందు పూతననూ, శకటాసురుడ్నీ, తృణావర్తుడ్నీ, ప్రలంబుడ్నీ సంహరించారు' అని కూడా చెప్పాడు నారదుడు.

కంసుడు ఉలిక్కిపడ్డాడు.

గుండెలు దడదడ కొట్టుకున్నాయి.

కాసేపు మాట్లాడలేకపోయాడు.

తరువాత ధైర్యం కూడదీసుకుని దేవకీవసుదేవులను సంహరించడానికి ఉద్యుక్తుడైనాడు.

తోడబుట్టిన చెల్లెలిని చంపడం పాపమని నచ్చచెప్పి కంసుడ్ని నారదమహర్షి కొంతవరకు శాంతింపజేశాడు. కానీ, కంసుడు కోపం తట్టుకోలేక దేవకీ వసుదేవులకు మళ్ళీ సంకెళ్ళు వేయించాడు. ఆ తరువాత తన ఆలోచనలు

విరించిపుత్రుడికి చెప్పుకున్నాడు.

'మహర్షీ! మీరు చెప్పినదాన్ని బట్టి దేవకీదేవి అష్టమ గర్భఫలం ఇంతవరకూ మేమనుకున్నట్టు ఆడపిల్ల కాదనీ, దేవకి ప్రసవించిన నల్లనివాడు నందుని ఇంట పెరుగుతున్నాడనీ తెలిసిపోయింది. దేవేంద్రాదులు సైతం ఎవరితో పోరాడటానికి భయపడతారో అటువంటి నన్నే ఎదిరించడానికి ఆ అర్భకుడు ఉబలాటపడుతున్నాడట. నా శక్తిసామర్థ్యాలతో పాటు నాతో తనకు గల బాంధవ్యాన్ని కూడా ఆ డింభకుడు ఎరిగే ఉండాలి. అటువంటిది మేనమామనన్న అభిమానమైనా లేకుండా 'కంసుని వధించి తీరుతాను' అని ప్రగల్భాలు పలుకుతున్నాడట. అంతలా రంకెలు వేసేవాడు ఇక్కడ పుట్టి ఎక్కడికో పారిపోయి గొల్లపల్లెలో దాక్కోవటమెందుకు? ఏమిటీ దాగుడుమూతలు....ఎదుటబడి నన్ను కొట్టవచ్చుగా....నేనంటే ఎందుకంత భయం?' అని ఆవేశంగా అరిచాడు.

'భయం కాదు – దయ!' అన్నాడు మహర్షి.

'ఆ!' అని పెద్దగా అరిచాడు కంసుడు.

నారదమహర్షి 'నారాయణ నారాయణ' అంటూ వెళ్ళిపోయాడు.

తరువాత కంసుడు తన మంత్రులను, తన వద్ద వున్న మల్లులను, ఇతర ప్రముఖులను సమావేశపరచి 'ఈ రామకృష్ణుల అంతు కనుక్కోవడానికి నేనొక మార్గం ఆలోచించాను. మన మధురానగరంలో ధనుర్యాగం ఏర్పాటు చేయదలచాను. దానికి వాళ్ళను పిలుస్తాను. రామకృష్ణులు రాజప్రాసాదాన్ని సమీపించే సమయానికి అక్కడ ఆస్థాన మదపుటేనుగు కువలయాపీడం వారితో తలపడి వారిని సంహరిస్తుంది. ఒకవేళ దానికి బలి కాకుండా వాళ్ళు తప్పించుకుని రాజభవనంలోకి ప్రవేశించడమే జరిగితే అక్కడ ఎలాగూ మన మేటి మల్లులు చాణూరముష్టకులుంటారు. వారు బలరామకృష్ణుల్ని తమతో పోరాడ వలసిందిగా పిలుస్తారు. ఆ అన్నదమ్ములు వారితో తలపడతారు. అప్పుడు జరిగే పోరాటంలో మన యోధులు ఆ అర్భకులిద్దరినీ మట్టి కరిపిస్తారు'

అని తన పన్నాగం బయటపెట్టాడు. ఆ తరువాత అక్రూరుడ్ని పిలిచి తన మనసులోని మాట చెప్పి బలరామకృష్ణుల్ని ఏదో విధంగా ధనుర్యాగానికి పిలుచుకు రావల్సిందిగా ఆజ్ఞాపించాడు.

అక్రూరుడు హరిభక్తుడు. కంసుడు చెప్పినదంతా సావధానంగా విన్నాడు.

విని అమితంగా బాధపడ్డాడు.

చేసేదిలేక కాగలకార్యం పురుషోత్తముడే నెరవేర్చగలడని ధైర్యం తెచ్చుకుని తల పంకించాడు.

అక్రూరుని రథం బృందావనం చేరుకుంది.

అక్రూరుడ్ని చూడగానే శ్రీకృష్ణుడు ప్రేమగా కౌగిలించుకున్నాడు. అక్రూరుడు బృందావనంలో అందరికీ ఇష్టుడు. అందరూ వచ్చి అతనికి అభివాదం చేశారు. అక్రూరుడు కన్నయ్యకు నమస్కరించి తను వచ్చిన పని చెప్పాడు. యశోద ఆ కబురు విని కలవరపడింది.

'మా పిల్లలు పసివాళ్లు. వాళ్ళకు యాగాలూ, పోరాటాలూ వద్దు. మా బిడ్డల్ని పంపం. వాళ్ళకు ఏమైనా అయితే మేము భరించలేము' అంది.

కృష్ణయ్య నవ్వి తల్లికి ధైర్యం చెప్పాడు. తల్లిని శాంతపరిచాడు.

మరునాడు సప్తమి. అష్టమినాడు ధనుర్యాగం.

అష్టమినాడే దేవకీ నందనుడు పుట్టాడు. సప్తమి రోజు ఉదయం రామకృష్ణులు బయలు దేరారు.

అక్రూరుడు రథం నడిపాడు.

తేరు కదిలి వెడుతుంటే గోకులమంతా బలరామకృష్ణులు చల్లగా వుండాలని వేనవేల దేవుళ్ళకు మొక్కింది.

# కృష్ణలీల

రామకృష్ణులు ఎక్కిన రథం మధ్యాహ్నానికి కాళిందిని చేరుకుంది. అన్నదమ్ములు బండిని ఆపమని కోరి నదిలోకి దిగి దప్పిక తీర్చుకున్నారు. వాళ్ళు మళ్ళీ రథమెక్కాక మధ్యాహ్నసంధ్యకు అర్ఘ్యమివ్వాలని అక్రూరుడు నదికి వెళ్ళాడు. అలా వెళ్ళి నదిలోకి దిగగానే నదీగర్భంలో ఆయనకు బలరామకృష్ణులు కనిపించారు. ఆశ్చర్యపోయి నమ్మలేక మళ్ళీ చరచరా ఒడ్డుకు వచ్చి రథం వున్న దిక్కుకు చూశాడు. అన్నదమ్ములు రథం మీద కూర్చుని వున్నారు. చిత్రంగా అనిపించింది అక్రూరుడికి.

మళ్ళీ నదివేపు నడిచాడు.

ఈసారి నీళ్ళలో వేయిపడగలతో వెలుగులు చిమ్ముతున్న అనంతుడూ, ఆయనపై శయనించిన శ్రీ మహావిష్ణువూ కనిపించారు. శ్రీ మహాలక్ష్మి కూడా ఆయన చెంత వుంది. శ్రీమన్నారాయణుడు నీలమేఘచ్ఛాయతో ప్రకాశిస్తున్నాడు.

పట్టు పీతాంబరం ధరించి వున్నాడు.

కలువరేకుల వంటి కళ్ళు, తీర్చిదిద్దినట్టుగా వున్న కనుబొమలు, నాలుగు చేతులు

విశాలమైన వక్షస్థలం

శంఖం వంటి మెడ

ఎర్రటి పెదిమలు

ముచ్చటగా బుగ్గలు

నాభిలో పద్మం

పద్మంలో పరబ్రహ్మ

పరమపురుషుడు సర్వాంగసుందరంగా శోభిస్తున్నాడు.

ఆయన ధరించిన నగలు దివ్యమైనవిగా వున్నాయి. శ్రీ మహావిష్ణువు రొమ్ముమీద శ్రీవత్సం భాసిస్తోంది. మెడలో కౌస్తుభమణి ప్రకాశిస్తోంది.

ఆయనకు పక్కగా నిలబడి దేవతలు, మునులు స్తోత్రం చేస్తున్నారు. సనక, సనందన, సనాతన, సనత్కుమారులు ఆయన వెనుక నిలబడి వున్నారు. ఆ అపురూప దృశ్యాన్ని చూసి అక్రూరుడు ఆనందంతో పరవశుడయ్యాడు. కళ్ళ వెంట ఆనందాశ్రువులు రాలాయి. శరీరం హర్షపులకితమై కన్నులు అర మోడ్పులయ్యాయి. చేతులు జోడించి స్వామికి నమస్కరించాడు. భక్తి పారవశ్యంలో ఎంతోసేపు అలాగే వుండిపోయాడు. చాలాసేపటికి కన్నులు తెరిచాడు. కళ్ళెదుట స్వామి కనుమరుగయ్యాడు. గట్టుకేసి చూస్తే ఎదురుగా రథం మీద బలరామకృష్ణులు కనిపించారు.

అక్రూరుడు విస్మితుడయ్యాడు.

సంభ్రమంతో రథం వద్దకు నడిచాడు.

నీలమేఘశ్యాముడు చిరునవ్వు నవ్వాడు.

'నది పక్కనే వుంది గదా! ఎంత భక్తుడివైనా పరమాత్ముడికి అర్ఘ్యం ఇవ్వడం ఇంతసేపా! ఆకాశంలోనూ, భూమిమీదా కనబడని వింతలూ, విడ్డూరాలూ కాళిందిలో కనిపించాయా?' అని అడిగాడు.

'కృష్ణా! నువ్వు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడవు. సృష్టిలో ఉన్న జీవరాశి కంతటికీ నువ్వే మూలకారణం. వింతలన్నీ నీలోనే వున్నాయి. నీలో లేని వింతలూ, విడ్డూరాలూ నింగిలో, నేలలో ఎక్కడ వుంటాయి మహానుభావా' అని అక్రూరుడు శ్రీకృష్ణునకు ప్రణమిల్లి నివేదించుకున్నాడు.

బలరామకృష్ణులు ఒకరివంక ఒకరు చూసుకుని నవ్వుకున్నారు.

నల్లనివాడు, పద్మనయనమ్ములవాడు అక్రూరుడ్ని దీవించాడు.

ఆ తరువాత మళ్ళీ రథం కదిలింది.

సాయంకాలానికి వాళ్ళు మధురానగరం చేరుకున్నారు.

మధురానగరం శోభాయమానంగా వుంది. అష్టమినాటి ధనుర్యాగ మహోత్సవానికి నగరాన్ని అందంగా అలంకరించారు. నగర పొలిమేరల్లోనే రథాన్ని నిలుపు చేయించి, తమ రాక గురించి కంసుడికి తెలియజేసేందుకు బలరామకృష్ణులు అక్రూరుడ్ని ముందుగా నగరంలోకి పంపారు.

అక్రూరుడు రాజభవనం చేరి ధనుర్యాగానికి రామకృష్ణులు వచ్చినట్లు కంసుడితో చెప్పాడు.

కంసుడు కంగారుపడ్డాడు.

అంతలోనే సర్దుకుని మేకపోతు గాంభీర్యం నటిస్తూ 'వచ్చారా... అయితే ఆయువు మూడిందిలే....' అన్నాడు.

'అవునవును' అన్నాడు అక్రూరుడు.

కంసుడికి ఆ మాట అర్థం కాక పగలబడి నవ్వుకున్నాడు.

# కంస భృత్యుడు

**మ**ధురానగరాన్ని పూర్వం మధువనమని పిలిచేవారు. రావణాసురుని మేనల్లుడు లవణాసురుడు పరిపాలిస్తుండేవాడు.

లవణాసురుడు అమిత బలవంతుడు. అతని ముందు రావణాసురుడు కూడా తల ఒగ్గి వుండేవాడు. అతను మునులను తీవ్రంగా బాధించేవాడు. ఆ సంగతి తెలిసి శ్రీరామచంద్రుడు శత్రుఘ్నుడికి ఆనతి ఇచ్చాడు. శత్రుఘ్నుడు లవణాసురుడ్ని సంహరించాడు. ఆ తరువాత మధువనం మధురానగరమైంది. శ్రీరాముడు దానికి అధిపతి అయ్యాడు.

మధురానగరాన్ని కొంతకాలం శతృఘ్నుడి కుమారులైన పుష్కరుడు, అక్షుడు పరిపాలించారు.

ఆ తరువాత దాన్ని యాదవులు స్వాధీనపరచుకున్నారు.

మధురాధిపతి అయిన శూరసేనుడు యయాతి కుమారుడు. అతను వీరుడే కాని, అతని పాలన సక్రమంగా వుండేదికాదు. అందువల్ల మాధవ వంశానికి చెందిన ఉగ్రసేనుడు రాజ్యం చేజిక్కించుకున్నాడు.

స్వాయంభువు మధురానగరంలో నూరేళ్ళు తపస్సుచేసి, స్వాయంభువ మనువు అనే కుమారుడ్ని పొందాడు. ఇంద్రుడు, ఇనుడు, ధనదుడు, యముడు, ధ్రువుడు ఆ వనంలో తపస్సు చేశారు. మధువనంలో తపస్సు చేసినందువల్లనే

రావణాసురుడు బర్హిర్ముఖులను ఓడించి లంకానగరాన్ని నిర్మించుకోగలిగాడు. శంతన మహారాజు ఆ వనంలో తపస్సు చేసిన తరువాతనే ఆయనకు భీష్ముడు జన్మించాడు. మధురను స్మరిస్తే మాధవుడ్ని స్మరించినట్టే. మధురాధిపతి మాధవుడు.

మధురానగరం యాదవుల తొలి నివాసం.

బలరామకృష్ణులు మధురానగరం సందర్శించేందుకు బయలుదేరారు. మధురానగర ప్రజలు రామకృష్ణులను గురించి వినడమే కాని అంతవరకూ చూడలేదు. అందుకని కొందరు మేడలు, మిద్దెలు ఎక్కి నిలబడ్డారు. కొందరు చెట్లెక్కారు. కొందరు సుందరాంగులు రామకృష్ణులు వెడుతున్న దారికి రెండు వేపులా నిలబడి వాళ్ళమీద పూలు చల్లారు. కృష్ణుడు వాళ్ళందర్నీ ఓర చూపులతో పలకరించాడు. ఆ చూపులకు వాళ్ళ ఒళ్ళు ఝల్లుమంది.

కొందరు పెద్దలు కృష్ణయ్యను చూసి 'ఈ పిల్లవాడు పసివానిగా ఉన్నప్పుడు పూతన దగ్గర పాలు తాగి దాన్ని చంపాట్ట. శకటాసురుడ్ని, బకాసురుడ్ని కూడా ఒక్క దెబ్బతో పడకొట్టాడట. సాక్షాత్తు శ్రీ మహావిష్ణువే ఇలా పుట్టాడని అందరూ అంటున్నారు' అని చెప్పుకుని సంతోషపడుతున్నారు.

ఇంతలో కంసుడి పట్టుబట్టలు శుభ్రంగా ఉతికి బండిమీద పేర్చి తీసుకు వెళుతున్న రజకుడొకడు ఎదురయ్యాడు. కృష్ణుడు వాడ్ని ఆపి – 'మేము ఈరోజే కొత్తగా మీ ఊరు వచ్చాం. మాకు కట్టుకోవడానికి మంచిబట్టలు లేవు. నీ మూటలో జరీ బట్టలు జిగేలున మెరుస్తున్నాయి. మాకివ్వవూ?' అన్నాడు.

రజకుడు వినిపించుకోకుండా బండి తోసుకుపోబోయాడు.

కృష్ణుడు బండికి ఎదురువెళ్ళి అడ్డంగా నిలబడ్డాడు.

రజకుడికి కోపం వచ్చింది.

'పశువుల్లా ఉన్నారు. మీ ముఖానికి పట్టుబట్టలా....తప్పుకో తప్పుకో. కంసరాజుగారివీ బట్టలు. ఆయనగారికీ సంగతి తెలిస్తే మీ ప్రాణాలుండవు' అని హూంకరించాడు.

ఆ మాటలకు శ్రీకృష్ణుడు మండిపడ్డాడు. రజకుడ్ని ఒక్క చరుపు చరిచాడు. దానితో వాడు ఎగిరి అవతల పడ్డాడు. పడ్డవాడు మళ్ళీ లేవలేదు. అది చూసి వీధిలోని జనమంతా భయపడి పారిపోయారు. రజకుడి అనుచరులందరూ వాళ్ళ మూటలు అక్కడ వదిలి పరుగు లంకించుకున్నారు. బలరామకృష్ణులు నవ్వుకుని ఆ మూటల్లోంచి తమకు కావలసిన బట్టలు తీసుకుని కొన్ని తమ స్నేహితులయిన గోపాలకులకు యిచ్చారు.

రావణసంహారం తరువాత శ్రీరాముడు అయోధ్యలో రాజ్యపాలన చేస్తున్నప్పుడు ఒక రజకుడు తన భార్యను కోప్పడుతూ, 'పరాయి మగవాడి పంచన వుండి వచ్చిన నిన్ను పరిగ్రహించడానికి నేను వెర్రి రాముడి ననుకున్నావా!' అని నిందించాడు. అది చారులద్వారా విని శ్రీరామచంద్రుడు బాధపడ్డాడు. ఆ అపకీర్తిని తొలగించుకునేందుకు శ్రీరాముడు సీతాదేవిని అడవులకు పంపాడు.

నోటికొచ్చినట్టు మాట్లాడి ఏ పాపం ఎరుగని సీతాదేవిపై నిందవేసి అరణ్యవాసం కల్పించిన ఆ రజకుడు, పాపఫలాన్ని అనుభవించేందుకు ద్వాపరయుగంలో తిరిగి రజకుడిగానే పుట్టి శ్రీకృష్ణుని చేతిలో ప్రాణాలు వదిలాడు. నల్లనయ్య వాడికి పరమపదాన్ని ప్రసాదించాడు.

# సుదాముడు – కుబ్జ

మధురానగరంలో సుదాముడనే పేదవాడుండేవాడు. అతను పూలమాలలు అమ్ముకుని పొట్టపోసుకుంటుండేవాడు.

కృష్ణుడంటే అతనికి అమితమైన భక్తి. బలరామకృష్ణులు అతని ఇంటికి వెళ్ళారు. తాను కొలిచే దైవం తనకై తాను దర్శనమిచ్చేందుకు వచ్చినందుకు సుదాముడు తన్మయుడయ్యాడు. బలరామకృష్ణులకు అతిథి సత్కారాలు చేశాడు. కూర్చునేందుకు ఉన్నతాసనం చూపించాడు. వారిమీద సుగంధం చల్లాడు. వారిని రకరకాల పూలతో పూజించాడు.

అది చూసి రామకృష్ణులు సంతుష్టులైనారు. సుదాముడ్ని అనుగ్రహించదలచి 'ఏదైనా వరం కోరుకో' అన్నారు.

'కృష్ణా! నీ పాదాల చెంత వుండే అదృష్టాన్ని నాకు కలుగచేయి. నీకు సేవచేసే భాగ్యాన్ని నాకు ప్రసాదించు. అన్ని జీవులపట్లా దయకలిగి వుండేలా నన్ను దీవించు. నిన్ను ప్రేమిస్తూ, నిన్ను పూజిస్తూవుండే సజ్జనుల సాంగత్యాన్ని నాకు కలుగచేయి. అదిచాలు' అని సుదాముడు కృష్ణుడ్ని అర్థించాడు. సుదాముడు కోరిన వరాలతోపాటు అతనికి ఐశ్వర్యాన్ని, బలాన్ని, ఆయువునూ, యశాన్నీ, తేజాన్నీ కూడా కృష్ణుడు ఇచ్చాడు.

సుదాముడు పూర్వం కుబేరుని చైత్రరథంలో పువ్వులు ఏరే పని చేసేవాడు. అప్పుడు అతని పేరు హేమమాలి.

హేమమాలి న్యాయబుద్ధి గలవాడు. పెద్దలపట్ల వినయ విధేయతలతో మెలిగేవాడు. దానధర్మాలు చేసేవాడు. దైవభక్తి కలవాడు. హరిసేవా పరాయణుడు.

శ్రీహరిని తన కళ్ళెదుట సాక్షాత్కరింపచేసుకోవాలనే ఉద్దేశంతో సుదాముడు ఐదువేల అరవిందాలను సమకూర్చుకుని వాటితో మహేశ్వరుని పూజించాడు. మహేశ్వరుడు అతని భక్తికి మెచ్చుకుని ఏదైనా వరం కోరుకోమన్నాడు. 'జగన్నాథుడైన శ్రీమన్నారాయణుడు నా ఆతిథ్యాన్ని స్వీకరించాలి. అదే నా కోరిక' అన్నాడు హేమమాలి.

హేమమాలి కోరికను మహేశ్వరుడు మన్నించాడు. మహేశ్వరుడిచ్చిన ఆ వరాన్ని శ్రీకృష్ణుడు ద్వాపరయుగంలో చెల్లించాడు.

సుదాముడికి వరాలిచ్చి బలరామకృష్ణులు అక్కడినుండి బయలు దేరారు. అంతలో కంసదాసి కుబ్జ వారికి ఎదురైంది. ఆమె సుగంధలేపనాలు తయారు చెయ్యడంలో నేర్పరి. ఆమె రూపం బహు వికృతంగా వుంటుంది. ఆమెను చూడగానే మాధవుడికి జాలివేసింది. ఆమెను ఆపి 'ఎవరు నీవు? నీ పేరేమిటి?' అని అడిగాడు. 'నా పేరు త్రివక్ర. కంసమహారాజు దాసిని. రాజుగారి కోసమని సుగంధ లేపనాలు తయారుచేస్తుంటాను' అని దగ్గరున్న పళ్ళెంమీద మూత తీసింది.

పరిమళాలు గుప్పున గుబాళించి వనమాలిని చుట్టుముట్టాయి.

'చక్కని వాడివి. నీకన్నా అందగాడెవరుంటారు? రాజులైనా, మహారాజులైనా నీ తరువాతే! అందుకో స్వామీ' అని కుబ్జ కృష్ణుడికి సుగంధ లేపనాలు ఇచ్చింది. ఆయనకు స్వయంగా మైపూతలు పూసింది. మనసారా కృష్ణుణ్ని సేవించింది. కృష్ణుడు కుబ్జను అనుగ్రహించదలచి ఆమె పాదం మీద తన పాదం బొటనవేలు మోపి ఆమె నడుముచుట్టి మరో చేతితో ఆమె చుబుకాన్ని స్పృశిస్తూ ఆమె వదనాన్ని పైకెత్తాడు.

కుబ్జ తీగలా సాగింది.

ఆమెకు వున్న వంకరలన్నీ పోయి, శిల్ప సమాన సౌందర్యవతి అయింది.

దివ్య లావణ్యంతో వెలిగిపోయింది.

అలా అపురూప సౌందర్యవతిగా మారిన కుబ్జాసుందరి చెక్కిళ్ళపై ఆనంద బాష్పాలు జారుతుండగా చేతులు జోడించి నల్లనివాడికి నమస్కరించింది.

త్రేతాయుగంలో రావణాసురుడి సోదరి శూర్పణఖ శ్రీరామచంద్రుడ్ని మోహించి తనను పెళ్ళి చేసుకోవలసిందిగా ఆయనను అర్ధించింది. శ్రీరాముడు ఏకపత్నీవ్రతుడు కావడంవల్ల ఆమె కోరికను మన్నించలేదు. శూర్పణఖ స్వామి విధించుకున్న నియమాన్ని గ్రహించలేక సీతామహాదేవి వుండడంవల్ల శ్రీరాముడు తనను తిరస్కరించాడనుకుని సీతను మింగబోయింది. లక్ష్మణుడు అది చూసి ఆ రక్కసి ముక్కూ చెవులూ కోశాడు.

ఆ తరువాత శూర్పణఖ పుష్కరతీర్థానికి పోయి శంకరుని గురించి తీవ్రమైన తపస్సు చేసింది.

మహేశ్వరుడు ప్రత్యక్షమై 'నీ కోరిక ఏమిటి?' అని అడిగాడు.

'శ్రీరామచంద్రుడు నా పట్ల ప్రసన్నుడు కావాలి' అని కోరింది శూర్పణఖ.

శంకరుడు సరే అన్నాడు.

శూర్పణఖ కోరిన ఆ కోరిక వల్ల శ్రీకృష్ణుడు ద్వాపరంలో ఆమెను అనుగ్రహించాడు.

# మందగతి

**క**ంసుని ధనుశ్శాలలో పెద్ద రాచవిల్లు ఒకటి వుంది. అది చూసేందుకు ఇంద్రచాపంలా వుంటుంది. ఎవరూ దానిని పైకెత్తలేరు. కృష్ణుడు వింటిని చూశాడు. కావలివారు వారిస్తున్నా లక్ష్యపెట్టకుండా లోపలికి వెళ్ళి అవలీలగా దానిని పైకెత్తాడు. ఎక్కుపెట్టి చెరకుగెడ విరిచేసినట్టు విరిచేశాడు. ఇనుపవిల్లు ఫెళఫెళ విరిగింది. ధనుశ్శాల దద్దరిల్లింది. విల్లువిరిగిన ధ్వనికి కంసుడు అదిరిపడ్డాడు. భయంతో వణికిపోయాడు. పిచ్చివాడిలా అటూ ఇటూ పరుగెత్తాడు. ఆ రాత్రి అతనికి కంటిమీద కునుకు లేదు. అశాంతితో అలమటించాడు.

దానికి తోడు కంసరాజుకి అప్పుడు తన మరణాన్ని సూచిస్తూ అనేక ఉత్పాతాలు కూడా కనిపించాయి. అవి చూసి భయపడిపోయి పెద్దగా కేకలేశాడు. ఆ అరుపులకు మందిరాలలో వున్న జనమంతా మేలుకున్నారు.

పరిచారకులు పరుగెత్తుకుంటూ వచ్చారు.

'కృష్ణుడ్ని చంపాలి. ఇప్పుడే చంపాలి. వాడు బతకడానికి వీల్లేదు. పొగరెక్కిన ఏనుగుల్ని ఆ మాయలమారి మీదకు తోలండి. అవే వాడి పొగరు అణుస్తాయి' అని ఒగరుస్తూ అన్నాడు కంసరాజు.

ఆ క్షణంలో కంసుడ్ని చూస్తే ఎవరైనా జాలిపడాల్సిందే! ఎండుటాకులా వణికిపోతున్నాడు.

ఎండిన తాటాకుల మీద ఎలుక కాళ్ళ చప్పుళ్ళలా పెద్దగా అరుస్తున్నాడు.

చూపులు చంచలమవుతున్నాయి.

అడుగులు తడబడుతున్నాయి.

తెల్లవారితే అష్టమి.

ఇంకా బారెడు చీకటి వుండగానే వేలాది జనం – కోటలో ధనుర్యాగం, మల్లయుద్ధం చూడటానికి ముస్తాబవుతున్నారు.

తెల్లవారింది. చీకటిపోయి వెలుగు వచ్చింది.

బలరామకృష్ణులు అక్రూరుడ్ని వెంటపెట్టుకుని కోటలోనికి ప్రవేశించారు.

కోట గుమ్మం పక్కన కువలయాపీడం వుంది.

బలరామకృష్ణుల్ని చూడగానే అది ఘీంకరించింది.

దానిని అప్పటివరకూ గొలుసులతోకట్టి పట్టుకున్న మావటివాళ్ళు గోలుసు లూడదీశారు. మత్తగజాన్ని బలరామకృష్ణుల మీదకు ఉసిగొల్పారు. కువలయాపీడం కృష్ణయ్యను తన తొండంతో కొట్టబోయింది. కృష్ణుడు దాని పట్టు తప్పించుకుని ఆ కరి కాళ్ళ కిందకు దూరాడు.

నల్లనయ్యను వెతుక్కుంటూ ఆ ఏనుగు వలయాకారంగా తిరిగింది. చివరికి పసికట్టి, కృష్ణుడ్ని పట్టుకునే ఉద్దేశంతో తన తొండాన్ని చాచింది. కృష్ణుడు అందకుండా మెల్ల మెల్లగా వెనక్కిపోయాడు. దాని తోక పట్టుకుని మెలి తిప్పాడు. కువలయాపీడానికి కోపం వచ్చి ఆయన మీదకు కాలు విసిరింది. ఆ దెబ్బనుంచి తప్పించుకునేందుకు కృష్ణుడు నేలకు వాలాడు. మత్తగజం అది చూసి శత్రువు కూలిపోయాడనుకుంది. తక్షణం తన దంతాలతో చీల్చి ముక్కలు ముక్కలు చేసేందుకు ఆయన మీదకు ఉరికింది. కృష్ణుడు అది గ్రహించి తప్పుకున్నాడు. ఆయన అలా తప్పుకోవడంవల్ల ఆ ఏనుగు దంతాలు నేలలో గుచ్చుకు పోయాయి.

బాధ తట్టుకోలేక పెద్దగా ఘీంకరించిందది.

కృష్ణయ్య వెంటనే దాని రెండు దంతాలూ పట్టుకుని వాటిని బలవంతంగా పెకలించాడు. అది గుండెలు పగిలేలా ఘోష పెట్టింది. కృష్ణుడు అమాంతం దాని మీదకు ఉరికి దాని కుంభస్థలం మీద దాని దంతాలతోనే పొడిచాడు. ఈసారి ఏనుగు గిలగిలా తన్నుకుని ప్రాణాలు విడిచింది. దాని తేజం శ్రీకృష్ణునిలో లీనమైంది.

పూర్వం బలి కుమారుడు – మందగతి అనే వాడొకడుండేవాడు. అతను మహాబలశాలి. సర్వశాస్త్రాలూ నేర్చినవాడు.

అతనొకసారి శ్రీరంగయాత్రకు బయలుదేరాడు. దారిలో కనిపించిన వాళ్ళందర్నీ ఏనుగు మాదిరి ఢీకొంటూ పడతోసుకుంటూ వెళ్ళాడు. అతనివల్ల గాయపడిన వారిలో త్రితుడనే ఒక ముని కూడా వున్నాడు. ఆయన వృద్ధుడు, బలహీనుడు. మందగతి ఢీకొనడంవల్ల ఆయన కింద పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనకు ఆగ్రహం కలిగింది. వెంటనే మందగతిని ఉద్దేశించి 'నువ్వు ఏనుగు మాదిరి చరిస్తున్నావు, కాబట్టి మదపుటేనుగువై పుడతావు' అని శపించాడు.

శాపం పొందాక మందగతికి తనుచేసిన తప్పేమిటో తెలిసొచ్చింది. ముని పాదాల మీదపడి క్షమించవలసిందిగా ప్రార్థించాడు. 'శ్రీకృష్ణుని ద్వారా నీకు శాపవిముక్తి కలుగుతుంద'ని ముని అనుగ్రహించాడు.

ఆ తరువాత మందగతి కువలయాపీడం అనే పేరుతో వింధ్య పర్వతాలలో పుట్టాడు. దానిని మగధేశ్వరుడైన జరాసంధుడు అతి కష్టం మీద స్వాధీనపరుచుకున్నాడు. తరువాత దానిని ఆయన కంసరాజుకు కానుకగా సమర్పించాడు.

ఆ మత్తగజాన్ని శ్రీకృష్ణుడు సంహరించడంవల్ల మందగతికి ముక్తి లభించింది.

# చాణూర ముష్టికులు

బలరామకృష్ణులు కంసుని సభాభవనంలోకి ప్రవేశించారు. కంసుడు సింహాసనం మీద కూర్చుని వున్నాడు. చాణూర ముష్టికులు కంసరాజుకు వెనకగా నిలబడి వున్నారు. చాణూరుడు కృష్ణుడి దగ్గరకు వెళ్ళి 'కృష్ణా! నువ్వు చిన్నవాడివని మేమనుకోవడం లేదు. వేయి ఏనుగుల బలంగల కువలయాపీడాన్ని అనాయాసంగా కూల్చివేశావు. నీ శక్తిసామర్థ్యాలను మల్లయుద్ధంలో చూపి మా చక్రవర్తికి ఆనందం కలుగజేయి. 'మా మల్లయుద్ధ విశారదులు నీతో తలపడతారు. బరిలో వారితో పోరాడి మాకు వినోదం కలిగించు' అన్నాడు. కృష్ణుడు సమ్మోహకరంగా నవ్వి 'యోధులూ, యుద్ధ విశారదులూ అక్కర్లేదు. నేను నీతో తలపడతాను. మా అన్న బలరాముడు ముష్టికుడితో తలపడతాడు. ఇష్టమయితే ముందుకు రండి' అన్నాడు.

ఆ మాటలకు చాణూరుడికి రోషం వచ్చింది. మహారాజు సైగతో చాణూర ముష్టికులు రామకృష్ణుల మీదకు దూకారు.

ముష్టికుడు అతి భీకరంగా గర్జించాడు. జబ్బలు చరిచాడు. ఆ ధ్వనికి బెదిరిపోయినట్టు కృష్ణుడు గబగబా బలరాముడి వెనక్కి వెళ్ళి దాక్కున్నాడు. అది చూసి చాణూరుడు పగలబడి నవ్వాడు. 'నవమన్మథమొలకా! యుద్ధమంటే ఆడపిల్లల్నీ, గొల్ల పిల్లల్నీ వెంటేసుకుని బృందావనంలో తిరగడంకాదు. మా జబ్బల చరుపు మీ నారదుడి వీణానాదంలా వుండదు. మా బాహునాదం విని

తట్టుకోవడానికి గుండెధైర్యం కావాలి. రా! గొల్లపిల్లడా! ధైర్యముంటే ముందుకు రా' అని హేళన చేశాడు.

మాధవుడు మందగమనంతో ముందుకు వచ్చి నిలిచాడు. తన లీలామానుష స్వరూపాన్ని ప్రదర్శించాడు. శక్తికి ప్రతిరూపంలా చెలరేగాడు. హోరాహోరీగా పోరు సాగింది. మల్లులకు పిడుగు మాదిరిగా, చాణూర ముష్టికులకు అంకుశంలా, కంసరాజుకు మృత్యుదేవతగా, అజ్ఞానులకు అల్పుడుగా, పెద్దలకు తత్త్వస్వరూపుడిగా, కన్నెలకు నవమన్మథుడుగా, యాదవులకు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడిగా నల్లనయ్య గోచరించాడు.

చాణూర ముష్టికులు బలరామకృష్ణుల ధాటికి తట్టుకోలేకపోయారు. శ్రీకృష్ణుడు చాణూరుడ్ని పట్టుకొని గిరగిర తిప్పి నేలకేసి కొట్టాడు. అతను నెత్తురు కక్కుకుని ప్రాణం వదిలాడు. బలరాముడు ముష్టికుడ్ని పడద్రోసి పాదాలతో తొక్కి చంపాడు. సభలో హాహాకారాలు, హర్షధ్వానాలు, జయజయ నాదాలు చెలరేగాయి.

సభలోని మల్లులందరూ బెదిరి తలో దిక్కుకూ చెదిరిపోయారు.

పూర్వం అమరావతీపురంలో ఉతథ్యుడనే ఒక మహర్షి ఉండేవాడు. ఆయనకు అయిదుగురు కుమారులు. అమిత సౌందర్యమూర్తులు. వారు పెరిగి పెద్దవారయ్యారు కానీ, విద్యాబుద్ధులు మాత్రం అబ్బలేదు. అయినదానికీ, కానిదానికీ అందరితో కయ్యానికి కాలు దువ్వేవారు. బలాధిక్యత మాత్రమే కలిగింది వాళ్ళకు. అది చూసి ఉతథ్యుడు బాధపడి, కొడుకులు భ్రష్టులైనారని భావించి వారికి ధర్మమార్గాన్ని బోధించాలని ఎంతగానో ప్రయత్నించాడు. కాని ఆయన ప్రయత్నాలు ఫలించలేదు. తండ్రి మాట కొడుకులు ఇసుమంతైనా వినేవారు కాదు. రాక్షసంగా ప్రవర్తించేవారు. ఉతద్యుడు ఒకసారి కోపం పట్టలేక 'మీరు రాక్షసులై పుట్టి, రాక్షససంపర్కం పొంది మల్లవిద్యాప్రదర్శకులుగా చరిస్తారు' అని ఐదుగురు కొడుకుల్నీ తీవ్రంగా శపించాడు.

తండ్రివల్ల ఆ విధంగా శపింపబడ్డ సోదరులే ఆ తరువాత చాణూరుడు, ముష్టికుడు, కళలుడు, తోశాలకుడు, కూటుడు అనే అసురులుగా పుట్టి, కంసుని కొలువులో చేరి, చివరికి నల్లనయ్య చేతిలో శాప విముక్తి పొందారు.

# కంస సంహారం

కంసుడు పులినాకిన మేకపిల్లలా సభామందిరంలో సింహాసనం మీద ఒదిగొదిగి కూర్చుని వున్నాడు. అతని చుట్టూ మంత్రులూ, సైనికులూ వున్నారు. నిలువెల్లా కంపిస్తున్న తన అనుచరుల్నీ, మృత్యువుకు కొత్తగా అబ్బిన మనోహనర కిశోర రూపంలా ఎదుట నిలిచిన నల్లనయ్యను చూసి కంసుడు ఇక తెగించక తప్పదనుకున్నాడు. చావు ధైర్యం తెచ్చుకుని 'పిచ్చెక్కిన ఏనుగునూ, తాగి తూలుతున్న యోధులనూ సంహరించడం గొప్ప కాదు. నాతో యుద్ధానికి రా. బలాబలాలు తేల్చుకుందాం' అన్నాడు శౌరివైపు తిరిగి.

వెన్నుడికి కోపం వచ్చింది.

కంసుడి మీదకు ఉరికాడు.

మృత్యువు మాదిరి తన మీదకు వస్తున్న అచ్యుతుడ్ని చూసి కంసుడు తటాలున సింహాసనం మీద నుంచి కిందకు దూకాడు. ఒరనుంచి ఖడ్గాన్ని తీసి కృష్ణుడితో తలపడ్డాడు.

కృష్ణుడు అంతెత్తుకు ఎగిరి అక్కడ నుంచి కొదమసింహంలా కంసుడి పైకి లంఘించాడు. ఆ దెబ్బతో కంసుడి కిరీటం బండి చక్రంలా దొర్లుకుంటూ వెళ్ళి దూరంగా పడింది. కృష్ణుడు కంసుడి జట్టు పట్టుకు లాగి విసురుగా తోశాడు. కంసుడు వెల్లకిలా పడ్డాడు. అతని పక్కటెముకలు నుగ్గునుగ్గయ్యాయి.

లేవలేక కూలబడిపోయాడు.

మాధవుడు ఎగిరి అతని ఎదురు రొమ్ముమీద కూర్చున్నాడు.

పిడికిళ్ళతో మర్దించాడు.

కంసుడు నురుగులు కక్కాడు.

'మామా! నిన్ను నేను ఈవేళ చంపడం కాదు – కొన్నేళ్ళుగా చంపుతున్నాను. రాత్రింబవళ్ళు– అనుక్షణం తింటూ, తాగుతూ, విహరిస్తూ కూడా నన్నే తలుచుకుని భయపడ్డావు. నేను గుర్తుకు వచ్చినప్పుడల్లా నీకు కంటిమీద నిద్ర వుండేది కాదు. ప్రతి కదలికలో, ప్రతి ఒక్కరి నీడలో నన్నే చూసి నరక యాతన పడ్డావు. ఎందుకొచ్చిన దిగులు చెప్పు? క్షణం క్షణం చస్తూ బతికే కన్నా ఒకేసారి చావడం మంచిది' అని ఒక్కపోటు పొడిచాడు. కంసుడికళ్ళు మూతపడ్డాయి. అతనిలోంచి ఒక దివ్యతేజం వచ్చి కృష్ణుడిలో లీనమైంది. సభ అంతా చేతులు జోడించి ఆ కిశోరవీరుడికి నమస్కరించింది.

కంసుడి మరణ వార్త విని ఉగ్రులై అతని తమ్ములు కంకుడు, న్యగ్రోధుడు, గహ్వుడు మొదలైనవారు ఒక్కుమ్మడిగా బలరామకృష్ణులమీద విరుచుకుపడ్డారు.

బలరాముడొక్కడే వాళ్ళందర్నీ హతమార్చాడు.

కంసుడి సోదరులు పూర్వం అలకాపురంలో వుండేవారు. వాళ్ళందరూ దేవయక్షుని కుమారులు. దేవకూట, మహాగిరి, గండ, చండ, ప్రచండ, ఖండ, అఖండ, పృధువులని వాళ్ళకు పేర్లుండేవి. ఆ అన్నదమ్ములొకసారి తండ్రి ఆజ్ఞ మేరకు మానససరోవరానికి వెళ్ళి మహేశ్వరుడ్ని పూజించేందుకు అరవిందాలు కోసుకువచ్చారు. కానీ, దారిలో వాటి సుగంధాలకు ముగ్ధులై వాసన చూశారు. దానివల్ల వారికి ఉచ్ఛిష్టీకృత దోషం (ఎంగిలి చేసిన పదార్థాలను నివేదన చెయ్యడం, వాసన చూసిన పూలతో పూజించడం వల్ల కలిగే దోషం) సంభవించింది. ఆ కారణంగా వారు ఎనిమిదిమందీ వరుసగా మూడు జన్మలలో రాక్షసులై పుట్టారు. మూడవసారి ఉగ్రసేనుని కుమారులుగా జన్మించారు. శ్రీకృష్ణుని చేతిలో నిహతులై పాపవిమోచనం పొందారు.

కంసుని మరణవార్త వినగానే ప్రజలంతా ఆనందంతో హర్షధ్వానాలు చేశారు. చెరసాలలో మగ్గుతున్న దేవకీవసుదేవులకు నల్లనయ్య విముక్తి కలిగించాడు. వారు కారాగారం నుంచి బయటకు రాగానే బలరామకృష్ణులు వారికి పాదాభివందనం చేశారు.

ఆనందంతో దేవకీవసుదేవులు పరవశించారు. తమకు నమస్కరిస్తున్న చిరంజీవులు సామాన్యులు కారని భావించి వారిని లేవదీయడానికి, ఆలింగనం చేసుకోవడానికి సంకోచించారు. భక్తిపారవశ్యంతో కళ్ళవెంట ఆనందాశ్రువులు జారుతుండగా అలాగే నిలబడిపోయారు.

కాని, తల్లి మనసు వూరుకోలేదు.

దేవకీదేవి తటాలున వంగి బిడ్డల్ని లేవదీసి గుండెలకు హత్తుకుంది.

బలరామకృష్ణులు చంటిబిడ్డల్లా తల్లిని చుట్టుకుపోయారు.

'అమ్మా! పుట్టటమైతే నీ కడుపున పుట్టాను, కాని, పసితనం నుంచే నీ ప్రేమానురాగాలకు దూరమయ్యాను. ఆ దురదృష్టమంతా నాదే. నువ్వేం బాధపడకు. కంసుడి చేతిలో మీరు పడుతున్న కష్టాలు తెలిసి కూడా మిమ్మల్ని రక్షించడానికి ఇంత ఆలస్యమైనందుకు మన్నించండి' అని కృష్ణుడు తల్లిని వేడుకున్నాడు.

దేవకీవసుదేవులు నల్లనయ్యను దగ్గరకు తీసుకుని పరవశులయ్యారు.

తరువాత కృష్ణుడు ఉగ్రసేనుడ్ని పిలిచి 'మహారాజా! యయాతి శాపం వల్ల యాదవులకు సింహాసనం ఎక్కే అధికారం లేకుండా పోయింది. కనుక మీరే ఈ భూమికి అధిపతి కావాలి. సింహాసనం స్వీకరించండి. ధర్మం తప్పకుండా పాలన చేయండి' అన్నాడు.

ఉగ్రసేనుడు శ్రీకృష్ణపరమాత్మకు నమస్కరించాడు.

# కాలయవనుడు

ఒకసారి కాలయవనుడు శ్రీకృష్ణుడి మీదికి వున్నట్టుండి దాడి చేశాడు. నిజానికి వాళ్ళిద్దరిమధ్యా అప్పటివరకూ ఎటువంటి శత్రుత్వమూ లేదు.

కాలయవనుడు యాదవ పురోహితుడైన గర్గాచార్యుని కుమారుడు. మహావీరుడు. తన బలపరాక్రమాలతో యాదవులను హడలగొడుతుండేవాడు.

గర్గుడు ఆజన్మ బ్రహ్మచారి అని తెలిసిన ఒకడు, ఒకసారి 'ఈయన పురుషుడే అయితే పెళ్ళిచేసుకోకుండా ఎందుకు వుంటాడు?' అని హేళనగా అన్నాడు. గర్గుడు అది విని బాధపడ్డాడు. తరువాత ఆయన అడవికి వెళ్ళి పన్నెండు సంవత్సరాల పాటు అమితనిష్టతో మహేశ్వరుని గూర్చి తపస్సు చేశాడు. ఆ సమయంలో ఆయన లోహచూర్ణం మాత్రమే భుజించేవాడు.

గర్గాచార్యుని దీక్షకు మెచ్చి మహేశ్వరుడు ఆయనకు ప్రత్యక్షమయ్యాడు.

'వరమేదైనా కోరుకో' అన్నాడు.

'మహాత్మా! బలపరాక్రమ సంపన్నుడయిన ఒక కుమారుడ్ని ప్రసాదించు' అని గర్గుడు ప్రార్థించాడు.

ఈశ్వరుడు సరేనన్నాడు.

కాలక్రమాన గర్గాచార్యునికి యాదవకాంత రూపం ధరించిన ఒక అప్సరసతో స్నేహం కలిగింది. ఆయనవల్ల ఆమెకొక కుమారుడు కలిగాడు. అతడ్ని గర్గుడు ప్రేమతో పెంచాడు.

అతనే కాలయవనుడు.

కాలయవనుడు మహా గర్విష్టి. ఎవ్వరినీ లక్ష్యపెట్టేవాడు కాదు. అతను ఒక సారి నారద మహర్షి ఎదురైనప్పుడు 'స్వామీ! ఈ ప్రపంచంలో వీరులయినవారు ఎవరయినా వున్నారా?' అని అడిగాడు.

'లేకేం నాయనా! శ్రీకృష్ణుడు ఉన్నాడుగా! అతనిని మించిన వీరుడు ఈ భూమిమీద లేడు' అన్నాడు కలహాశనుడు.

మహర్షి మాటలు వినగానే కాలయవనుడిలో మత్సరం పెరిగింది. శ్రీకృష్ణుడ్ని ఓడించాలనే దుర్బుద్ధి పుట్టింది. అతను తన బలాన్నంతా సమకూర్చుకుని మధురానగరం మీద దాడి చేశాడు.

అది తెలిసి శ్రీకృష్ణుడు అతని దగ్గరకు ఒక కృష్ణసర్పాన్ని మూతి కట్టి, కుండలో పెట్టి పంపాడు. 'కృష్ణుడు కృష్ణ సర్పంవంటి వాడు సుమా' అని పరోక్షంగా హెచ్చరించాడు.

కాలయవనుడు అది గ్రహించాడు. గ్రహించి, కొన్ని గండు చీమలను తెప్పించి వాటిని ఆ కుండలో వుంచి శ్రీకృష్ణుడి దగ్గరకు మళ్ళీ పంపించాడు. 'వ్యక్తిగతంగా ఎవరి మటుకు వారు బలహీనులే అయినా, పదిమంది కలిసి వస్తే ఎంతటి బలవంతుడైనా ఆ సామూహిక శక్తికి లోబడవలసిందే!' అని కాలయవనుడు సూచించాడు.

శ్రీకృష్ణుడికి పరిస్థితి అర్థమైంది. కాలయవనుడు మూడు కోట్ల మంది రాక్షసులతో మధురానగర పరిసరాల్లో ఒక వంక పొంచి వున్నాడు. కంసుడి మామ జరాసంధుడు రేపోమాపో కొన్ని అక్షౌహిణుల సేనతో మరో దిక్కునుంచి రాబోతున్నాడు. 'ఈ సమయంలో యాదవులను ఆపదనుంచి రక్షించడం నా ధర్మం' అనుకున్నాడు అచ్యుతుడు.

సాగరుని ప్రార్థించి సముద్రం మధ్య నూరు యోజనాల పొడవూ, నూరు యోజనాల వెడల్పూ వున్న స్థలాన్ని సంపాదించాడు. అక్కడ ఒక మహాదుర్గాన్ని నిర్మించవలసిందిగా విశ్వకర్మను ఆదేశించాడు. విశ్వకర్మ అనతికాలంలోనే ఒక సుందరనగరాన్ని నిర్మించాడు. ఆ పురానికి అలంకారంగా మహేంద్రుడు తన సుధర్మ అనే సభా భవనాన్ని, వృక్షరాజమైన పారిజాతాన్ని పంపించాడు. ఆ విధంగా ఏర్పాటయిన నగరానికి ద్వారకానగరమని పేరు పెట్టారు. శ్రీకృష్ణుడు తన యోగ శక్తిద్వారా తన వారినందరినీ క్షణంలో ద్వారకానగరానికి తరలించి వారి రక్షణ భారాన్ని బలరాముడికి అప్పగించాడు. తను వనమాలను మాత్రం ధరించి నిరాయుధుడై మధురానగరం వైపు వెళ్ళాడు.

ఏ ఆయుధమూ లేకుండా నింపాదిగా నడచి వస్తున్న శ్రీకృష్ణుడ్ని చూసి కాలయవనుడు వికటాట్టహాసం చేశాడు. నల్లనయ్యను బంధించాలని ఎదురువెళ్ళాడు.

అది చూసిన శ్రీకృష్ణుడు కాలయవనుడికి భయపడ్డట్టు నటిస్తూ వెనక్కి పరుగెత్తాడు. కాలయవనుడు ఆయనను తరుముకుంటూ వెళ్ళాడు.

అలా వెళ్ళి వెళ్ళి శ్రీకృష్ణుడు ఒక గుహలోకి ప్రవేశించాడు. వనమాలిని తరుముతూ కాలయవనుడు గుహలోకి వచ్చాడు. అక్కడ ఒకతను గాఢంగా నిద్రపోతూ కనిపించాడు. కాలయవనుడు ఆయనను కాలితో ఒక్క తన్ను తన్నాడు. ఎంతోకాలంగా ఆ గుహలో నిద్రపోతూవున్న ఆ వ్యక్తి కాలయవనుని పాదప్రహారంవల్ల లేచాడు. లేచి, అమితమయిన కోపంతో తన ఎదురుగావున్న కాలయవనుని వంక చురచుర చూశాడు. ఆ చూపు వేడిమికి కాలయవనుడు నిలువునా భస్మమైపోయాడు.

కాలయవనుని ఆవిధంగా చూపులతో భస్మం చేసినవాడు యవనాశ్వుని మనుమడూ, మాంధాత కుమారుడూ అయిన ముచికుందుడు. ఆయన ఇక్ష్వాకు వంశీయుడు, పరమభక్తుడు.

ఒకప్పుడు ముచికుందుడు, రాక్షసులకు భయపడిపోయిన దేవతలను కొంతకాలంపాటు కాపాడాడు. ఆ సమయంలో దేవతలు ప్రత్యుపకారంగా ఆయనను ఏదైనా వరం కోరుకోమన్నారు.

ముచికుందుడు తనకు మోక్షాన్ని ప్రసాదించమని కోరాడు.

'దేవతలకెవరికీ మోక్షాన్ని ప్రసాదించే శక్తి లేదు. ఆ శక్తి శ్రీహరికి ఒక్కనికే వుంది. ఆయన నీకు పరమపదాన్ని అనుగ్రహిస్తాడు' అని అభయమిచ్చారు దేవతలు.

ముచికుందుడి భార్యలూ, బంధువులూ, మిత్రులూ చాలామంది అప్పటికే మరణించారు. అందుకని వేదనలన్నీ మరిచిపోయేలా తనకు మంచి నిద్రను ప్రసాదించమని దేవతలను కోరాడు. అలా నిద్రను దేవతల నుండి వరంగా పొంది పర్వత గుహలోకి ప్రవేశించి పడుకున్నాడు. దేవదత్తమయిన ఆ నిద్రను భంగపరచినందుకే కాలయవనుడు ముని కోపాగ్నికి ఆహుతయ్యాడు.

కాలయవనుడలా కన్నుమూశాక శ్రీకృష్ణుడు ముచికుందుని ఎదుట ప్రత్యక్షమయ్యాడు.

'ముచికుందా! నిన్ను అనుగ్రహించేందుకు వచ్చాను. నా భక్తులు నన్ను దర్శించాక దుఃఖపడకూడదు. నీకే వరంకావాలో కోరుకో ఇస్తాను' అన్నాడు.

ముచికుందుడు చేతులు జోడిస్తూ 'తండ్రీ! నీ సేవాభాగ్యం తప్ప నాకు వేరేమీ అక్కర్లేదు' అన్నాడు. అది విని కృష్ణుడు అమితానందం పొందాడు.

కృష్ణుని అనుగ్రహం పొందిన ముచికుందుడు అక్కడనుంచి నరనారాయణ స్థానమైన బదరికాశ్రమానికి వెళ్ళాడు. అక్కడ నిశ్చల చిత్తంతో శ్రీహరిని ధ్యానిస్తూ కాలం గడిపాడు.

# రుక్మిణీకృష్ణులు

విదర్భ దేశాన్ని భీష్మకుడు అనే రాజుగారు పరిపాలిస్తుండేవారు. ఆయనకు రుక్మి, రుక్మధరుడు, రుక్మబాహుడు, రుక్మకేశుడు, రుక్మనేత్రుడు అనే ఐదుగురు కుమారులూ, రుక్మిణి అనే ఒక కూతురూ వున్నారు. వారందరికీ రుక్మిణి చెల్లెలు.

ఆమె శ్రీమహాలక్ష్మి అంశతో పుట్టింది. మహా గుణవంతురాలనీ, సౌందర్యరాశి అనీ ప్రసిద్ధి పొందింది.

భీష్మకుని ఇంటికి ఎప్పుడూ అనేకమంది అతిథులు వస్తుండేవారు. వారు యాదవ శ్రేష్ఠుడైన శ్రీకృష్ణుని లీలలనూ గుణగణాలనూ కథలు కథలుగా చెబుతుండేవారు. అవన్నీ వినడంవల్ల రుక్మిణికి బాల్యంలోనే శ్రీకృష్ణుని మీద అభిమానం ఏర్పడింది. పెద్దయ్యేసరికి అది ప్రేమగా మారింది. మాధవుడికే తాను భార్య కావాలని రుక్మిణి గట్టిగా నిర్ణయించుకుంది.

రుక్మిణీదేవి అందచందాలను గురించీ, గుణగణాలను గురించీ శ్రీకృష్ణుడు కూడా విన్నాడు. ఆమె నెలాగైనా వివాహం చేసుకోవాలని ఆయనా పట్టుదలగా వున్నాడు.

అయితే పెద్ద అన్నగారైన రుక్మి మాత్రం తన చెల్లెలు రుక్మిణిని చేది దేశపు రాజైన శిశుపాలుడికి యిచ్చి వివాహం చెయ్యాలని నిశ్చయించాడు.

అన్నగారి నిర్ణయం రుక్మిణీదేవికి దుఃఖం కలిగించింది. వెంటనే తనకు

ఆప్తుడైన పురోహితుడు అగ్నిద్యోతనుడ్ని పిలిచి శ్రీకృష్ణుడికి తన ప్రేమను తెలియచెయ్యమని ప్రార్థించింది. ఆయనకు రకరకాల బహుమానాలూ, కానుకలూ ఇచ్చి ద్వారావతికి పంపింది.

ద్వారావతి చేరుకున్న అగ్నిద్యోతనుడు కృష్ణుడ్ని కలుసుకుని రుక్మిణి పక్షాన ఆమె చెప్పమన్నవన్నీ చెప్పాడు. మాధవదేవుని మీద రుక్మిణికి గల ప్రేమానురాగాలను పూసగుచ్చినట్లు నివేదించాడు. రుక్మిణి నిర్ణయాన్ని గురించి కూడా చెప్పాడు. 'కృష్ణా! నువ్వు అతిలోక సుందరుడవు. లీలామానుష స్వరూపుడవైన నిన్ను శ్రీదేవి తనకు తానై వరించింది. అదే నీ త్రిజగన్మోహనత్వానికి నిదర్శనం. అందుకే రుక్మిణి నీ చరణదాసి అయింది. అంతఃపురంలో వుండే తాను నిన్ను చేరుకునే ఉపాయం కూడా ఆ కన్యే చెప్పింది' అని రుక్మిణి పంపిన సందేశాన్ని అగ్నిద్యోతనుడు శ్రీకృష్ణుడికి అందచేశాడు.

'స్వామీ! నువ్వు వచ్చి శిశుపాల, జరాసంధులను ఓడించి నన్ను నీ దాన్నిగా చేసుకో. చతురంగ బలాలతో రా. అయితే నా బంధువులకు చేటు వాటిల్లకుండా వుండేందుకు ఒక ఉపాయం చెబుతాను. రేపు వివాహమనగా ముందురోజు వధువు స్వయంగా వెళ్ళి కులదేవత అయిన 'సర్వ మంగళ'ను కొలవటం మా ఆచారం. మా కులదేవతను సేవించేందుకు నన్ను మావాళ్ళు నగరం వెలుపలికి తీసుకువెడతారు. అక్కడికి నువ్వు వచ్చి నన్ను చేపట్టు మాధవా' అని నల్లనయ్యను వేడుకుంది రుక్మిణి.

కృష్ణుడికి పరిస్థితి అర్థమైంది.

వెంటనే రథసారథి దారుకుడికి కబురంపాడు. బలరాముడ్నీ, మరి కొందరు యాదవ ప్రముఖుల్నీ తోడు తీసుకొని, శైబ్య, సుగ్రీవ, మేఘ పుష్ప, బలాహక అనే నాలుగు గుర్రాలున్న రథమెక్కి ఒకే ఒక రాత్రిలో విదర్భ రాజధాని కుండినపురం చేరుకున్నాడు.

అప్పటికే వరుడు శిశుపాలుడు రథగజహయాదులతో, చతురంగ బలాలతో, బంధుమిత్రులతో కుండినపురం చేరుకున్నాడు. జరాసంధ, దంతవక్త్ర, సాల్వ, విడూరథ, పౌండ్రకాదులు కూడా శిశుపాలుని పక్షాన తమతమ సేనలతో విడిదికి తరలి వెళ్ళారు. కుండిన నగరమంతా ఆ సమయంలో ఇసుకవేస్తే రాలకుండా వుంది.

రుక్మిణికి మనస్సు మనస్సులో లేదు. అంతవరకూ స్వామి నుంచి జవాబుగా తనకు ఏమీ చేరకపోవడంతో రుక్మిణి కలవరపడింది. 'యాదవచంద్రుడు ఏమనుకున్నాడో! సందేశం పట్టుకువెళ్ళిన అగ్నిద్యోతనుడు అసలు స్వామిని చేరాడో లేదో! మధ్యదారిలో మార్గాయాసానికి గురి కాలేదు కదా' అని పరిపరి విధాల కలత చెందింది.

అంతలోనే అగ్నిద్యోతనుడు వచ్చాడు. కుండిననగరానికి బలరామకృష్ణులు వచ్చారనీ, కృష్ణుడు ఆమెను రాక్షస వివాహం చేసుకుంటాడనీ చల్లని కబురు చెప్పాడు.

రుక్మిణి మనసు కుదుట పడింది.

అగ్నిద్యోతనుడికి కృతజ్ఞతలు చెప్పుకుంది.

సుముహూర్తం సమీపించింది. గౌరీదేవిని పూజించేందుకు రుక్మిణిని నగరం వెలుపలి సర్వమంగళ ఆలయానికి తీసుకువెళ్ళారు. అక్కడ ఆలయంలో వున్న ఆది దంపతులకు ఆమె పూజలు చేసింది. 'శ్రీహరిని భర్తగా పొందే అదృష్టం కలుగచేయి తల్లీ' అని గౌరిదేవికి మొక్కుకుంది.

శ్రీకృష్ణుడ్ని మనసులో నిలుపుకుని ఆలయంనుంచి బయటకు వచ్చింది. ద్వార సమీపంలో శ్రీకృష్ణుడి దివ్యరథం కనిపించింది. దాన్ని చూసి ఆమె ఆనందంతో, సిగ్గుతో తల వంచుకుని, మెల్లగా అటు అడుగులు వేసింది. శ్రీకృష్ణుడు రథం దిగివచ్చి తనకు నలువంకలా వున్న రాజులెవ్వరినీ లక్ష్య

పెట్టకుండా ముందుకు వెళ్ళి రుక్మిణీదేవి చెయ్యి పట్టుకుని ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. రథంలో ఎక్కించుకున్నాడు. విజయశంఖాన్ని పూరించి రథాన్ని ద్వారకానగరంవైపు పరుగు తీయించాడు.

జరాసంధుడు అది చూశాడు.

అతనికి అమితమైన ఆగ్రహం కలిగింది. జరాసంధుడూ, అతని స్నేహితులూ సైన్యాలను తరలించుకుని యాదవవీరులను తరుముకుంటూ వెళ్ళారు. ఇరుపక్షాలకూ మధ్య ఘోర యుద్ధం జరిగింది. కృష్ణుడు శరవర్షం కురిపించాడు. జరాసంధుడి రథాలను కూల్చాడు. మత్తగజాలను సంహరించాడు. గుర్రాలను వధించాడు. సైనికులను హతమార్చాడు. అదంతా తెలిసిన రుక్మి తన చెల్లెలిని కృష్ణుడు అపహరించుకుపోవటం సహించలేక ఒక అక్షౌహిణి బలంతో యాదవుల మీదికి ఉరికాడు. అప్పుడు కృష్ణుడు రుక్మి కోదండాన్ని ఖండించాడు. రథాన్ని కూల్చాడు. అతడ్ని తీవ్రంగా గాయపరిచాడు. నిరాయుధుడై నేలపై నిలిచిన రుక్మికి సంభవించబోయే ఆపదను రుక్మిణి అర్థం చేసుకుంది. హడలిపోయింది. శ్రీకృష్ణుని పాదాల మీద పడి తన అన్నకు ప్రాణభిక్ష ప్రసాదించమని వేడుకుంది.

శ్రీకృష్ణుడు మనోహారిణి ప్రార్థన మన్నించి రుక్మిని సంహరించకుండా వదిలేసాడు. అతడ్ని బంధించి అతని తలకట్టు సగం తీసి మీసాలు కొంతవరకు కోసి విడిచిపెట్టాడు. రుక్మి తనకు జరిగిన పరాభవానికి అమితంగా విచారపడి, శ్రీకృష్ణుని గెలిచిగానీ కుండిన నగరంలో ప్రవేశించనని ప్రతిజ్ఞ చేసి, అప్పటి నుంచి భోజకటంలో వుండిపోయాడు. ద్వారకలో రుక్మిణీకృష్ణుల వివాహం వైభవంగా జరిగింది.

# సత్రాజిత్తు

పూర్వం సత్రాజిత్తు అనే రాజుండేవాడు. సూర్యునితో మంచి స్నేహం వుండేదాయనకు. ఆ కారణంగా స్యమంతకమనే దివ్యమణిని సూర్యుడు ఆయనకు కానుకగా ఇచ్చాడు.

ఆ స్యమంతకం ఎవరిదగ్గరుంటే వారికి రోజుకి ఎనిమిది బారువుల బంగారం ఇస్తుంది. ఆ మణిని ఏ రాజు పూజిస్తే ఆ రాజు రాజ్యంలో అతివృష్టిగాని, అనావృష్టిగాని, ఆకలి బాధలుగాని వుండవు. అదెప్పుడూ సూర్యతేజంతో ప్రకాశిస్తూ వుంటుంది గనుక వ్యాధులనేవి ఆ రాజ్యం దరిదాపులకే రావు. సత్రాజిత్తు ఒకసారి ఆ దివ్యమణిని ధరించి ద్వారావతికి వెళ్ళాడు. ఆయనను చూసిన ప్రజలందరూ సాక్షాత్తూ సూర్యభగవానుడే కృష్ణుడి దర్శనార్థం వస్తున్నాడనుకుని అదేమాట కృష్ణుడితో అన్నారు.

వస్తోందెవరో కృష్ణుడికి తెలియకపోతే గదా! నవ్వుకున్నాడాయన. వెలుగులు చిమ్ముతూ వస్తున్నది సూర్యుడు కాదనీ, స్యమంతకమణిని ధరించి వస్తున్న సత్రాజిత్తు సూర్యుడికి మిత్రుడనీ వాళ్ళకి వివరంగా చెప్పాడు.

ఒకప్పుడు శ్రీకృష్ణుడు ఆ మణిని యాదవరాజైన ఉగ్రసేనునికి ఇవ్వవలసిందిగా సత్రాజిత్తును కోరాడు. సత్రాజిత్తు ఇవ్వనన్నాడు.

సత్రాజిత్తుకు ఒక సోదరుడున్నాడు. అతని పేరు ప్రసేనుడు. అతనొకసారి స్యమంతకమణిని ధరించి అడవికి వేటకు వెళ్ళాడు. అడవిలో వున్న ఒక

సింహం ప్రసేనుడ్ని సంహరించి అతని మెడలోని మణిని తీసుకుని పారిపోయింది.

అది జాంబవంతుడు చూశాడు. సింహాన్ని పట్టుకుని దాన్ని వధించి దాని దగ్గరున్న మణిని ఆయన తీసుకున్నాడు. తన కూతురు పడుకునే ఉయ్యాల తొట్టెకు ఆ స్యమంతకమణిని ఆటవస్తువుగా అమర్చాడు.

అడవికి వెళ్ళిన ప్రసేనుడు ఎంతకీ తిరిగి రాకపోవడంతో సత్రాజిత్తు కలవరపడ్డాడు. స్యమంతకమణిని ఉగ్రసేనుడికి ఇమ్మన్న కృష్ణుడే మణికోసం ఆశపడి తన తమ్ముడ్ని సంహరించివుంటాడని అపోహపడ్డాడు. ఆ మాట ఆనోటా ఈనోటా శ్రీకృష్ణునికి చేరింది. కృష్ణుడు ఆ అపవాదును తొలగించు కోవాలనుకుని వెంటనే కొందరు మిత్రులను వెంటబెట్టుకుని ప్రసేనుడ్ని వెదికేందుకు అడవికి బయలుదేరాడు.

ఒకచోట చచ్చిన గుర్రం కనిపించింది.

దానికి కొద్దిదూరంలో ప్రసేనుడి శవం దొరికింది.

ఇంకా కొంచెం ముందుకు వెళ్ళాడు.

అక్కడ చచ్చిపడివున్న సింహం కనిపించింది.

అక్కడ సింహాన్ని సంహరించిన జాంబవంతుడి పాదముద్రలు కనిపించాయి.

వాటి వెంటే వెళ్ళాడు.

ఒక గుహ కనిపించింది.

కృష్ణుడు అక్కడ ఆగాడు. ఆగి తన వాళ్ళందరినీ అక్కడ వుండమని ఆదేశించి తనొక్కడే గుహలోపలికి వెళ్ళాడు.

అక్కడ ఒక ఊయలకు కట్టిన స్యమంతకాన్ని చూశాడు. దాన్ని తీసుకోబోయేసరికి గుహాంతర్భాగంలో వున్న జాంబవంతుడు పరుగు పరుగున అక్కడకు వచ్చాడు. వచ్చి కృష్ణునితో తలపడ్డాడు.

ఇద్దరి మధ్యా భీకరంగా పెద్ద యుద్ధం జరిగింది. ఒకరినొకరు పిడికిళ్ళతో పొడుచుకున్నారు. ఒకరిపై మరొకరు పెద్దపెద్ద బండరాళ్ళు విసురుకున్నారు. శస్త్రాస్త్రాలతో బాధించుకున్నారు. పీడించుకున్నారు. అలా ఇరవై ఎనిమిదిరోజులపాటు సాగింది యుద్ధం. అప్పటికి శ్రీకృష్ణుని ముష్టి ప్రహరణల వల్ల జాంబవంతుని శరీరం నుగ్గునుగ్గయింది. ప్రాణాలు కడబట్టాయి. తను పోట్లాడుతోంది సామాన్యుడితో కాదన్న విషయం అప్పటికి తెలిసొచ్చింది. కృష్ణుడి కాళ్ళమీద పడ్డాడు.

'నాయనా! నువ్వెవరో తెలిసింది. నువ్వు మమ్మేలే జగత్పతివి, జగత్పితవు, జగదోద్ధారకుడవు, లోకాధినాథుడవని తెలీక నీతో యుద్ధానికి తలపడ్డాను. నా అజ్ఞానాన్ని తోసిపుచ్చి నన్ను మన్నించు' అని ప్రార్థించాడు.

యాదవేంద్రుడు ప్రసన్నుడయ్యాడు. తన అభయహస్తంతో ఆయన శరీరాన్ని ప్రేమగా నిమిరాడు. దాంతో జాంబవంతుడి బాధలన్నీ తొలిగిపోయాయి. భయాలన్నీ తరిగిపోయాయి. శరీరానికి కొత్తశక్తి వచ్చినట్టయింది.

'భల్లూకేశ్వరా! ప్రసేనుడ్ని చంపి ఈ మణిని మేము తీసుకున్నామని సత్రాజిత్తు ప్రచారం చేస్తున్నాడు. ఆ నిందను తప్పించుకునేందుకే నేను నీతో యుద్ధం చేయవలసి వచ్చింది' అన్నాడు కృష్ణుడు.

ఆ మాట వినగానే జాంబవంతుడు తన కుమార్తె జాంబవతినీ, మణినీ ఆయనకు కానుకగా సమర్పించుకున్నాడు.

గుహలోకి వెళ్ళిన కృష్ణుడు ఎన్నాళ్ళకీ తిరిగి రాకపోయేసరికి ఆయన వెంట వచ్చినవారు ఆయనకు ఏదో అపాయం సంభవించి వుంటుందనుకున్నారు. ద్వారకకు వెళ్ళి దేవకీవసుదేవులకు, రుక్మిణీదేవికీ తమ సందేహాన్ని విన్నవించారు.

వారందరూ అమితంగా దుఃఖించారు.

ద్వారకావాసులకీ వార్త తెలిసింది.

నల్లనయ్య క్షేమంగా తిరిగి రావాలని కోరుతూ వారంతా పూజలు చేశారు.

అంతలో శ్రీకృష్ణుడు స్యమంతకమణితోనూ, జాంబవతితోనూ వారికి దర్శనం ఇచ్చాడు.

ద్వారకావాసులు, దేవకీ వసుదేవులు, రుక్మిణి పరమానందభరితులయ్యారు. ఆ తరువాత శ్రీకృష్ణుడు సత్రాజిత్తును పిలిపించి తనకు స్యమంతకమణి లభించిన వృత్తాంతమంతా ఆయనకి చెప్పాడు. ఆయన మణిని ఆయనకిచ్చాడు.

సత్రాజిత్తు కృష్ణుడు చెప్పినదంతా విని పశ్చాత్తాపపడ్డాడు. అనవసరంగా కృష్ణుని మీద నింద వేశామని కుమిలిపోయాడు. చేసిన తప్పును సరిదిద్దుకునేందుకు ఆయన స్యమంతకాన్నీ, తన కుమార్తె సత్యభామనూ కృష్ణుడికి సమర్పించుకున్నాడు. కృష్ణుడు స్యమంతకం తనకు అవసరం లేదని చెప్పి సత్యభామను మాత్రం స్వీకరించాడు.

# రాధాకృష్ణులు

శ్రీకృష్ణుడికి రుక్మిణి కాక జాంబవతి, సత్యభామ, కాళింది, మిత్రవింద, భద్ర, నాగ్నజితి, లక్షణ అనే ఏడుగురు భార్యలున్నారు. వీళ్ళని అష్టపత్నులు, ధర్మపత్నులు అంటారు. వీళ్ళు కాక మరో పదహారు వేలమంది కన్యలు కూడా మాధవుడ్ని 'మా ధవుడు' అన్నారు.

శ్రీకృష్ణుని ధర్మపత్నులందరూ ఒక ఎత్తు-రాధాదేవి మాత్రం ఒక ఎత్తు. ఆమెకూ, కృష్ణుడికీ ఏ విధమైన భేదమూ లేదు. కృష్ణుడే రాధ, రాధే కృష్ణుడు. వాళ్ళిద్దరికీ పెళ్ళి చేసినవాడు చతుర్ముఖుడు.

రాధాదేవి కన్యాకుబ్జ రాకుమారి. వృషభానుడి కుమార్తె. వృషభానుడు పూర్వజన్మలో నృగమహారాజు కుమారుడైన సుచంద్రుడు.

సుచంద్రుడి భార్య కళావతి. భార్యను వెంటపెట్టుకుని సుచంద్రుడు గోమతీతీరానికి వెళ్ళి అక్కడ ఒక ఆశ్రమం ఏర్పరుచుకుని బ్రహ్మదేవుని గురించి పన్నెండు సంవత్సరాలు తీవ్రమైన తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చి బ్రహ్మ ప్రత్యక్షమై 'నీ కోరిక ఏమిటి?' అని అడిగాడు. సుచంద్రుడు ఏ విధమైన ఆలోచన లేకుండా 'నాకు మోక్షం ప్రసాదించు' అని అర్థించాడు. బ్రహ్మ సరేనన్నాడు. కాని ఆ వరం వల్ల తనకు భర్తృవియోగం సంభవిస్తుందని కళావతి గ్రహించి తనకు అన్యాయం జరగకుండా చూడవలసిందని విరించిని వేడుకుంది. ఆమె చతుర్మఖుడు అభ్యర్ధనను మన్నించిన చతుర్ముఖుడు వారు ద్వాపర

యుగాంతాన తిరిగి దంపతులయేటట్టూ, ఒక కుమార్తె కలగగానే వారిద్దరికీ మోక్షం లభించేటట్టూ అనుగ్రహించాడు.

ఆ తరువాత కళావతి కన్యాకుబ్జ దేశాన్ని పాలించే భలంధన మహారాజు కుమార్తెగా యజ్ఞకుండంలో ఉద్భవించింది. సుచంద్రుడు సురభానుడికి కొడుకుగా పుట్టి వృషభానుడనే పేరుగల గొప్ప వీరుడయ్యాడు. అయోనిజ అయిన కన్యాకుబ్జ రాజపుత్రీ, వృషభానుడూ బ్రహ్మదేవుని నిర్ణయం ప్రకారం భార్యాభర్తలైనారు. వారికి ఒక కుమార్తె కలిగింది. ఆమెకు తల్లిదండ్రులు 'రాధ' అని నామకరణం చేశారు. త్రిలోకసంచారి నారద మహర్షి ఒకసారి వృషభానుడ్ని కలసి, ఆయన కుమార్తె రాధాదేవికి తగిన భర్త ఒకేఒకడున్నాడని, ఆయన పేరు శ్రీకృష్ణుడని చెప్పాడు. అలాగే నందుడ్ని కలిసి 'మీ నల్లనయ్యకు తగిన భార్య వృషభానుని ఇంట్లో రాధగా పెరుగుతోంద'ని కూడా చెప్పాడు. నారద మహర్షి సలహా ప్రకారం ఒకసారి వృషభానుడు రాధను తీసుకుని భాండీర వనానికి వెళ్ళాడు. రాధ ఆ వనంలోకి అడుగు పెట్టగానే కృష్ణయ్య గుక్కపట్టి ఏడవటం మొదలుపెట్టాడు. నల్లనయ్య ఏడుపు మానిపించటం ఎవరికీ సాధ్యం కాకపోయింది. అంతలో రాధాదేవి వాళ్ళదగ్గరకు వెళ్ళి కృష్ణయ్యను చేతుల్లోకి తీసుకుంది. వెంటనే కృష్ణయ్య ఏడుపు మాని కిలకిలా నవ్వాడు. అప్పుడు నందుడికి నారద మహర్షి చెప్పిన మాటలు స్ఫురణకు వచ్చి 'వీళ్ళిద్దరికీ ఏదో పూర్వజన్మ సంబంధం వుండివుంటుంది' అనుకున్నాడు. అంతలో భూదేవీ, చతుర్ముఖుడూ అక్కడ ప్రత్యక్షమయ్యారు. చతుర్ముఖుడు అప్పటికప్పుడే ఒక మండపాన్ని ఏర్పాటు చేసి రాధాకృష్ణులకు వేదోక్తంగా వివాహం జరిపించాడు.

రాధాదేవిని గోలోకంలో లీలావతి అని, వైకుంఠంలో శ్రీమహాలక్ష్మి అని పిలుస్తారు.

రాధాదేవిది అనన్యమైన భక్తి. శ్రీకృష్ణుడ్ని విడిచి ఆమె క్షణం కూడా వుండలేదు.



అటువంటి రాధాదేవిని పరీక్షించాలన్న ఆలోచన ఒకసారి మాధవుడికి కలిగింది. వెంటనే ఆయన ఒక గోపస్త్రీ వేషం ధరించి రాధాదేవిని కలుసుకున్నాడు.

మాయాగోపికను చూడగానే రాధాదేవికి ఆమె మీద అభిమానం కలిగింది. ఆమెకు అతిథి మర్యాదలు చేసి 'మీ పేరేమిటి? మీరెక్కడ వుంటారు?' అని రాధ అడిగింది. 'మా వూరు నందపురి. నన్ను గోపదేవి అంటారు' అని మాయాగోపిక చెప్పింది.

ఆ తరువాత వాళ్ళిద్దరూ చాలాసేపు ముచ్చట్లాడుకున్నారు. చీకటి పడబోతుండగా 'మళ్ళీ రేపు వస్తాను' అని చెప్పి మాయగోపిక వెళ్ళిపోయింది.

అన్నమాట ప్రకారం మాయగోపిక మరునాడు రాధాదేవి దగ్గరకు వెళ్ళి నల్లనయ్యను గురించి చాలా పరుషంగా మాట్లాడింది. 'పొద్దున నేను గోవర్ధనగిరి

దగ్గర పెరుగు అమ్ముకునేందుకు వెళుతుంటే శ్రీకృష్ణుడు అడ్డు తగిలి నా చెయ్యి పట్టుకున్నాడు. పెళ్ళి చేసుకోమని బలవంతం చేశాడు. 'చేసుకోక చేసుకోక నీబోటి నల్లవాడ్నీ, గొల్లవాడ్నీ చేసుకోవాలా' అని నేనంటే కోపంతో నా పెరుగుకుండ కాస్తా పగులకొట్టాడు. పెరుగంతా తాగేశాడు. వట్టి అల్లరివాడు. అలాంటివాడ్నీ పెళ్ళి చేసుకుని ఎవరు మాత్రం సుఖ పడతారు' అంది. ఆ మాటలకు రాధాదేవి చాలా బాధపడింది.

'అమ్మా? నువ్వు ఆ మహానుభావుడ్ని తూలనాడటం భావ్యం కాదు. ధర్మాన్ని స్థాపించేందుకు, అధర్మాన్ని అంతం చేసేందుకు, శిష్టులను రక్షించటానికి, దుష్టులను శిక్షించటానికి ఉద్భవించినవాడాయన. అతను నల్లనివాడన్నావు. ఆ నల్లనయ్య అనుగ్రహం వల్లనే మహర్షులు తమలో వున్న చీకటితెరలు తొలగించుకోగులుగుతున్నారు. అది నువ్వు గ్రహించినట్లు లేదు. శ్రీ మహాలక్ష్మిని హృదయాన నిలుపుకున్న ఆ పరిపూర్ణుడు, తనకు తానై నిన్ను పెళ్ళిచేసు కుంటానంటే అదేదో మహాపచారంగా భావిస్తున్నట్టున్నావు. అంతటి అపురూపమైన అదృష్టం అందరికీ లభిస్తుందా? ఎన్నివేల జన్మల తపస్సో వుంటే కానీ వేణుగోపాలుడి అనుగ్రహం లభించదు....' అంటూ ఉండగానే రాధాదేవి కళ్ళు కన్నీటి కాలువలయ్యాయి. కంఠం కంపించిపోయింది. అరచేతుల్లో ముఖాన్ని కప్పుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. మాయాగోపిక రూపంలో వున్న శ్రీకృష్ణుడు మందహాసం చేసి ఆమెను దగ్గరకు తీసుకుని గుండెలకు హత్తుకున్నాడు.

రాధ ఒళ్ళు పులకరించింది.

ఆమెకు దివ్యానుభూతి కలిగింది.

'కృష్ణా! కృష్ణా' అంటూన్న ఆమె చేతులు రెండూ నల్లనయ్య కంఠాన్ని కలువదండలా చుట్టేశాయి.

# ఘంటాకర్ణుడు

శ్రీకృష్ణుడికి అష్టపత్నులతోపాటు మరో పదహారు వేలమంది భార్యలున్నారు. వారికి ఒక్కొక్కరికి పదిమంది చొప్పున కొడుకులు పుట్టారు. వారందరిలోనూ రుక్మిణీదేవి కుమారుడయిన ప్రద్యుమ్నుడూ, జాంబవతి కుమారుడైన సాంబుడూ ప్రసిద్ధులు.

రుక్మిణీదేవి అన్నగారైన రుక్మికి రుక్మవతి అనే కూతురు వుంది. ఆ అమ్మాయి ప్రద్యుమ్నుడ్ని వరించి పెళ్ళి చేసుకుంది. ఆ రుక్మవతీ ప్రద్యుమ్నులకు అనిరుద్ధుడు పుట్టాడు. అనిరుద్ధుడి భార్య పేరు రోచన. వాళ్ళకి వజ్రుడు జన్మించాడు. యాదవ వినాశనం తర్వాత ఆ వంశంలో మిగిలినవాడు వజ్రుడు ఒక్కడే.

ప్రద్యుమ్నుడు కలిగాక శ్రీకృష్ణుడు ఒకసారి పూర్వం తను తపస్సు చేసుకున్న బదరీవనానికి వెళ్ళాడు. అప్పుడు నల్లనయ్యను సందర్శించుకునేందుకు భరద్వాజుడు, వాల్మీకి, వ్యాసుడు, గౌతముడు, కశ్యపుడు, కణ్వుడు, పరాశరుడు మొదలయిన మహర్షులందరూ ఆ వనానికి వెళ్ళారు. శ్రీకృష్ణుడు వాళ్ళతో ఆ రోజంతా గడిపాడు. ఆ తర్వాత అర్ధరాత్రివేళ బయలు దేరి శ్రీకృష్ణుడు గంగకు ఉత్తరంగా వెళ్ళి అక్కడ కొంతసేపు సమాధి స్థితిలో వుండి తిరిగి వనసందర్శనకు బయలుదేరాడు. ఆ సమయంలో ఆయనకు కొన్ని అడవి జంతువులు 'జై జయ గోపాల! జై జయ గోవింద!' అని అరవడం వినిపించింది. ఆ తర్వాత కొంతసేపటికి బాణాలు గుచ్చుకుని విలవిలలాడుతూ పులులూ, దుప్పులూ,

అడవి పందులూ అటుగా పరుగెత్తాయి. వాటి వెనకాలే వాటిని తరుముకుంటూ కొందరు కిరాతకులు వచ్చారు. రక్తంకారుతున్న ఆయుధాలతో, ఎర్రని కళ్ళతో చూసేందుకు భయంకరంగాఉన్న వాళ్ళుకూడా హరిసంకీర్తన చేస్తూండడం శ్రీకృష్ణుడికి ఆశ్చర్యం కలిగించింది.

అంతలో పిశాచాల నాయకుడయిన ఘంటాకర్ణుడు కృష్ణుని సమీపించి, దాటివెళ్ళబోతూ ఆగి తేరిపార చూశాడు.

'మీరెవరు? ఎక్కడికి ఇలా వెడుతున్నారు?' అని శ్రీకృష్ణుడు ఘంటాకర్ణుడ్ని అడిగాడు.

'మేము మాధవుడ్ని చూసేందుకు మధురా నగరం వెళుతున్నాం' అని గొప్పగా చెప్పాడు ఘంటాకర్ణుడు.

కృష్ణుడు నవ్వి వూరుకున్నాడు.

ఘంటాకర్ణుడు కృష్ణునికి ఇంకా కొంచెం దగ్గరగా వెళ్ళి 'నాయనా! నువ్వెవరివో నాకు తెలియదు. కాని నీ రూపు, నీ తేజం, నీ మాట నన్ను ఆకట్టుకున్నాయి. దయతలచి నా ఆతిథ్యాన్ని స్వీకరించు' అని తన బాణానికి గుచ్చివున్న మాంసపు ముక్కను ఆయనకు అందించాడు. నల్లనయ్య వద్దనకుండా ఆ మాంసం ముక్కను స్వీకరించి 'జీవహింస ఎందుకు చేస్తున్నావు?' అని ఘంటాకర్ణుడ్ని అడిగాడు.

'స్వామీ! ఏ పాపం చేశామో మాకీ జన్మ లభించింది. ఈ పాపిష్టి జన్మనుంచి తొలగిపోవాలనే మేమూ కోరుకుంటున్నాం. అందుకోసం మేము చెయ్యని పూజలు లేవు. ఇప్పుడు మేము జంతువులను వేటాడటం కూడా విష్ణు పూజ కోసమే. మా మనసుల్లో మాధవుని నిలుపుకున్నాం. ఆయననే సదా స్మరిస్తాం. మధుర మాకు ప్రాణం. కృష్ణయ్యే మాకు సర్వం. ఆయనను చూడాలనే ఇప్పుడు పోతున్నాం. మాధవుడు భక్తసులభుడని అందరూ అంటారు. అందుకని మాది ఏ వృత్తి అయినా ఆయనను భక్తి మార్గాన చేరుకోదలిచాం. ఆ అయ్య కనిపిస్తే

చెబుతాం –మాకీ పిశాచాల రూపం వదిలించకపోతే మేము నీ జట్టు వుండమని. ఈ బతుకులకు తగ్గట్టుగా జీవహింస చేస్తున్నాం. ఇది దోషం కాదనుకుంటాను' అన్నాడు ఘంటాకర్ణుడు వినయంగా. ఆ మాటలు విని శ్రీకృష్ణుడు విస్మితుడయ్యాడు. ప్రేమగా ఘంటాకర్ణుడ్ని దగ్గరకు తీసుకున్నాడు. తన దివ్య రూపంతో అతని ముందు నిలిచాడు.

ఘంటాకర్ణుడు ఆయనను అనేక విధాల స్తుతించాడు. తన మనస్సులో రూపు కట్టిన దివ్యమంగళస్వరూపాన్నే తన ఎదుట వున్న స్వామిలో దర్శించుకుని ఘంటాకర్ణుడు సంతోషంతో తలమునకలయ్యాడు.

నల్లనయ్య ఘంటాకర్ణుడి శరీరాన్ని స్పృశించాడు.

వెంటనే అతనికి దివ్యదేహం లభించింది. అతని కోరిక మేర శ్రీకృష్ణుడు అతనికి నితాంతభక్తిని ప్రసాదించాడు.

# పౌండ్రకుని గర్వభంగం

**కా**శీ దేశాన్ని పౌండ్రకుడు అనే రాజుగారు పరిపాలిస్తుండేవారు. ఆయన ఉట్టి గర్విష్టి. దానికి తోడు రాజుగారి ప్రాపకం సంపాదించుకునేందుకు ఆయన అనుచరులు కొందరు 'నువ్వు వాసుదేవుడవు. నువ్వీ ప్రపంచాన్ని ఉద్ధరించటానికి అవతరించావు. నువ్వు లేక ఈ సృష్టి లేదు' అని పదేపదే పొగుడుతుండేవారు.

పిచ్చిమారాజు పౌండ్రకుడు అదంతా నిజమే అనుకుని పొంగిపోతుండేవాడు. రానురాను తానే వాసుదేవుడినన్న అభిప్రాయం ఆయనలో బలపడి పోయింది. ఒకసారి ఒక దూతను పిలిచి 'నేను పృథ్వీపతిని, సకల చరాచర జీవకోటిని రక్షించే లక్ష్యంతోనే నేను అవతరించాను. నేను కరుణించే దేవుడ్ని. అందుకనే నన్ను అందరూ వాసుదేవుడని పిలుస్తున్నారు. కాని, వ్రేపల్లెలో ఒక గొల్లపిల్లవాడు నా పేరు పెట్టుకుని, నా చిహ్నాలను ధరించి, నన్ను అనుకరిస్తూ ప్రజలను మోసం చేస్తున్నట్టు తెలుస్తోంది. అది నాకు చాలా అవమానకరంగా వుంది. అతను ఇప్పటికైనా తన తప్పు తెలుసుకుని పేరుమార్చుకుని నా చిహ్నాలైన శంఖుచక్రాలను విడిచిపెట్టి నన్ను ఆశ్రయించటం మంచిది. మనం చెప్పినట్టు చేస్తే అతడ్ని క్షమించడానికి నేను సిద్ధంగా వున్నాను. లేదా అతను నాతో పంతానికి దిగితే నేను అతనితో యుద్ధం చేయటం, అతడ్ని కాలరాయటం

తథ్యం. నువ్వు వెళ్ళి ఆ యాదవడింభకుడ్ని కలుసుకుని నా ఆజ్ఞ అతనికి చెప్పు' అన్నాడు.

ప్రభువు ఆజ్ఞమేరకు దూత ద్వారావతికి వెళ్ళాడు. నందయశోదలు, ఇతర యాదవ ప్రముఖులతో కొలువుతీరివున్న శ్రీకృష్ణుడి దగ్గరకు వెళ్ళి మంచిచెడ్డలు ఆలోచించకుండా అందరి సముఖాన పౌండ్రక మహారాజు పేలమన్నట్టు ప్రేలాడు. పౌండ్రకుని గర్వోక్తులు విన్న శ్రీకృష్ణుడు అలవోకగా 'మీ ప్రభువుల వారిని యుద్ధానికి సిద్ధంగా వుండమను. ఎవరు ఎవరిని శరణు వేడుతారో అప్పుడు తెలుస్తుంది నీకు' అన్నాడు.

ఆ వెంటనే దూత తన దేశానికి తిరిగివెళ్ళి పౌండ్రకునికి జరిగినదంతా చెప్పాడు.

పౌండ్రకుడు ఉగ్రుడయ్యాడు.

యుద్ధానికి సిద్ధమయ్యాడు.

శ్రీకృష్ణుడు రణోత్సాహంతో కాశీనగరం చేరుకున్నాడు. పౌండ్రకుడు రెండు అక్షౌహిణుల బలంతో కృష్ణుడి మీదకు వెళ్ళాడు. కృత్రిమ శంఖుచక్రగదా ఖడ్గాలతో, వింటితో, శ్రీవత్సంతో, కౌస్తుభమణితో, వనమాలికతో గరుడధ్వజమెత్తిన రథంఎక్కి తనమీదికి వస్తున్న పీతాంబరధారి పౌండ్రకుడ్ని చూసి, మోహనవంశి పకపక నవ్వాడు.

పౌండ్రకుడు అచ్యుతుడి మీదకు రకరకాల ఆయుధాలు ప్రయోగించాడు.

కోపంతో కంపించిన గోవిందుడు పాంచజన్యం పూరించాడు. దివ్యాస్త్రాలు సంధించాడు. రణరంగాన్ని క్షణాలమీద నెత్తుటిమయం చేశాడు. ఆ తరువాత నల్లనయ్య ప్రయోగించిన చక్రాయుధం వెలుగులు విరజిమ్ముతూ దూసుకువెళ్ళి పౌండ్రకుని తలను నరికింది.

పౌండ్రక వాసుదేవుడు నేలకూలాడు.

మాత్సర్యంతోనైనా నిత్యం శ్రీకృష్ణుని చిహ్నాలు ధరించి అనుక్షణం ఆయనను స్మరించుకుంటూ ఉండడంవల్ల పౌండ్రకుడికి ముక్తి లభించింది.

తండ్రిని సంహరించిన శ్రీకృష్ణుడి మీద పగ తీర్చుకునేందుకు పౌండ్రక వాసుదేవుడి కుమారుడు సుదక్షిణుడు మహేశ్వరుడ్ని ఆరాధించాడు. ఆ తరువాత అగ్నిదేవుడ్ని ఉపాసించి, అతిభీకరంగా వుండే ఒక కృత్యను కల్పించి ద్వారావతి పైకి పంపాడు.

అది గ్రహించి శ్రీకృష్ణుడు చక్రాయుధాన్ని వదిలాడు. ఆ చక్రాయుధం కాంతులు చిమ్ముకుంటూ, నిప్పులు కక్కుతూ వెళ్ళి కృత్యతో తలపడింది.

కృత్య నిర్వీర్యమైంది.

ఆ వెంటనే అది వారణాసికి పోయి తనను సృజించిన సుదక్షిణుడ్ని మింగేసింది.

నగరాన్నంతా భస్మం చేసింది.

# కృష్ణుడు – కుచేలుడు

పూర్వం ధర్మవత్సలుడైన ఒక బ్రాహ్మణుడుండేవాడు. ఆయన పేరు కుచేలుడు. చాలా పేదవాడు. బహుకుటుంబీకుడు. లెక్కలేనంతమంది సంతానం. దాంతో ఆయన అనుభవించని దుఃఖం లేదు. అటువంటి స్థితిలో కూడా ఆయన కాని, ఆయన భార్యకాని ఎవరినీ చేయిచాచి ఏమీ అడిగేవారు కాదు. పండో పచ్చికాయో ఏది లభిస్తే అదే తింటూ రోజులు వెళ్ళదీసుకుంటుండేవారు.

శ్రీకృష్ణుడు కుచేలుని చిన్ననాటిమిత్రుడు. సాందీపుని వద్ద ఇద్దరూ కలిసి చదువుకున్నారు. కృష్ణుడుకి కుచేలుడంటే ప్రాణం. ఆయన పట్ల ఎప్పుడూ ఆదరంగా ఉండేవాడు.

కృష్ణుని కథలూ, లీలలూ విన్నప్పుడల్లా కుచేలుడు పరవశించిపోతుండేవాడు. కృష్ణునితో తనకున్న స్నేహం గురించి, సాహచర్యం గురించి కుచేలుడు భార్యకు తరచూ చెబుతుండేవాడు.

ఒకసారి కుచేలుడిభార్య 'పిల్లలు ఆకలితో నకనకలాడుతున్నారు. కన్నీళ్ళతో పెదవులు తడుపుకుంటూ ప్రాణాలు నిలబెట్టుకుంటున్నారు. పుట్టిన పిల్లలకు పట్టెడన్నం కూడా పెట్టలేని దురదృష్టవంతురాలిని. వాళ్ళ కష్టాలను చూడలేక అంటున్నాను–మీ మిత్రుడు కృష్ణుడికి చెప్పుకుంటేనైనా మన బాధలు తీరుతాయేమో! ఒకసారి వెళ్ళి మీ బాల్య సఖుడిని కలవకూడదూ! ఆయన మన ఇక్కట్లు తీరుస్తాడన్న నమ్మకం నాకుంది' అంది.

కుచేలుడు, భార్య చెప్పినదంతా విన్నాడు.

భోగభాగ్యాలకోసం కాకపోయినా సంసారసాగరాన్ని దాటటానికైనా ఆ మహానుభావుడ్ని దర్శించుకు రావడం మంచిదేననుకున్నాడు. కానీ, దేవుడ్ని, పెద్దల్ని, పిల్లల్ని చూసేందుకు వెళ్ళేటప్పుడు వట్టి చేతులతో వెళ్ళకూడదంటారు. మరి కృష్ణభగవానునికిచ్చేందుకు తన దగ్గరేముంది?

ఆ విషయాన్నే భార్యకు చెప్పాడు.

ఇద్దరూ నీరసపడ్డారు.

ఇంతలో ఆమె పిల్లల్లో ఒకడు దోసెడు అటుకులతో లోపలికి వచ్చాడు. ఎక్కడివిరా అని అడిగితే ఆటలో గెలుచుకున్నానన్నాడు.

ఆ అటుకుల్ని చూడగానే ఆమెకు మెరుపులాంటి ఆలోచన వచ్చింది. కాసిని అటుకుల్ని పిల్లలకు పెట్టి మిగిలినవి భర్త ఉత్తరీయం కొంగులో మూటకట్టింది. వాటిని తీసుకుని కుచేలుడు ద్వారావతికి వెళ్ళాడు. తీరా అక్కడికి వెళ్ళాక కృష్ణుడ్ని ఎలా కలుసుకోవటం అన్న సందేహం కలిగింది. వీధిన పోతున్న ఒక పెద్దమనిషిని ఆపి అడిగాడు. ఆయన నవ్వుతూ 'అయ్యా! ఆయనను దర్శించుకోవడం అంత సులభంగా జరిగే పని కాదు. ఆయనకు అష్టపత్నులే కాకుండా మరో పదహారువేలమంది ఇష్టసఖులున్నారు. ఆయన ఎప్పుడు ఎక్కడుంటాడో ఎవ్వరికీ తెలీదు. ఆయన ఎప్పటికప్పుడు ఇక్కడే వుంటాడనుకోవటం కూడా పొరపాటే! ఇక్కడా వుంటాడు, అక్కడా వుంటాడు. ఒకేసమయంలో అనేకచోట్ల ఆడుతూ, పాడుతూ వుంటాడు. ఎవరికి వారు ఆయన నావాడంటే నావాడనుకుంటారు. నిజానికి అందరివాడూ ఆయన. అందనివాడు కూడా ఆయనే! జగన్నాటకసూత్రధారి. కర్మధర్మ చక్రవర్తి. లీలామానుషవిగ్రహస్వరూపుడు. ఆయన లీలలే లీలలు. కంటికి కనిపిస్తున్నదంతా ఆయన చిద్విలాసమే' అన్నాడు.

ఆ మాటలు వినగానే కుచేలుడు ఆనందంతో పొంగిపోయాడు. కృషుడ్ని ఊహించుకుంటూ కళ్ళెదుట నిలుపుకుంటూ భక్తి పూర్వకంగా చేతులు జోడించాడు.

తన్మయత్వం నుంచి తేరుకుని కళ్ళు తెరిచేసరికి ఎదుట శ్రీకృష్ణుడు! వంగి ఆయన పాదాలను కళ్ళకద్దుకుందామనే లోపలే కుచేలుడ్ని కృష్ణుడు దగ్గరకు తీసుకుని గాఢాలింగనం చేసుకున్నాడు. తన మందిరానికి తీసుకుపోయి మర్యాదలు చేసి ఆయన్ని తనతోపాటే తన పట్టుపాన్పుమీదనే కూర్చోబెట్టుకుని కుశలప్రశ్నలు వేసాడు. ఆ తరువాత చాలాసేపు చిన్ననాటిముచ్చట్లు చెప్పుకున్నారు. కృష్ణుని సరసన కూర్చున్న కుచేలుడ్ని చూసి అందరూ ఆయన పట్ల అమిత గౌరవం చూపారు.

కుచేలుడు ఆ ఆనందాన్ని అనుభవిస్తుండగా కొంటెకృష్ణుడు ప్రేమగా 'ఇంతకూ నాకోసం నువ్వేం తీసుకొచ్చావు మిత్రమా?' అని చనువుగా అడిగాడు.

కుచేలుడు మాట్లాడలేదు. సిగ్గుతో తలవంచుకున్నాడు. తను తెచ్చిన అటుకుల్ని ఆ మహానుభావుడికి కానుకగా ఇవ్వడానికి ఆయనకు మనసొప్పలేదు. ఇంత ఆదరణ చూపుతున్న బాల్యసఖుడికి తనిచ్చేది పిడికెడుఅటుకులా?

తనలో తను బాధపడ్డాడు.

కేశవుడు అది గ్రహించి కూడా 'నాకోసం ఏమీ తీసుకురాలేదా?' అని మళ్ళీ మళ్ళీ అడిగాడు.

'పేదవాడ్ని, అదృష్టహీనుడ్ని, నీకు నేనేమివ్వగలను కన్నయ్యా?' అన్నట్టు కుచేలుడు ఆయన వంక చూశాడు. ఆయనలా చూస్తూ వుండగానే కృష్ణుడు ఆయన ఉత్తరీయం చెరగునవున్న అటుకుల మూటను విప్పి గుప్పెటలోకి తీసుకుని నోట్లో వేసుకుని 'ఆహా ఏమిరుచి' అంటూ మురిసిపోతూ మరికొన్ని

తీసుకోబోయాడు. అది చూసిన రుక్మిణీదేవి భర్త చేయిపట్టుకుని సున్నితంగా వారించింది. కృష్ణుడు చిన్నగా నవ్వాడు.

ఆ రాత్రికి కుచేలుడు కృష్ణమందిరంలోనే వుండి మరునాడు మిత్రునివద్ద సెలవు తీసుకుని స్వగ్రామానికి తిరిగి వెళ్ళాడు. తోవపొడుగునా కృష్ణుడి ఔదార్యమే గుర్తుకు వచ్చింది. సర్వేశ్వరుడైన శ్రీకృష్ణుడు తనను ఆయన సరసన కూర్చోబెట్టుకోవటం, కొసరి కొసరి తినిపించడం, చిన్ననాటి కబుర్లు చెప్పడం, నిరుపేదనైన తనను గాఢాలింగనం చేసుకోడం ఆయన గొప్పగానీ తన గొప్పేముంది.

'ఎవరి పాదాలను ఆశ్రయించి సేవించి తరించాలని ప్రజలందరూ కోరుకుంటారో ఆ దేవుడే తన కాళ్ళు కడిగి ఆ నీటిని తన శిరస్సున చల్లుకున్నాడు. ఇంతకంటే నాకేం కావాలి? నాకు ఆస్తులక్కర్లేదు, అధికారం అక్కర్లేదు. భోగభాగ్యాలక్కర్లేదు. మణిమయ రత్నహారాలక్కర్లేదు. ఆ మహానుభావుడి దయ వుంటే చాలు' అని పదే పదే అనుకున్నాడు.

అలా అనుకుంటూనే ఊరు చేరుకున్నాడు. కానీ చిత్రం! ఎంత వెదికినా తన ఇల్లు కనిపించలేదు.

తన ఇల్లు వుండాల్సిన చోట ఒక మహా ప్రాసాదం కనిపించింది. రక్షక భటులు కాపలా వున్నారా యింటికి. దారి తప్పి వచ్చానేమోనని అటూ ఇటూ పరికించి చూశాడు.

కొందరు సుందరాంగులు మంగళవాద్యాలతో వచ్చి ఆయనకు స్వాగతం చెప్పి లోపలకు తీసుకువెళ్ళారు. ఇంతలో ఆయన భార్య ఎదురొచ్చింది. సాక్షాత్తూ శ్రీమహాలక్ష్మిలా వుంది. ఆయనకు అర్ఘ్యపాద్యాదులు సమర్పించింది.

అదంతా చూస్తున్న కుచేలునికి కలో వైష్ణవమాయో అనిపించింది.

కృష్ణదర్శనం వల్లే ఇటువంటి మహదైశ్వర్యం తనకు లభించిందని భావించి ఆయనకు శిరసా మనసా వందనం చేశాడు. ఐశ్వర్యం వచ్చింది కదా అని ఎటువంటి మనోవికారాలూ పొందకుండా, అతిశయం లేకుండా, అహంకారం లేకుండా నిర్మలమైన మనస్సుతో కృష్ణదేవుడ్ని సదా ధ్యానిస్తూ కాలం గడిపాడు.

# నరకాసురుడు

పూర్వం నరకుడనే ఒక రాక్షసుడు ప్రాగ్జ్యోతిషపురాన్ని పరిపాలిస్తుండేవాడు. అతను ఒకసారి దేవలోకం మీదకు దండెత్తివెళ్ళి దేవతలను చిరాకు పరిచాడు. మహేంద్రుడ్ని అమరావతి నుంచి తరిమికొట్టి భవనాన్ని స్వాధీనం చేసుకున్నాడు. ఇంద్రుడి సింహాసనాన్ని అధిష్ఠించాడు. అతని నివాసాన్ని దోచుకున్నాడు. దేవకాంతలను చెరబట్టాడు. విశ్వకర్మ కుమార్తెను బంధించాడు. ఎవరికీ కనబడనివీ, ఎవరూ కోరరానివీ అయిన అదితి కుండలాలను అపహరించాడు. వరుణచ్ఛత్రాన్ని వశపరచుకున్నాడు. మణిపర్వతాన్ని స్వాధీనం చేసుకున్నాడు.

అది చాలక తనను తాను లోకేశ్వరునిగా ప్రకటించుకున్నాడు. పధ్నాలుగు లోకాల్లోనూ విశిష్టమైనది ఏది వున్నా అది తన పరం కావాలని రాక్షసులను ఆదేశించాడు. అతని ఆజ్ఞ మేరకు రాక్షసులు పదహారువేల ఒక వందమంది గంధర్వ కన్యలనూ, లక్షమంది యక్షకాంతలనూ, మరెందరో కిన్నెర సిద్ధ సాధ్య విద్యాధర సుందరులనూ బంధించి తెచ్చారు.

నరకాసురుడు ప్రాగ్జ్యోతిషపురం పొలిమేరల్లో నాలుగువైపులా మురాసురుడు, హయగ్రీవుడు, నిసుందుడు, పంచజనుడు అనే నలుగురు వీరులను రక్షకులుగా నియమించాడు.

నరకుడు ఒకసారి బదరీవనానికి వెళ్ళాడు. అక్కడ యజ్ఞయాగాలు చేస్తున్న మునుల దగ్గరకు వెళ్ళి 'యాగాలన్నీ ఇకమీదట నా పేరుమీద జరగాలి' అని

ఆజ్ఞాపించాడు.

మునులు అందుకు అంగీకరించలేదు. మండిపడిన నరకుడు వారి యజ్ఞశాలలను తగులబెట్టించాడు. యజ్ఞవేదికలను నేలమట్టం చేయించాడు. యజ్ఞకుండాలను నాశనం చేయించాడు.

మునిపత్నులను తీవ్రంగా అవమానపరిచాడు.

వశిష్ట, వామదేవ, కపిల, కశ్యప, ధౌమ్య, భరద్వాజమునులు నరకుడి అకృత్యాలు సహించలేక ద్వారావతికి వెళ్ళి శ్రీకృష్ణుడి దగ్గర మొరపెట్టుకున్నారు.

మహేంద్రుడు కూడా కృష్ణుడ్ని దర్శించుకుని దేవతల కష్టాలు విన్నవించుకున్నాడు. అంతా విన్న తరువాత శ్రీకృష్ణుడు నరకాసుర సంహారానికి నిశ్చయించాడు.

ఆయన గరుడవాహనం ఎక్కి బయలుదేరుతుంటే సత్యభామ 'స్వామీ! నేనూ యుద్ధరంగానికి వస్తాను' అంది.


శ్రీకృష్ణుడు సత్యభామను అక్కున చేర్చుకుని 'సమరభూమి రాజోద్యానవనం కాదు. మహాభయంకరంగా వుంటుంది. నరకుడితో యుద్ధం చెయ్యాలనే ఆలోచన మానుకో' అని చెప్పాడు.

కాని సత్యభామ వినలేదు.

కృష్ణుడూ సత్యభామా ఇద్దరూ ప్రాగ్జ్యోతిషపురం వెళ్ళారు.

కృష్ణుడు తన కౌమోదకితో ప్రాగ్జ్యోతిషపుర ప్రాకారాలను పిండి చేశాడు. తన సుదర్శనంతో అక్కడి అగ్ని వరుణ ప్రాకారాలను ధ్వంసం చేశాడు. తన ఖడ్గంతో కావలివారిని నేలకూల్చాడు.

పాంచజన్య ధ్వని విని మురుడు హడలిపోయాడు. త్రిశూలం తీసుకుని కృష్ణుడితో తలపడ్డాడు. అప్పుడు జరిగిన యుద్ధంలో శ్రీకృష్ణుడు ఆ అసురుని



త్రిశూలాన్ని మూడు ముక్కలు చేశాడు. తలలు ఐదింటినీ నరికేశాడు.

మురాసురుడు నేలకూలటం చూసి అతని కుమారులు తామ్రుడు, అరుణుడు అనేవారు శ్రీకృష్ణుని ఎదిరించారు. వాళ్ళూ యమసదనానికి వెళ్ళారు.

తన వాళ్ళందరూ హతులవుతున్నారని తెలుసుకుని నరకుడు స్వయంగా సమరరంగంలోకి దిగాడు.

నరకుని చూడగానే సత్యభామలో తీవ్రరోషం కలిగింది. ముకుందుడి దగ్గరనుంచి విల్లు అందుకుంది. విల్లు అందుకోగానే వీర, శృంగార, భయ, రౌద్ర రసాలన్నీ ఆమెను ఆశ్రయించాయి. అపూర్వతేజంతో ఆమె ప్రకాశించింది.

అప్పుడు జరిగిన యుద్ధంలో నరకుని సైన్యం చాలా నష్టమైంది.

'ఆడపిల్లను అడ్డు పెట్టుకుని ఆమె చేత యుద్ధం చేయిస్తూ, నువ్వు వెనుక వెనుక నక్కి వున్నావు - నువ్వూ యోధుడవే?' అని నరకుడు శ్రీకృష్ణుడ్ని తూలనాడాడు.

గోవిందుడు ఆ మాటలకు కోపగించి నరకుడి మీద, అతని సైన్యం మీద అనేక దివ్యాస్త్రాలు ప్రయోగించాడు.

ఆ అస్త్రాలవల్ల చాలామంది ప్రాణాలు కోల్పోయారు. అనేకవేల ఏనుగులు, గుర్రాలు తీవ్రంగా గాయపడ్డాయి. మొత్తం ఎనభై నాలుగువేల మంది రాక్షసులు హతులయ్యారు.

ఆ తరువాత శ్రీహరి నరకుడిమీదకు తన చక్రాయుధాన్ని ప్రయోగించాడు. మరుక్షణం నరకుని తల నేలకు ఒరిగింది.

శ్రీకృష్ణుడు నరకాసుర భవనంలోకి ప్రవేశించి అక్కడ బందీలై వున్న రాజపుత్రికలకు విముక్తి కలిగించాడు.

ఆ తరువాత సత్యభామాసమేతుడై శ్రీకృష్ణుడు ఇంద్రలోకానికి వెళ్ళి నరకుని భవనంలో దొరికిన అదితి కుండలాలను అదితికి ఇచ్చాడు. ఆమె శ్రీకృష్ణుని సర్వవిజేతగా దీవించింది. సత్యభామకు నిత్యయవ్వనం నిలిచి వుండేటట్టు వరం ప్రసాదించింది.

# బాణాసురుడు

కృష్ణుడికి రుక్మిణి, జాంబవతి, సత్యభామ, కాళింది, మిత్రవింద, నాగ్నజితి, భద్ర, లక్షణ ఎనమండుగురు రాణులు, వీరుకాక మరో పదహారు వేలమంది భార్యలు ఉన్నారు. పట్టమహిషి రుక్మిణికి ప్రద్యుమ్నుడు, చారుధేష్ణుడు, సుధేష్ణుడు, చారుదేవుడు, సుచారువు, చారుగుప్తుడు, భద్రచారువు, చారుభద్రుడు, విచారువు, చారువు – అని పదిమంది కొడుకులు కలిగారు. ఇలాగే మిగిలిన ఏడుగురు రాణులకు పదేసిమంది చొప్పున మగపిల్లలు పుట్టారు. పదహారు వేలమంది భార్యలకు కూడా పదేసిమంది కొడుకులు కలిగారు.

రుక్మిణి అన్నయ్య రుక్మి. రుక్మి కూతురు రుక్మవతి. తన మేనమామ స్వయంవరం ప్రకటించాడని తెలిసి కృష్ణుడి కొడుకు ప్రద్యుమ్నుడు వెళ్ళి బల పౌరుషాలు ప్రదర్శించి రుక్మవతిని గెలుచుకుని పెళ్ళి చేసుకున్నాడు. రుక్మవతికి, ప్రద్యుమ్నుడికి అనిరుద్ధుడనే కుమారుడు కలిగాడు. అతను రుక్మి మనుమరాలైన రుక్మకాంతిని పెళ్ళి చేసుకున్నాడు.

బలి చక్రవర్తి నూరుగురు కొడుకుల్లో బాణుడు పెద్దవాడు. అతను గొప్ప బలశాలి. పరమేశ్వరుడ్ని తన భక్తితో మెప్పించి, తన నగరం శోణపురికి శివపార్వతులు కావలి ఉండేటట్టు ఒప్పించాడు. బాణుడి కూతురు ఉష. ఆ అమ్మాయి మహా సౌందర్యవతి. ఉషకు ఒకసారి కలలో అనిరుద్ధుడు కనిపించాడు. అతని రూపురేఖావిలాసాలకు ఉష సమ్మోహితురాలైంది.

అప్పటినుంచి ఆ అమ్మాయి మనసు మనసులో లేదు. నిద్రాహారాలు మానేసింది. ఎప్పుడూ అనిరుద్ధుడి మీదే ధ్యాస. వలపు బాధకు తాళలేక తన ప్రియసఖి చిత్రలేఖకు కలలో కనిపించిన అపురూపసౌందర్యమూర్తిని గురించి వర్ణించి చెప్పింది. చిత్రలేఖ మంచి చిత్రకారిణి. ఉష ఎలా వర్ణించిందో అలా బొమ్మలు గీసి చూపించింది. ఒక్కో బొమ్మ చూపిస్తూ అతను ఏ దేశపు రాజో, ఎక్కడి రాకుమారుడో చెప్పింది. చివరికి ఉష అనిరుద్ధుడి బొమ్మను గుర్తుపట్టి అతనే తన మనసు దోచుకున్న అందగాడని చెప్పింది.

చిత్రలేఖ తన యోగవిద్యతో క్షణాలమీద అనిరుద్ధుణ్ణి ఉషాదేవి మందిరానికి చేర్చింది. అనిరుద్ధుడికి మెలుకువ వచ్చి చూసేసరికి తన పక్కన భార్య రుక్మకాంతికి బదులు ఉషాదేవి వుంది. ఆమె సౌందర్యానికి అతను ముచ్చటపడ్డాడు. ఇద్దరూ ఆనందంగా కొన్నాళ్ళు గడిపారు. ఉష గర్భవతి అయింది. ఈ సంగతి బాణుడికి తెలిసింది. బాణుడు మండిపడ్డాడు. అనిరుద్ధుడ్ని బంధించమని భటుల్ని ఆజ్ఞాపించాడు. ఆ సమయంలో బాణుడికి, అనిరుద్ధుడికి మధ్య పెద్ద యుద్ధం జరిగింది. అనిరుద్ధుడు సామాన్యుడు కాదని బాణుడికి తెలిసిపోయింది. అతడ్ని నాగపాశంతో బంధించాడు. ప్రియుడికి హాని కలిగినందుకు ఉష కలవరపడింది. ఈలోగా త్రిలోకసంచారి నారదమహర్షి కృష్ణుడి దగ్గరకు వెళ్ళి ఉష అనిరుద్ధుల సంగతంతా చెప్పాడు. కృష్ణుడు సైన్యాన్ని వెంటపెట్టుకుని, బలరాముడు, సాత్యకి, ప్రద్యుమ్నుడు మొదలైనవారిని సాయంగా తీసుకుని బాణుడి నగరం శోణపురి మీదికి దండెత్తి వెళ్ళాడు.

శోణపురానికి కాపలా కాస్తున్న పరమశివుడు ముందుగా అచ్యుతుడితో యుద్ధానికి దిగాడు. అస్త్రానికి అస్త్రం వేసి పరమేశ్వరుడిని కృష్ణుడు అడ్డుకున్నాడు. శ్రీహరి జృంభకాస్త్రం వేస్తే శివుడికి నిద్ర ముంచుకు వచ్చి నందివాహనం మీద ఒరిగిపోయాడు.

తరువాత కృష్ణుడు బాణుడితో తలపడ్డాడు. బాణుడు నల్లనయ్య ధాటికి నిలువలేకపోయాడు. గబగబ తన నగరంలోకి పారిపోయాడు. యాదవ వీరులు బాణుడ్ని గేలిచేశారు. బాణుడు మళ్ళీ సైన్యాన్ని సమీకరించుకుని రెండవసారి యుద్ధానికి వచ్చాడు. నారాయణుడు తన చక్రంతో అతని వెయ్యి చేతుల్నీ నరకడం ప్రారంభించి చివరికి నాలుగు చేతులు మాత్రం మిగిల్చాడు. 'నా భక్తుడయిన ప్రహ్లాదుడి వంశంలో పుట్టావు. కనుక నిన్ను చంపను. నాలుగు చేతులు మాత్రం మిగిల్చి నిన్ను వదులుతున్నాను' అని హరి చెప్పాడు. బాణుడు నమస్కరించి ఉషాదేవితోసహా అనిరుద్ధుడ్ని కృష్ణుడికి అప్పగించాడు. ఉష, అనిరుద్ధులకు ద్వారకలో అతి వైభవంగా పెళ్ళి జరిగింది.

# మాతృవాంఛ

**ఒ**కసారి శ్రీకృష్ణబలరాములు ద్వారావతిలో వున్న సమయంలో సంపూర్ణ సూర్యగ్రహణం వచ్చింది. అటువంటిది సామాన్యంగా యుగాంతాన, ప్రళయ కాలాన మాత్రమే సంభవిస్తుందన్న విశ్వాసం వ్యాపించి ఉండడం చేత ప్రజలు భయపడిపోయి కురుక్షేత్రంలోని శ్యమంతపంచకానికి చేరుకున్నారు. పరశు రాముడు మదోన్మత్తులైన రాక్షసులను సంహరించిన సందర్భంలో వారి రుధిరంతో ఏర్పడిన మడుగులు ఐదింటికీ శ్యమంతపంచకమని పేరు. క్షత్రియులను సంహరించి, నేలతల్లిని రుధిరప్లావితం చేసిన పాతకాన్ని తొలగించుకునేందుకు పరశురాముడు అక్కడే ఒక మహాయాగాన్ని కూడా చేశాడు. ఆ యాగానికి యాదవులందరూ తరలివెళ్ళారు. మత్స్య, కోసల, విదర్భ, కురు, సృంజయ, కాంభోజ, కేకయ, మద్ర, కుంతి, ఆవర్త, కేరళ దేశాధీశు లెందరో అక్కడ సమావేశమైనారు. వాళ్ళందరూ శ్రీకృష్ణుని సందర్శించి, సత్కరించారు. శ్రీకృష్ణ బలరాములు కూడా వాళ్ళను యథోచితంగా గౌరవించారు. అప్పుడు వాళ్ళందరూ ఉగ్రసేనుడి దగ్గరకు వెళ్ళి 'మహారాజా! ప్రపంచంలోని మానవులందరిలోకీ యాదవులు మాత్రమే ధన్యులు. వారి జన్మలే పవిత్రమైనవి. శ్రీకృష్ణుడు అన్ని వేళలా వారి మధ్యే వుంటాడు. వాళ్ళని కంటికి రెప్పలా కాపాడతాడు. శ్రీకృష్ణుడు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే. ఆయనను దర్శించటం యోగులకే శక్యం కాదు. అలాంటిది యాదవులు పిలిస్తే

పలుకుతాడు. ఆయనను మీ మధ్య నిలుపుకుని నిర్విచారంగా జీవిస్తున్న మీరు చాలా అదృష్టవంతులు' అని పలువిధాల నల్లనయ్యను ప్రశంసించారు.

యశోదానందులకు, దేవకీవసుదేవులకు వారు ప్రణమిల్లారు.

బిడ్డల గొప్పతనానికి మురిసిపోయి తల్లిదండ్రులు బలరామకృష్ణులను గుండెలకు హత్తుకున్నారు. దేవకీదేవి బలరామకృష్ణులను దగ్గరకు పిలిచి 'నాయనలారా! మిమ్మల్ని పొగడాలో, పొగడకుండా నా ఆనందాన్నంతా ఈ గుప్పెడు గుండెలో ప్రోది చేసుకోవాలో, మీకు నమస్కరించవచ్చో, లేక బిడ్డలకి చెయ్యకూడదో, మిమ్మల్ని ఆలింగనం చేసుకోవాలో లేక దూరం నుంచి దర్శించి కన్నులపండుగ చేసుకోవాలో తెలియటంలేదు.

'మీరు ఏమనుకోకపోతే ఒకే ఒక కోరిక కోరుతాను. మీరిద్దరూ మరణించిన మీ గురుపుత్రుని తీసుకువచ్చిన విధంగానే, కంసుడు పొట్టన పెట్టుకున్న నా బిడ్డల్ని కూడా ఒక్కసారి తెచ్చి చూపండి' అని భోరున ఏడ్చింది.

బలరామకృష్ణులు ఆమెను ఓదార్చి యోగమాయాప్రభావంతో వెంటనే సుతలానికి వెళ్ళారు. రాక్షసేశ్వరుడు బలి వాళ్ళకు ఘనంగా స్వాగతం చెప్పాడు. భక్తిపూర్వకంగా వాళ్ళని అర్చించి కానుకలు సమర్పించాడు. బలరామకృష్ణులు అమితానందం పొందారు.

'బలీ! పూర్వం స్వాయంభువ మన్వంతరంలో మరీచికి 'ఊర్ణ' అనే ఒక భార్య ఉండేది. ఆ దంపతులకు స్మరుడు, ఉద్గీదుడు, పరిష్వంగుడు, పతంగుడు, క్షుద్రభువు, ఘృణి అనే ఆరుగురు కుమారులుండేవారు. వాళ్ళందరూ దేవతలే.

వాళ్ళు ఒకసారి బ్రహ్మదేవుని ఎగతాళి చేసి పరిహాసంగా మాట్లాడారు. అందువల్ల వాళ్ళను రాక్షసులై పుట్టమని ఆయన శపించాడు. అలా శపించబడ్డ ఆ ఆరుగురూ హిరణ్యకశిపుడికి జన్మించాల్సింది. కాని, యోగమాయాప్రభావం వలన వాళ్ళు దేవకీదేవికి పుట్టారు. పుట్టిన వెంటనే వాళ్ళను కంసుడు

సంహరించాడు. ఆ ఆరుగురూ ఇప్పుడు నీ దగ్గర వున్నారు. మా తల్లి దేవకీదేవి వాళ్ళను చూడాలనుకుంటోంది. ఆమె కోరికను తీర్చటంకోసం మేము ఇక్కడికి వచ్చాం. వాళ్ళు మావెంట వస్తే వాళ్ళకు శాపవిముక్తి కలుగుతుంది. వాళ్ళు తిరిగి వాళ్ళ నిజవాసం చేరుకుంటారు' అని చెప్పారు.

బలి వెంటనే వాళ్ళను బలరామకృష్ణులకు అప్పగించాడు. వాళ్ళను బలరామకృష్ణులు తమ తల్లికి చూపించి ఆమెకు ఆనందం కలిగించారు. ఆ ఆరుగురూ శ్రీకృష్ణుని స్పృశించి తమ పాపాల్ని తొలగించుకున్నారు. చతుర్ముఖుని శాపం నుంచి విముక్తి పొందారు.

ఏనాడో మరణించిన తన కుమారులు తన సముఖానికి రావడం, వెంటనే తిరిగి వెళ్ళిపోవడం దేవకిదేవికి ఆశ్చర్యం కలిగించింది.

అదంతా శ్రీకృష్ణుని లీలావిశేషమని గ్రహించి పరవశించింది.

# అర్జునుడి అగ్ని ప్రవేశం

**ఒ**కసారి అర్జునుడు శ్రీకృష్ణుని దగ్గర వున్న సమయంలో ఒక విప్రుడు పుట్టిన వెంటనే చనిపోయిన తన కుమారుడ్ని తీసుకువచ్చి కోట గుమ్మం దగ్గర వుంచి గోలుగోలున ఏడవడం మొదలుపెట్టాడు. అర్జునుడు అది చూసి ఆ బ్రాహ్మణుడి దగ్గరకు వెళ్ళి ఆ విపరీతానికి కారణమేమిటని అడిగాడు. 'అయ్యా! బ్రహ్మద్వేషీ, శఠుడూ, లుబ్ధుడూ, దుశ్శీలుడూ, దుర్బలుడూ అయిన రాజు పాలనలో వున్నవారు నిరుపేదలూ నిత్యదుఃఖితులూ అవుతారు. ఇప్పుడు నేను కూడా ఆ పరిస్థితిలోనే వున్నాను' అన్నాడు విప్రుడు. అర్జునుడు ఆయనను ఊరడించి 'ఈసారి నీకు పుట్టే పిల్లవాడ్ని నేను రక్షించి తీరుతాను. అలా చేయలేని పక్షంలో నేను అగ్నిప్రవేశం చేస్తాను' అని శపథం చేశాడు.

అర్జునుడి పలుకులు ఆ బ్రాహ్మణునికి ఆశ్చర్యం కలిగించాయి.

'నాయనా! అరివీర పరాక్రమ సంపన్నులైన బలరామకృష్ణులూ, యోధుడైన ప్రద్యుమ్నుడూ, అతని పుత్రుడయిన అనిరుద్ధుడూ చెయ్యలేని పనిని నువ్వెలా చేయగలవు? అయినా ఇంతకీ నువ్వెవరవు?' అని అడిగాడు.

'నేను ధర్మరాజు సోదరుడ్ని. పాండవ మధ్యముడ్ని, గాండీవధారిని, వాసుదేవుడికి మేనత్తకొడుకును! నన్ను పార్థుడని కూడా పిలుస్తారు' అని అర్జునుడు తనను తాను పరిచయం చేసుకున్నాడు.

విప్రుడు నమస్కరించాడు.

కాలక్రమాన బ్రాహ్మణుని భార్య గర్భవతి అయింది. ప్రసవించే సమయం కూడా వచ్చింది. బ్రాహ్మణుడు వెళ్ళి అర్జునుడికి ఆ సంగతి తెలియజేశాడు. వెంటనే విజయుడు గాండీవసహితంగా బ్రాహ్మణుడి ఇంటికి వెళ్ళి తన దివ్యాస్త్రాలతో ప్రసూతిగృహాన్ని అన్ని దిక్కులా బంధించాడు. పురిటింటిని ఒక శరపంజరం మాదిరి చేశాడు. అది చూసిన విప్రుడు కూడా ఇంక తన ఇంట్లోకి మృత్యువు ప్రవేశించడం అసంభవమనుకున్నాడు. కానీ అంతలోనే పుట్టిన పిల్లవాడు ఆకాశంలోకి ఎగిరిపోతున్నాడన్న అరుపులు పురిటింట్లోంచి వినిపించాయి. అది విని గాండీవి అదిరిపడ్డాడు. విప్రుడు పార్థుడ్ని అనరాని మాటలన్నాడు. అర్జునుడి చెవులకు అవి ములుకులయినాయి. వెంటనే యోగవిద్య ద్వారా యమపురికి వెళ్ళాడు.

అక్కడ విప్రుడి కొడుకు కనిపించలేదు. దిక్పాలకుల పురాలన్నీ గాలించాడు. పిల్లవాడిజాడ తెలియలేదు.

స్వర్గ పాతాళాలకు వెళ్ళి చూశాడు. అక్కడా లేడు.

ఇక లాభం లేదనుకుని బ్రాహ్మణుడికిచ్చిన మాట ప్రకారం కిరీటి అగ్ని ప్రవేశం చెయ్యబోయాడు. అది గ్రహించిన శ్రీకృష్ణుడు అర్జునుడి దగ్గరకు వెళ్ళి 'ఆ కుర్రవాడ్ని నీకు నేను చూపిస్తాను' అని చెప్పి అర్జునుడు అగ్నిప్రవేశం చెయ్యకుండా వారించాడు. పార్థుడ్ని తన దివ్యరథంమీద కూర్చోబెట్టుకుని బయలుదేరాడు.

రథం సప్తద్వీపాలు దాటింది. సప్తసముద్రాలనూ దాటింది. సప్తగిరులనూ అధిగమించింది.

చివరికి చిక్కటి చీకటి సీమలోకి ప్రవేశించింది. అక్కడకి వెళ్ళేసరికి గుర్రాలకు దారి కనిపించలేదు. శ్రీకృష్ణుడు వేయి సూర్యుల కాంతితో ప్రకాశించే తన

చక్రాన్ని ముందుకు వదిలాడు. ఆ కాంతిలో రథం ముందుకు సాగింది. రథం వెళ్ళి వెళ్ళి ఒక మహా సముద్రంలోకి ప్రవేశించింది. ఆ జలరాశి మధ్యలో ఒక దివ్య భవనం వుంది. అక్కడ నీలమేఘచ్ఛాయలో, పూర్ణచంద్రునివంటి ముఖంతో, శంఖు,చక్ర,గదలతో, కౌస్తుభమణితో, వనమాలతో శ్రీమన్నారాయణుడు పండిత మునిజన సేవితుడై విరాజిల్లుతున్నాడు. కృష్ణార్జునులు ఆయనకు వినయంగా నమస్కరించారు.

శ్రీమన్నారాయణుడు వారిని చూసి మందహాసం చేశాడు. 'ధర్మరక్షణకు ధరణిపై నా అంశతో నరనారాయణులుగా అవతరించిన మీకు ఏ సహాయం కావాలో చెప్పండి – తక్షణమే చేస్తాను' అన్నాడు.

నల్లనయ్య వచ్చినపని చెప్పాడు.

శ్రీమన్నారాయణుడు విప్రుడి కొడుకులందరినీ శ్రీకృష్ణుడికి అప్పగించాడు. కృష్ణార్జునులు వాళ్ళను తీసుకువెళ్ళి విప్రుడికి అప్పగించారు.

బ్రాహ్మణుడు సంతోషించి కృష్ణార్జునులకు కృతజ్ఞతగా అంజలి ఘటించాడు.

# మనసుకో మాధవుడు

పూర్వం మిథిలానగరంలో శ్రుతదేవుడనే ఒక పెద్దమనిషి వుండేవాడు. ఆయనకు దురాశ అనేది వుండేదికాదు. న్యాయంగా ఏది లభిస్తే అది అనుభవిస్తూ, సంతృప్తితో బతుకుతూ ఎప్పుడూ శ్రీకృష్ణుడ్ని స్మరిస్తూ కాలం గడిపేవాడు.

ఆ కాలంలోనే బహుళాశ్వుడనే ఆయన మిథిలాధిపతిగా వుండేవాడు. ఆయనకూడా కృష్ణభక్తుడే.

తన భక్తులిద్దరినీ అనుగ్రహించే నిమిత్తం శ్రీకృష్ణుడు ఒకసారి వ్యాస నారదాది మహర్షులను వెంటబెట్టుకుని మిథిలానగరానికి వెళ్ళాడు. నల్లనయ్య వస్తున్నాడని తెలిసి బహుళాశ్వుడు ఎదురేగి వారందరికీ ఘనంగా స్వాగతం చెప్పి వినయ విధేయతలతో పూజించాడు. 'జగద్గురువులైన మీరు మా నగరానికి రావటం మా భాగ్యం. నా ఆతిథ్యం స్వీకరించి నన్ను ఆనందింప చేయండి' అని బహుళాశ్వుడు అభ్యర్థించాడు.

శ్రీకృష్ణుడు సరేనన్నాడు.

అంతలో శ్రుతదేవుడు అక్కడకు వచ్చి, మురారికి భక్తి ప్రపత్తులతో మొక్కాడు. బహుళాశ్వుడు ఆయనకు ఆతిథ్యం ఇస్తున్నాడని తెలీక, తన ఇంటికి విచ్చేసి తనను ధన్యుడ్ని చేయమని కోరాడు.

శ్రుతదేవుని అహ్వానాన్ని కూడా శ్రీకృష్ణుడు ఆమోదించాడు.

నారాయణుడు తనయింట ఆతిథ్యం స్వీకరిస్తానని ముందుగా తనకు మాట ఇచ్చి, ఆ తరువాత శ్రుతదేవుని ఆహ్వానాన్ని కూడా ఆమోదించడం బహుళాశ్వుడికి ఆశ్చర్యం కలిగించింది. కాని 'అదేమిటి ప్రభూ' అని అడిగే సాహసం ఆయనకు లేకపోయింది.

ఇంతలో అతిథిపూజకు సమయం సమీపించింది. బహుళాశ్వుడు ఇంకేమీ ఆలోచించకుండా గబగబ శ్రీకృష్ణుడ్ని సమీపించి 'ఇప్పటికే కాలాతీతమైంది ప్రభూ! రండి మా పూజలు అందుకోండి' అని వినయంగా అన్నాడు.

నల్లనయ్య బహుళాశ్వుని వెంట బయలుదేరాడు.

మంగళతూర్యనాదాలతో హితులు, పౌరోహితుల నడుమ మహారాజు వెంటవెడుతున్న నల్లనయ్యను చూసి శ్రుతదేవుడు విస్మితుడైనాడు.

'మరి మా ఇంట ఆతిథ్యం సంగతేమిటి?' అని మనసులో అనుకున్నాడు. అంతలోనే శ్రుతదేవుని కుమారుడొకడు పరుగుపరుగున వచ్చి గోవిందుడు తన సహచరులందరితోనూ తమ ఇంటికి వచ్చాడని తండ్రితో చెప్పాడు.

శ్రుతదేవునికి ఈ వింతేమిటో తెలీక అబ్బురపడుతూ మనోవేగంతో ఇంటికి వెళ్ళాడు.

బహుళాశ్వుడు  యాదవచంద్రుడికీ, ఆయన వెంట వచ్చిన మహర్షులకూ ఉత్తమ ఆసనాలు సమర్పించి, భక్తితో పూజించి, రకరకాల పదార్థాలతో వారికి భోజనం పెట్టాడు. ఆ తరువాత వారు విశ్రమించారు. ఆ సమయంలో ఒక బ్రాహ్మణుడు అక్కడికి వచ్చి శ్రీకృష్ణుడ్నీ, మహనీయులైన వ్యాస నారదుల వంటి మహర్షులనూ తాను ఇంతకు పూర్వమే శ్రుతదేవుని ఇంట్లో చూసినట్టు చెప్పి, ఆ మహానుభావులకు సేవలు చేస్తున్న శ్రుతదేవుని అదృష్టాన్ని వేనోళ్ళ పొగిడాడు.



బహులాశ్వుడు అది నమ్మలేక ఆ విప్రుడ్ని వెంటపెట్టుకొని నేరుగా శ్రుతదేవుడి ఇంటికి వెళ్ళాడు.

బహులాశ్వుడు శ్రుతదేవుని ఇంటికి వెళ్ళే సమయానికి ముకుందుడు అక్కడ దర్భాసనంమీద కూర్చుని వున్నాడు. శ్రుతదేవుడూ, ఆయన భార్యాబిడ్డలూ ఆయనకు పాదపూజ చేస్తున్నారు.

శ్రీకృష్ణుని లీలలను కళ్ళారా చూసినందుకు సంబరపడుతూ బహులాశ్వుడు ఆయనకు సాగిలపడి మొక్కాడు.

ద్వారకాధీశుడు మందహాసంతో బహులాశ్వుడ్ని, శ్రుతదేవుడ్ని దగ్గరకు పిలిచి 'ఈ మహర్షులు మిమ్మల్ని అనుగ్రహించడానికే యిలా వచ్చారు. వీరు తమ పాదధూళిచేత ప్రపంచాన్నంతా పవిత్రం చేస్తూ నాతో పర్యటిస్తూ వుంటారు. పుణ్యక్షేత్రాలు దర్శించటంవల్లా, సజ్జనసాంగత్యం చెయ్యటంవల్లా, ధార్మిక ప్రసంగాలు వినటంవల్లా జనులు కాలక్రమేణా పవిత్రులవుతారు. కాని ఇటువంటి మహనీయ మహర్షుల దర్శనం వల్ల సద్య:ఫలంగా ఉత్తమోత్తమ గతులు ప్రాప్తిస్తాయి.

'ఈ మునివర్యుల దర్శనభాగ్యం వల్లనే దేవతలకు కూడా పవిత్రత చేకూరుతూ వుంటుంది.

'విగ్రహారాధన కంటే విజ్ఞులనూ, వేదవిదులనూ ఆరాధించటం ఉత్తమం. అలా చెయ్యడంవల్ల మీరు నన్ను ప్రత్యక్షంగా పూజించిన వారవుతారు. వ్యయప్రయాసలకోర్చి వైభవోపేతంగా పూజలుచేసే వారి కంటే సాధుజనులను భక్తి ప్రపత్తులతో పూజించేవారే నాకు ఇష్టులు. వారే నా ప్రేమకు పాత్రులవుతారు' అని బోధించాడు.

బహుళాశ్వుడూ, శ్రుతదేవుడూ తమ అదృష్టాలకు మురిసిపోయి స్వామి కాళ్ళమీద పడి మరికొన్నాళ్ళు తమ అతిథిగా వుండమని శ్రీకృష్ణుని వేడుకున్నారు. వారి అభ్యర్థనమీద మిథిలలో కొన్నాళ్ళుండి ఆ తరువాత శ్రీకృష్ణుడు ద్వారావతికి వెళ్ళాడు.

# రాయబారం

**కౌ**రవులు పన్నిన వలలో చిక్కుకుని జూదంలో ఓడి రాజ్యాన్నీ భోగభాగ్యాల్నీ వదులుకుని పాండుపుత్రులు పడరానిపాట్లు పడి అజ్ఞాతవాసం నిర్విఘ్నంగా పూర్తిచేసుకున్నారు. అజ్ఞాతవాసం తరువాత విరాటపుత్రి అయిన ఉత్తరను అర్జునకుమారుడు అభిమన్యుడికిచ్చి పెళ్ళిచేశారు. ఆ వివాహానికి విరటుని ఆహ్వానంమీద శ్రీకృష్ణుడు బంధుమిత్రులతో సహా విరాట నగరానికి వెళ్ళాడు.

పెళ్ళి అయ్యాక యాదవవీరులూ, వివిధ దేశాల అధిపతులూ కొలువు దీరి వున్న సమయంలో శ్రీకృష్ణుడు పాండుపుత్రుల ధర్మవర్తనను ప్రస్తావించి న్యాయంగా వారిదైన రాజ్యాన్ని వారికి కౌరవులు ఇవ్వాలని సూచించాడు. దానికి అవసరమైతే యుద్ధం చేయటం కూడా సమంజసమేనని చెప్పాడు. కౌరవులకూ పాండవులకూ మధ్య యుద్ధం అనివార్యమైతే ధర్మమూర్తులైన పాండుపుత్రులు కౌరవులను గెలవటం తథ్యమనీ, ఫలితంగా కౌరవవంశం నాశనమవుతుందనీ హెచ్చరించాడు.

శ్రీకృష్ణుని ఉపదేశం అందరికీ నచ్చింది. కాని బలరాముడు మాత్రం కురు పాండవ యుద్ధం మంచిదికాదనీ, సంధి జరిగేటట్టు చూడాలనీ కోరాడు. సాత్యకి మొదలయినవారు సంధికి అంగీకరించలేదు. నిజానికి శ్రీకృష్ణునికి కూడా సంధి చేసుకోవాలనిలేదు. యుద్ధాన్ని నివారించగల శక్తి వుండి కూడా శ్రీకృష్ణుడు ఉపేక్ష చేశాడన్న అపవాదు రాకుండా ఉండేందుకు, ఆయన దుర్యోధనుడి

దగ్గరకు దూతను పంపేందుకు సమ్మతించాడు.

ఆ తరువాత పాండవులు దూతను పంపటం, దుర్యోధనుడు ఆ దూతను అవమానపరచటం జరిగింది. చివరి ప్రయత్నంగా రాయబారానికి స్వయంగా శ్రీకృష్ణుడే హస్తినాపురానికి వెళ్ళాడు. అక్కడ ధృతరాష్ట్రుని కలుసుకుని పాండవుల పక్షాన వాదించాడు. వారి రాజ్యాన్ని వారికి ఇవ్వటం సమంజసమని బోధించాడు. పాండుపుత్రులను కూడా తన పుత్రులుగా చూసుకోవడం ధర్మమని శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడికి చెప్పాడు. మురారి అభిప్రాయాన్ని అందరూ శ్లాఘించారు.

కాని, దుర్యోధనుడు కృష్ణుని హితవచనాలను పెడచెవినపెట్టాడు. తను జీవించివుండగా పాండవులకు సూదిమొన మోపేటంతటి స్థలమైనా ఇవ్వటం జరగదని నిక్కచ్చిగా చెప్పాడు.

శ్రీకృష్ణుడు ఇక లాభం లేదనుకుని ధృతరాష్ట్రుడి దగ్గరకు వెళ్ళి 'సుయోధనుడు పూర్వం కంసుడు వ్యవహరించినట్లుగా వ్యవహరిస్తున్నాడు. అతనివల్ల కౌరవ వంశానికి చేటు కలుగుతుంది. యాదవులు కంసుని ఒదులుకుని తమ వంశాన్ని ఎలా కాపాడుకున్నారో అలా నువ్వు నీ కుమారుడు దుర్యోధనుడ్ని త్యజించి కురువంశాన్ని రక్షించుకోవటం మంచిదని చెప్పాడు. అది విని దుర్యోధనుడు మండిపడ్డాడు. అతనిలో వివేకం నశించింది. పాండవులు శ్రీకృష్ణునిమీద ఆధారపడి యుద్ధానికి సిద్ధమవుతున్నారనీ వారి బలమల్లా కృష్ణుడేననీ, కనుక అతనిని బంధించి కారాగారంలో పడేస్తే పాండవులు పాదాక్రాంతులవుతారనీ అనుకున్నాడు. శ్రీకృష్ణుడు ఆ విషయం గ్రహించాడు.

'దుర్యోధనా! నేను ఒంటరిగా వున్నాననీ, నన్ను బంధించటం తేలికనీ నువ్వు భావిస్తున్నట్టున్నావు. అది వట్టి భ్రమ. చతుర్దశ భువనాలలోనూ వుండే జీవరాశి అంతా నా సమక్షాన వుంది. నన్నే ఆశ్రయించి బతుకుతోంది. అది గ్రహించలేక నువ్వు నాపై దౌర్జన్యం జరుపుదామనుకుంటున్నావు. నా మాట విని మరోదారి

చూసుకో' అన్నాడు. ఆ మాటలకు దుర్యోధనుడు విరగబడి నవ్వాడు.

ఆగ్రహించిన శ్రీకృష్ణుడు వాళ్ళందరికీ భయం కలిగేటట్టు తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. శంఖమూ, చక్రమూ, గదా, శక్తి, విల్లూ మొదలైనవి ధరించి అనేక బాహువులతో, అనేక నేత్రాలతో మహారౌద్రంగా కనిపించాడు. భయంకరమైన ఆ రూపాన్ని చూడలేక అందరూ కళ్ళు మూసుకున్నారు. కాని మునులు, భీష్మ, ద్రోణ, విదుర, సంజయాదులు మాత్రం శ్రీకృష్ణుడు ప్రసాదించిన దివ్యచక్షువులద్వారా ఆ మహాద్భుత రూపాన్ని దర్శించి ధన్యులయ్యారు.

అప్పుడు అక్కడ దేవదుందుభులు మోగాయి.

పూలవాన కురిసింది. దేవతలందరూ నల్లనయ్యను స్తుతించారు.

దివ్యరూపాన్ని ఉపసంహరించుకోవల్సిందిగా వాళ్ళందరూ ఆయనను ప్రార్థించారు. దేవతల ప్రార్థన మన్నించి సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే అయిన శ్రీకృష్ణుడు తన విశ్వరూపాన్ని ఉపసంహరించుకున్నాడు.

# ఘటోత్కచుడు

**కు**రు పాండవ సేనలమధ్య తీవ్రంగా యుద్ధం జరుగుతోంది. రాధేయుని ధాటికి పాండవయోధులు ఆగలేక, ప్రాణభీతితో పారిపోతున్నారు. కర్ణుడ్ని ఉపేక్షిస్తే పాండవ సైన్యం బతికి బయటపడటం జరగదని అర్జునుడు గ్రహించాడు.

రథాన్ని రాధేయుని దిక్కుగా నడపమని పార్థుడు తన సారధి అయిన కృష్ణుడ్ని కోరాడు. ఆ రోజు అటు కర్ణుడో, ఇటు అర్జునుడో ఎవరో ఒకరు మాత్రమే బతికి వుండాలన్న పట్టుదలతో వున్నాడు అర్జునుడు.

'అర్జునా! ఈవేళ కర్ణుడు అమితపరాక్రమంతో చెలరేగుతున్నాడు. మన వీరులలో ఘటోత్కచుడు మినహా మరెవరూ కర్ణుడ్ని ఓడించలేరు. రాధేయుడి దగ్గర మహేంద్రుడు ప్రసాదించిన 'వైజయంతి' అనే మహాశక్తి వుంది. అది అతని దగ్గర ఉన్నంతవరకూ నువ్వు అతని ఎదుటకు పోవటం మంచిది కాదు' అని కృష్ణుడు చెప్పాడు.

వైజయంతి వజ్రాయుధం లాంటిది. దానిని ఎదుర్కోగల ఆయుధం మరొకటి లేదు. దానిని కర్ణుడు అర్జునుడిమీద ప్రయోగించాలని వేచి ఉన్నాడు. అది గ్రహించిన కృష్ణుడు అర్జునుడు ముందుకుపోకుండా అడ్డు తగిలాడు.

బలపరాక్రమాలలో పార్థుడికి తీసిపోనివాడూ, మాయాయుద్ధంలో మొనగాడూ, భీముని పుత్రుడూ అయిన ఘటోత్కచుడ్ని యుద్ధంలోకి దింపాడు.

అప్పుడు ఘటోత్కచునికీ, కర్ణునికీ మధ్య ఘోరమైన యుద్ధం జరిగింది. ఘటోత్కచుని మాయాజాలంముందు కౌరవసేనలు నిలబడలేకపోయాయి. అది చూసి దుర్యోధనుడు హడలిపోయాడు. వెంటనే జటాసురపుత్రుడూ, పాండవ విరోధీ, అన్నివిధాల ఘటోత్కచుడికి సముడూ అయిన అలంబసుణ్ణి ఘటోత్కచుడి మీదకు పంపాడు. ఆ రాక్షసవీరులిద్దరిమధ్యా తీవ్రపోరాటం జరిగింది. ఘటోత్కచుడు అలంబసుని శిరస్సు ఖండించి దానిని దుర్యోధనుడి మీదకు విసిరేశాడు. దుర్యోధనుడికి కన్నీళ్ళే తక్కువ. కర్ణుడి దగ్గరకు వెళ్ళి 'ఎంత కష్టమైనా నువ్వీరోజు ఘటోత్కచుడ్ని వధించి తీరాలి. లేకపోతే మనపక్షాన ఏ ఒక్కడూ మిగలడు. నీదే భారం' అని ప్రాధేయపడ్డాడు.

దుర్యోధనుడి దీనావస్థను చూసి తన ప్రభువును ఆపదలో ఆదుకోవటం, కౌరవులను రక్షించటం తన కర్తవ్యమని కర్ణుడు అనుకున్నాడు.

అర్జునుడ్ని హతమార్చేందుకు అంతవరకూ దాచి వుంచుకున్న వైజయంతిని ఘటోత్కచుడిమీద ప్రయోగించాడు. ఆ మహాశక్తిని చూడగానే ఘటోత్కచుడు గజగజలాడిపోయాడు.

తన శరీరాన్ని పెద్ద పర్వతంమాదిరి పెంచుకున్నాడు.

ప్రాణభీతితో పరుగెత్తాడు. పరుగెత్తుతున్న ఘటోత్కచుడ్ని వెంటాడి అతని గుండెల్ని చీల్చింది వైజయంతి.

లోకభీకరంగా అరుస్తూ ఘటోత్కచుడు నేల కూలాడు.

అది చూసి పాండవులందరూ పెద్దపెట్టున ఏడ్చారు.

కృష్ణుడు మాత్రం ఆనందతాండవం చేశాడు.

పాండవులు దుఃఖపడుతుంటే కృష్ణుడు సంతోషంతో చిందులు వెయ్యడం అర్జునుడికి ఆశ్చర్యం కలిగించింది.

'మాధవా! నీ ఆనందానికి కారణం ఏమిటి?' అని అడిగాడు.

'అర్జునా! నిన్ను నేలకూల్చే మహాశక్తి నేటితో అంతరించిపోయింది. దానితోపాటు కర్ణుడి ఆయుర్దాయం కూడా తరిగిపోతోంది.

'కర్ణుడి కవచకుండలాలు తీసుకుని మహేంద్రుడు ఇంతకు మునుపే రాధేయుడ్ని సగం నిర్జీవుడ్ని చేశాడు. ఇప్పుడు కర్ణుడు తన అపూర్వ శక్తిమంతమైన ఆయుధం వైజయంతిని ఘటోత్కచుడిమీద ప్రయోగించటంవలన పూర్తిగా శక్తి హీనుడయ్యాడు. దానితో నీ మరణం తప్పిపోయింది. మీ జయం తథ్యమైంది. ఘటోత్కచుడు చనిపోయినందుకు నాకూ బాధగానే వుంది. కాని ఏం చెయ్యగలం? తప్పనిసరై పన్నిన వ్యూహమిది....' అన్నాడు కృష్ణుడు.

అర్జునుడి మనసు తేలికపడింది. తమపట్ల శ్రీకృష్ణుడికి వున్న ఆదరాభిమానాలను అర్జునుడు పొంగిపోయాడు.

# గాంధారి శాపం

కురు పాండవ యుద్ధంలో ధృతరాష్ట్ర పుత్రులు అందరూ హతమయ్యారు. 'ఐశ్వర్యం పోయింది. బంధువులంతా నాశనమయ్యారు. ఇంత దారుణం జరిగినా చావులేదు నాకు' అని వాపోయాడు గుడ్డిరాజు.

వ్యాసమహాముని ధృతరాష్ట్రుడ్ని ఓదారుస్తూ 'నాయనా! నీకు ధర్మం తెలుసు. అందుకే నేను నీకు ధైర్యం చెప్పడానికి వచ్చాను. ఎవ్వరి ప్రాణాలూ శాశ్వతం కాదు. ఈ సత్యాన్ని మనస్సుకు బాగా పట్టించుకున్నావంటే ఇంక నీకే దుఃఖమూ వుండదు. ఇప్పుడు విచారిస్తున్నావు. కాని జూదం ఆడిననాడు విదురుడెంత చెప్పినా విన్నావా? దైవకృత్యాన్ని మనుషులు తప్పించగలరా?' అన్నాడు.

'రాజా! ఒకనాడు దేవసభకు వెళ్ళాను. నేను దేవతలతో, మహామునులతో మాట్లాడుతున్న సమయంలో భూదేవి ఏడుస్తూ వచ్చిందక్కడికి.

'నా భారం తొలగిస్తామని మీరంతా బ్రహ్మసభలో ప్రతిజ్ఞలు పలికారు. ఇప్పుడిలా ఎందుకు ఆలస్యం చేస్తున్నారో తెలియడం లేదు. ఇంక నా భారం తొలిగే మార్గమేమిటి?' అని దేవతలను ప్రశ్నించిందామె. 'ధృతరాష్ట్రుడనే రాజుకు నూరుగురు కొడుకులు పుడతారు. వాళ్ళలో పెద్దవాడైన దుర్యోధనుడివల్ల నీ భారమంతా నశిస్తుంది. వాడ్ని చంపడానికీ, రక్షించడానికీ ముందుకువచ్చి భూమి మీద వున్న రాజులంతా వారి వారి సేనలతో సహా కురుక్షేత్రంలో

హతులవుతారు. ఆ దుర్యోధనుడు కూడా తమ్ములతోపాటు మరణిస్తాడు. అంతటితో నీ భారం తీరిపోతుంది వెళ్ళు! నిశ్చింతగా భూతధారణం చెయ్యి' అన్నాడు నారాయణుడు చిరునవ్వుతో. ఇంక కౌరవులు నాశనమయ్యారంటే ఆశ్చర్యమేముంది రాజా! విధిని ఎవరు తప్పిస్తారు?' అన్నాడు వ్యాసుడు.

ధృతరాష్ట్రుడు ధైర్యం తెచ్చుకుని గాంధారినీ, కుంతినీ, కోడళ్ళనూ వెంట బెట్టుకుని యుద్ధభూమికి బయలుదేరాడు.

పెదతండ్రి వస్తున్నాడని తెలిసి ధర్మనందనుడు ముందే అక్కడికి వెళ్ళాడు. అతనివెంట తమ్ములూ, ద్రౌపదీ, కృష్ణుడూ కూడా వున్నారు.

ధర్మరాజు కంటపడగానే ధృతరాష్ట్రుడి కోడళ్ళందరూ బిగ్గరగా ఏడ్చారు. దుఃఖంతో, ఆవేశంతో పేరుపేరునా పాండవులందర్నీ నిందించారు.

కళ్ళనీళ్ళు కారుస్తూ మౌనంగా తల వంచుకున్నాడు ధర్మరాజు. ఒక్క మాట కూడా మాట్లాడలేదు. వెళ్ళి ధృతరాష్ట్రుడి పాదాలకు నమస్కరించాడు. గాంధారి కోపంతో మండిపడింది.

'శత్రువుల్ని చంపొచ్చు! కానీ ఈ గుడ్డివాళ్ళిద్దరికీ ఊతకర్రగా ఒక్కడినయినా మిగల్చకుండా అందర్నీ నాశనంచేశారే! మీకు అపకారం చెయ్యనివాడు వందమందిలో ఒక్కడయినా లేకపోయాడా? ఒక్కడ్ని అట్టేపెడితే మీ ప్రతిజ్ఞ భంగమవుతుందా? ఆ ఒక్కడూ మిమ్మల్ని రాజ్యం చెయ్యనివ్వకుండా అడ్డగిస్తాడా? ఇంతకూ ఏడీ మీ మహారాజు?' ఎర్రబడిన ముఖంతో ప్రశ్నించింది గాంధారి.

అజాతశత్రువు చేతులు జోడించి ఆమె పాదాల దగ్గర మోకరిల్లాడు. గాంధారి తలవంచి దీర్ఘంగా నిట్టూర్చింది. నేత్రాలను బంధించిన వస్త్రం సందులోంచి ఆ మహాసాధ్వి దృష్టి లిప్తపాటు ధర్మరాజు కాలిగోళ్ళమీద పడింది. ఆ గోళ్ళు వెంటనే ఎర్రగా కందిపోయాయి. అది చూసి హడలిపోయి కృష్ణుడి వెనకాల

దాగాడు అర్జునుడు.

'నాయనా! వెళ్ళి కుంతీదేవిని చూడండి' అంది గాంధారి.

కోపాన్ని శమింపచేసుకుని 'వాసుదేవా! ఇలా రావయ్యా' అని పిలిచింది గాంధారి.

వచ్చాడాయన.

'చంపించావు. దేశాలన్నీ తగులబెట్టావు. జనక్షయానికి కారకుడవైన జనార్దనా! దీని ఫలం నువ్వు అనుభవించు. నా పాతివ్రత్య పుణ్యఫల తపశ్శక్తితో పలుకుతున్నాను – నువ్వు వీళ్ళందర్నీ ఇలా చంపావు కనుక ఈనాటికి ముప్ఫై ఆరో సంవత్సరంలో  నీ జ్ఞాతులు కూడా వీళ్ళలాగే పరస్పరం కలహించుకుని చస్తారు. అదే సమయాన నువ్వు దిక్కులేక నీచపు చావు చస్తావు. మీ కులస్త్రీలు కూడా ఇలాగే అందర్నీ తలచుకుని ఏడుస్తారు. ఇది ఇలాగే జరుగుగాక' అని శపించింది గాంధారి.

సమ్మోహకరంగా చిరునవ్వు నవ్వాడు కృష్ణుడు.

'అమ్మా! ఈ శాపం యాదవులకు ఇదివరకే ఇచ్చారు కొందరు మునులు. నువ్విప్పుడు చర్విత చరణం చేశావు. యదువంశీయులను దేవతలు కూడా చంపలేరు. అందుచేత వాళ్ళలో వాళ్ళే కొట్టుకుని చావు తెచ్చుకుంటారు. పోనీలే కానీ అందువల్ల నీకేం వస్తుంది చెప్పు?' అన్నాడు నవ్వుతూనే.

పుత్రశోకంతో పరితపిస్తూ అవధులెరగని ఆక్రోశంతో అచ్యుతుని శపించిన గాంధారి జవాబు చెప్పలేక మౌనం వహించింది.

# యాదవ ముసలం

కణ్వ, విశ్వామిత్ర, నారద మహర్షులు ముగ్గురూ కృష్ణభగవానుడ్ని చూడటానికని ద్వారకానగరానికి బయలుదేరారు. వాళ్ళు రాజవీధిని వస్తూ ఉండడం చూశారు యాదవులు!

వాళ్ళకి దుర్బుద్ధి పుట్టింది.

కృష్ణుడి కొడుకు సాంబుడికి ఆడపిల్ల వేషం వేసి తీసుకొచ్చి 'అయ్యా! ఇది బభ్రుడి భార్య. దీనికి సంతానం కలుగుతుందా?' అని అడిగారు యదు కుమారులు.

అంతమాత్రం తెలుసుకోలేరు గనుకనా ఆ మహర్షులు!

'ఆహా! సంతానం కలుగుతుంది!! వీడు కృష్ణుడి కొడుకు సాంబుడని తెలుసు! వీడికి యాదవవంశాన్ని నాశనం చేసే ముసలం పుడుతుంది. కృష్ణుడూ, బలరాముడూ తప్ప తక్కిన యాదవులంతా ఆ రోకలివల్ల చస్తారు. బలరాముడు అధిక నిష్ఠతో శరీరం విడిచి సముద్రంలో ప్రవేశిస్తాడు. నేలమీద పడుకుని వుండగా కృష్ణుడ్ని 'జర' అనే రాక్షసి పట్టి ఆక్రమిస్తుంది, పొండి' అన్నారు వాళ్ళు కోపంగా.

ఇంత జరిగిన తరువాత ఇంక వాసుదేవుడ్ని చూడడం మంచిది కాదని తలచి మహర్షులు ముగ్గురూ వెనక్కి తిరిగి వెళ్ళిపోయారు.

కృష్ణుడు ఇదంతా తెలుసుకుని జరగవలసింది జరిగే తీరుతుందనుకుని ఉదాసీనంగా వూరుకున్నాడు.

ఆ మరునాడు సాంబుడి కడుపులోంచి భయంకరంగా వున్న ఒక రోకలి పుట్టింది. యాదవులందరూ భయంతో పరుగెత్తుకువెళ్ళి ఆ సంగతంతా వసుదేవుడికి చెప్పారు. ఆ వుత్పాతానికి కారణం తెలుసుకుని బాధపడిన వసుదేవుడు 'ఆ రోకలిని పిండి పిండి చేసి సముద్రంలో కలిపి రండి' అని ఆజ్ఞాపించాడు. యాదవులంతా వెళ్ళి ఆయన చెప్పినట్లే చేశారు.

కాని గాంధారి శాపం, మహర్షుల ఆగ్రహం ఎక్కడికి పోతాయి?

ద్వారకాపట్టణంలో అనేక ఉత్పాతాలు కనిపించాయి. రాత్రివేళల్లో చిలుకలు గుడ్లగూబల్లా అరవసాగాయి. పగలు మేకలు నక్కల్లా కూశాయి. ఆవులకు గాడిదలు, ముంగిసలకు ఎలుకలూ, కుక్కలకు పిల్లులూ పుట్టాయి. కృష్ణ, బలరాములు తప్ప మిగిలిన యాదవులందరూ సజ్జనులను బాధపెట్టడం మొదలు పెట్టారు. గురువులను అవమానించారు. స్త్రీలు ఇష్టం వచ్చినట్లు సంచరించారు. కూడూ, కూరలూ అప్పుడే పొయ్యిమీద నుంచి దింపినాసరే – పురుగులు పట్టడం మొదలయ్యింది. ఈ అశుభసూచనలన్నీ చూసి గాంధారి శాపం ఫలించే సమయం ఆసన్నమైందనుకున్నాడు కృష్ణుడు. యాదవులు తీర్థసమీపంలో చావడం మంచిదనుకున్నాడు. ఇంక తెల్లవారితే వాళ్ళంతా కాలం చేస్తారనగా అంతకుముందు రోజే కొలువుతీర్చి 'సముద్రానికి జాతర చెయ్యాలి – అందరూ బయలుదేరండి' అని ఆజ్ఞ యిచ్చాడు.

ముంచుకు వస్తున్న ప్రమాదాన్ని గ్రహించుకోలేక పానీయాలూ, భక్ష్యభోజ్యాలు, మాంసాహారాలూ సమకూర్చుకుని అందంగా అలంకారాలు చేసుకుని చతురంగ బలాలతో సంబరంగా కదిలారు యాదవులు.

నిర్వికారుడై బయలుదేరాడు కృష్ణుడు.

అందరూ సముద్ర తీరాన వున్న పందిళ్ళ దగ్గరకు చేరుకున్నారు. బలరాముడు మాత్రం అరణ్యాలకు వెళ్ళాడు. యాదవులు తెచ్చుకున్న భక్ష్యాలన్నీ తిన్నారు. ప్రభువైన కృష్ణుడి ఎదురుగానే మత్తుపానీయాలు సేవించారు. చమత్కారానికీ, వెటకారానికీ, చీదరింపుకీ మధ్య సరిహద్దులు గమనించకుండా అసంబద్ధ ప్రేలాపన సాగిస్తూ నవ్వడం మొదలుపెట్టారు.

'ప్రద్యుమ్నా! అడుగో కృతవర్మ! చూశావా! నిద్రపోతున్న వాళ్ళను చంపాడు. ఏం పౌరుషంరా! ఎంత నీచుడైన అలాంటి పని చేస్తాడా?' అంటూ సాత్యకి కృతవర్మను ఎగతాళి చేశాడు.

'అర్జునుడు చెయ్యి నరికితే వాలిపోయిన భూరిశ్రవుడ్ని చంపావు నువ్వు. అది మరచిపోయావా? నువ్వు చేసింది రణనీతి కాబోలు' అని కృతవర్మ సాత్యకిని ఆక్షేపించాడు.

ఆ ఎకసక్కేనికి సాత్యకికి కోపం వచ్చి, కత్తిలాగి గబగబా వెళ్ళి కృతవర్మ కంఠం నరికేశాడు. సముద్ర తీరాన తుంగై మొలచిన రోకలి ప్రభావం ఆ నిముషంలో ఆ కత్తిని ఆక్రమించివుంది. అంతటితో వూరుకోక సాత్యకి భోజులందరి మీదకు విజృంభించాడు. వారించడానికి కృష్ణుడు వెళ్ళేలోగా భోజులంతా సాత్యకిని చుట్టుముట్టారు. అయితే జరగబోయేదంతా తెలిసిన వాడవడం వల్ల కాలస్వరూపుడైన కృష్ణుడు సాత్యకిని రక్షించే ప్రయత్నం చెయ్యలేదు.

సాత్యకిని కాపాడడం కోసం ప్రద్యుమ్నుడు చెలరేగాడు. ఈ విధంగా వాళ్ళల్లో వాళ్ళకు కయ్యం ప్రారంభమైంది. ఆ సముద్రతీరంలో మొలచిన తుంగ పీకి దాంతో ఒకరినొకరు కొట్టుకుని విగతులయ్యారు వాళ్ళందరూ. ఆనాడు వాళ్ళు అరగదీసి సముద్రంలో కలిపిన రోకలే ఆ తుంగై మొలిచింది. అదే వాళ్ళ యుద్ధానికి సాధనమై, చావుకు కారణమైంది.

చావకుండా మిగిలిన వాళ్ళను కోపంతో తుంగతో మోది చంపాడు కృష్ణుడు. ఆయనకు ఆ కోపం కూడా మునుల శాపంవల్లే కలిగింది. దారుకుడూ, బభ్రుడూ తప్ప మిగిలిన యాదవులంతా నాశనమయ్యారు. వాళ్ళిద్దర్నీ వెంటబెట్టుకొని బలరాముడు వెళ్ళిన మార్గానే వెళ్ళసాగాడు కృష్ణుడు.

# శ్రీకృష్ణ నిర్యాణం

దారుకుడ్నీ, బభ్రుడ్నీ వెంటపెట్టుకుని బలరాముడిని వెతుకుతూ బయలుదేరాడు కృష్ణుడు. కొంతదూరం వెళ్ళేసరికి ఒక చెట్టుకింద అన్న కనిపించాడు.

'దారుకా! నువ్వు వెళ్ళి పాండవులతో యాదవనాశనం గురించి చెప్పి అర్జునుడ్ని తీసుకురా. బభ్రూ! నువ్వు ఆడవాళ్ళనందర్నీ పట్టణానికి చేర్చి మళ్ళీరా' అని ఆజ్ఞాపించాడు కృష్ణుడు.

ఇద్దరూ బయలుదేరారు.

కనుచూపు మేరలోనే ఒక బోయవాడు బభ్రుడ్ని తుంగతో మోది చంపాడు.

అది చూసి మునివర్యుల శాపశక్తికి ఆశ్చర్యపడ్డాడు కృష్ణుడు.

బలరాముని దగ్గరకువెళ్ళి 'అన్నా! నేను ఈ వాహనాలనూ వనితలనూ మన పురానికి తీసుకువెళ్లి తండ్రి ఆజ్ఞ తీసుకునివస్తాను. అందాకా నువ్వు ఇక్కడే వుండు' అని చెప్పి ద్వారకానగరానికి వెళ్ళాడు. వసుదేవుడ్ని చూశాడు. 'తండ్రీ! ఇంతవరకు కౌరవనాశనం, ఇప్పుడు యాదవనాశనం చూశాను. బంధుమిత్రులెవరూ లేని ఈ నగరంలో వుండబుద్ధి కావడం లేదు నాకు. అన్న ఎలాగూ అరణ్యాల్లోనే వున్నాడు. నేను కూడా వెళ్ళి అన్నతోపాటు తపస్సు

చేసుకుంటాను. ఇంక అన్ని విషయాలూ మీరే చూసుకోండి. రేపోమాపో అర్జునుడు వస్తాడు. మీ ఆజ్ఞలను పాటిస్తాడు' అంటూ తండ్రి పాదాలకు కడసారిగా నమస్కరించాడు కృష్ణుడు. ఆ వృద్ధమూర్తి మాటలురాక చేష్టలు దక్కి మూగబోయాడు.

యాదవ స్త్రీలంతా ఘొల్లున ఏడ్చారు. కృష్ణుడు కరిగిపోయి 'ఇప్పుడే వస్తాడు అర్జునుడు. మీ కష్టాలన్నీ తీరుస్తాడు. ఊరుకోండి' అని వాళ్ళందర్నీ ఊరడించాడు. తండ్రికి నచ్చచెప్పి ఆయన దగ్గర సెలవు తీసుకుని బలరాముడి దగ్గరకు వచ్చాడు కృష్ణుడు.

'అన్నా! తపస్సు చేసుకునేందుకు తండ్రిగారి అనుమతి తీసుకుని వచ్చాను' అన్నాడు.

ఆ సమయంలో బలరాముని ముఖంలోంచి ఒక మహాసర్పం బయటకు వచ్చింది. ఎర్రటి తలలు వెయ్యి వున్నాయి దానికి. దాని పడగలు మణులతో వెలిగిపోతున్నాయి. తెల్లటి శరీర ఛాయ! పర్వతమంతటి దేహం! బలరాముడు యోగబలంతో తన శరీరం విడిచి నిజరూపం ధరించి సముద్రమార్గాన వెళ్ళిపోయాడు. సర్ప సమూహాలన్నీ వచ్చి భక్తితో సేవించాయి. గంగానది మొదలుగా గల మహానదులన్నీ ఆకారాలు ధరించి వచ్చి ఆయనను ఆదరించాయి. అదంతా కృష్ణుడు దివ్యదృష్టితో చూస్తుండగానే అనంతుడు తన అంశ అయిన ఆ మహాసర్పాన్ని తనలో లీనం చేసుకున్నాడు.

ఛత్రమూర్తి తనను విడిచి వెళ్ళగానే కర్తవ్యచింత ఆవహించింది కృష్ణుడ్ని. భూలోకంలో చెయ్యవలసిన పనులన్నీ అయిపోయాయి. శరీరం విడిచి పెట్టటానికి ఏ కారణం దొరుకుతుందా అని ఆలోచించసాగాడు అచ్యుతుడు. ఒకప్పుడు రుక్మిణీ సహితంగా దుర్వాసుని సేవించిన సందర్భంలో తను ఆయన అరికాలిలో పాయసం రాయకపోవడం, అందువల్ల 'నీకు అరికాలిద్వారా అపాయం కలుగుతుంది' అని ఆ మహర్షి అనడం గుర్తుకువచ్చాయి. వెంటనే

సమాధిస్థితి పొంది నేలమీద పవళించాడు జలధిశయనుడు.

అప్పుడు జర భయపడుతూ మెల్లమెల్లగా అక్కడికి రాసాగింది. ఆ చుట్టుపక్కల తిరుగుతున్న వేటగాడొకడు కనిపించాడు. అతడికి కృష్ణుడిపాదం లేడిపిల్ల ముఖంలా భ్రమ గొలిపేటట్టు చేసింది జర. అల్లంత దూరంనుంచి చూసి ఆ వేటగాడు ఆ రోజు తనకు మంచి లేడి దొరికిందనుకుంటూ గురిచూసి బాణం విడిచాడు. అది వెళ్ళి హరి అరికాలిలో గుచ్చుకుని పాదం పైనుంచి దూసుకు పోయింది.

ఆ బోయవాడు దగ్గరకు వచ్చి పరమాత్ముడ్ని చూసి తన తప్పు తెలుసుకుని ఆయన పాదాలమీద పడ్డాడు. పెద్దగా ఏడవటం మొదలుపెట్టాడు. నిరాకారుడు అయిన వేదమూర్తి అతడ్ని ఓదార్చి పంపేసి ఆ వంకతో మానవదేహాన్ని విడిచిపెట్టాడు.

ఊర్ధ్వలోకాలకు వెళ్ళగానే ఆదివిష్ణువును ఇంద్రాది దేవతలంతా భక్తితో కొలిచారు. పరమపాదాలకు ప్రణమిల్లారు.

'ఆదిపురుషా! ధర్మరక్షణకోసం లీలామానుషరూపుడవై పుట్టావు. శత్రువులందర్నీ చంపావు. ప్రతి యుగంలోనూ ఇలాగే అవతరించి ధర్మరక్షణ చేస్తూ వుండు' అంటూ ప్రార్థించారు. ఇంద్రుడు మహావిష్ణువుమీద పుష్పవర్షం కురిపించాడు. బ్రహ్మదేవుడు హరిపాదాలకు నమస్కరించి వేద వాక్కులతో స్తుతించాడు. వాళ్ళ భక్తికి ప్రీతిపొంది, 'అనిరుద్ధ ప్రద్యుమ్న సంకర్షణ వాసుదేవ భావాలు కలిగి సిద్ధిని పొందాను. నా స్థానాన్ని నేను చేరుకుంటాను. మీరు సుఖంగా వుండండి' అని అంతర్హితుడయ్యాడు మహావిష్ణువు.

ఇంద్రియాలకు కనిపించని ఆ పరమాత్ముడ్ని బుద్ధితో చూస్తూ, ఆయన అద్భుత లీలలను వర్ణించుకుంటూ బ్రహ్మాదిదేవతలంతా తమ తమ స్థానాలకు తరలివెళ్ళారు.

భాగవతమైన భాగవతం ఆధ్యాత్మికలోతులను కలిగిన ఆనంద రసమయసాగరం. భవరోగ నివారణకు దివ్య ఔషధం. ఇటువంటి భాగవతాన్ని చదువరులకు ఆసక్తి కలిగించే విధంగా చిన్నకథల రూపంలో అందించేందుకు ప్రయత్నించిన శ్రీ ప్రయాగ రామకృష్ణ గారి కృషి అభినందనీయమైనది. సరళమైనశైలిలో సర్వజనరంజకంగా ఆసక్తికరంగా ఉండేందుకు ఆయన చేసిన ప్రయత్నం ప్రశంసనీయం.

**స్వామి జ్ఞానదానంద,** రామకృష్ణ మఠ్

ప్రయాగ రామకృష్ణ గారి భాగవతంలో చిన్నకథలలో అటు వేదాంతం, తాత్త్వికధోరణి, ఇటు కవిత్వ అభివ్యక్తీకరణ చెట్టాపట్టాలేసుకుని చిందులు తొక్కాయి.

ఈ భాగవతంలోని చిన్నకథలు, నవ్య వారపత్రికలో ధారావాహికగా ప్రచురితమై ప్రజామోదాన్ని పొందగలగటానికి భాగవతంలోని కథల నిత్యమైన సత్యమైన ఆకర్షణ ఒక ఎత్తయితే - రామకృష్ణగారి కథాకథనశైలీమాధుర్యం మరో బలవత్తరమైన ఆకర్షణ అయి నిలిచింది.

**దత్తప్రసాద్ పరమాత్ముని**

హిందీ శాఖాధిపతి (రిటైర్డ్), హిందూ కాలేజి, గుంటూరు